కరీంనగర్ వార్త

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

బుధవారం 02, సెప్టెంబర్ 2026 16 పేజీలు



16లో

ప్రత్యామ్నాయ పంటల సాగుతో నిరంతర ఆదాయం..

ఎల్ నినో ప్రభావానికి అధిగమించేందుకు వినూత్న విధానంలో రైతులు ముందుకు : కలెక్టర్ గరిమ అగ్రవాల్..



నాణ్యతలో రాజీ వద్దు..

పనులు వేగవంతం చేయాలి

2లో

మార్చిలోగా ఆర్‌అండ్‌బీ పనులన్నీ పూర్తి చేయాలి

క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ అవసరం : కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త: జిల్లాలో చేపడుతున్న ఆర్‌అండ్‌బీ (రోడ్లు, భవనాలు) అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడొద్దని స్పష్టం చేశారు. ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడే నాణ్యమైన రహదారులు, భవనాలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని సూచించారు.మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.



2లో

ఎస్సీ, ఎస్టీల సంక్షేమమే లక్ష్యం

పథకాల అమలులో జాప్యం వద్దు

సబ్‌ప్లాన్ నిధులు పూర్తిస్థాయిలో వినియోగించాలి

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

జగిత్యాల బ్యూరో, ప్రభాతవార్త: ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. మంగళవారం జగిత్యాల సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లతతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.

2లో

- ఉద్యోగులందరికీ పీఎంఈ తప్పనిసరి..
- వయసుతో సంబంధం లేకుండా కొత్త విధానం
- పరీక్షలకు గైర్హాజరైన వారిపై యాజమాన్యం దృష్టి..
- అన్ని ఏరియాలకు ఆదేశాలు .. కార్మికుల్లో కొత్త ఆందోళన
- ఆరోగ్య సమస్య తేలితే ఉద్యోగ భద్రత సంగతేంటి?..
- వైద్య పరీక్షలు భరోసా కల్పించేలా ఉండాలి.. సంఘాల డిమాండ్



సింగరేణిలో లేబర్ కోడ్ ఘరూ?

ఇక ఏటా వైద్య పరీక్ష!

గోదావరిఖని, ప్రభాతవార్త: సింగరేణి ఉద్యోగుల పీరియాడికల్ వైద్య పరీక్షల విధానంలో కీలక మార్పు చోటుచేసుకుంది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్ అండ్ వర్కింగ్ కండిషన్స్ కోడ్-2020 పరిధిలోని నిబంధనల మేరకు మైనింగ్ రంగంలో పనిచేసే ఉద్యోగులకు ఏటా ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం తప్పనిసరి కానుంది. దీంతో ఇప్పటివరకు అమల్లో ఉన్న నిర్ణీత వ్యవధుల వైద్య పరీక్షల స్థానంలో వార్షిక పరీక్షల విధానం అమలులోకి వచ్చింది.

నాణ్యతలో రాజీ వద్దు..

పనులు వేగవంతం చేయాలి

మార్చిలోగా ఆర్‌అండ్‌బీ పనులన్నీ పూర్తి చేయాలి

క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ అవసరం : కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త: జిల్లాలో చేపడుతున్న ఆర్‌అండ్‌బీ (రోడ్లు, భవనాలు) అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడొద్దని స్పష్టం చేశారు. ప్రజలకు దీర్ఘకాలికంగా ఉపయోగపడే నాణ్యమైన రహదారులు, భవనాలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని సూచించారు.మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో కొనసాగుతున్న రహదారులు, భవనాలు, ఇతర మౌలిక వసతుల పనుల పురోగతిని మండలాల వారీగా పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తయిన పనులు, నిర్మాణ దశలో ఉన్నవి, ప్రారంభం కానివి, వివిధ కారణాలతో పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

మార్చిలోగా లక్ష్యం పూర్తి

జిల్లాలో చేపడుతున్న ఆర్‌అండ్‌బీ పనులను ప్రాధాన్య క్రమంలో గుర్తించి వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఇప్పటికే ప్రారంభమైన పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనులు ప్రారంభం కాని చోట్ల వెంటనే చర్యలు చేపట్టి నిర్మాణాలు ప్రారంభించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.వివిధ దశల్లో ఉన్న పనులకు సంబంధించి ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. అవసరమైతే సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ప్రతి పనికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని ముందుకు సాగాలని ఆదేశించారు.

నాణ్యతపై ప్రత్యేక దృష్టి

రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పనుల్లో నాణ్యత లోపిస్తే ప్రజాధనం వృథా కావడమే కాకుండా ప్రజలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. అందువల్ల ప్రతి దశలోనూ నిబంధనల ప్రకారం పనులను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.నిర్మాణ సామగ్రి నాణ్యత, పనుల ప్రమాణాలు, నిర్దేశిత కొలతలు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని సూచించారు. రహదారులు నిర్మించిన కొద్ది కాలానికే దెబ్బతినే పరిస్థితి రాకుండా పర్యవేక్షణ ఉండాలని అన్నారు. పనుల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు.



కాంట్రాక్టర్లతో సమన్వయం

పనుల పురోగతిలో కాంట్రాక్టర్ల పాత్ర కీలకమని పేర్కొన్న కలెక్టర్.. సంబంధిత అధికారులు వారితో నిరంతరం సమన్వయం చేసుకోవాలని సూచించారు. కాంట్రాక్టర్లు నిర్దిష్ట గడువులోగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పనుల్లో జాప్యానికి కారణాలను గుర్తించి వాటిని అధిగమించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలన్నారు.అలాగే పూర్తయిన పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపులు, పనుల పురోగతి, నాణ్యత తదితర అంశాలను సమర్థవంతంగా పర్యవేక్షించాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు పనులు జరుగుతున్నాయా లేదా అన్న అంశంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ తప్పనిసరి

కార్యాలయాల్లో కూర్చొని పనుల పురోగతిని తెలుసుకోవడం కాకుండా అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పనులను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. నిర్మాణ పనుల వద్ద ఎదురవుతున్న సమస్యలను ప్రత్యక్షంగా గుర్తించి అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ప్రతి మండలంలో చేపడుతున్న ఆర్‌అండ్‌బీ పనులకు సంబంధించి పనుల వారీగా పురోగతిని నమోదు చేసుకోవాలని, నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పనులు జరుగుతున్నాయా లేదా నిరంతరం పరిశీలించాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పనులను ప్రత్యేకంగా గుర్తించి వాటి పూర్తికి ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు.

ప్రజలకు నాణ్యమైన మౌలిక వసతులు

ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. అందులో భాగంగా నిర్మిస్తున్న రహదారులు, భవనాలు ప్రజలకు దీర్ఘకాలం ఉపయోగపడేలా ఉండాలన్నారు. కేవలం పనులను పూర్తి చేసినట్లు చూపించడం కాకుండా నాణ్యతతో కూడిన నిర్మాణాలను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.జిల్లాలోని ప్రతి మండలంలో జరుగుతున్న పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మార్చి నెలలోగా నిర్ణయించిన లక్ష్యాలను పూర్తి చేసే దిశగా సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఈఈ భావ్‌సింగ్, డీఈలు, ఏఈలు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల సంక్షేమమే లక్ష్యం

పథకాల అమలులో జాప్యం వద్దు

సబ్‌ప్లాన్ నిధులు పూర్తిస్థాయిలో వినియోగించాలి

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

జగిత్యాల బ్యూరో, ప్రభాతవార్త: ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. మంగళవారం జగిత్యాల సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లతతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఎస్సీ, ఎస్టీ కాలనీల అభివృద్ధికి సబ్‌ప్లాన్ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలని సూచించారు. ఎస్సీ ప్రాంతాలకు 15 శాతం, ఎస్టీ ప్రాంతాలకు 10 శాతం నిధులు కేటాయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిధులతో రహదారులు, డ్రైనేజీ వంటి మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు.

రిజర్వేషన్లు పక్కాగా అమలు చేయాలి

నియామకాలు, పదోన్నతుల్లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. ఔట్‌సోర్సింగ్ నియామకాల్లోనూ రోస్టర్ పాటించాలన్నారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు రూ.30 లక్షల బీమా కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

బాధితులకు సత్వర పరిహారం

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు పరిహారం, ఉద్యోగాలు సత్వరం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అట్రాసిటీ కేసుల్లో దర్యాప్తును పకడ్బందీగా నిర్వహించి శిక్షల శాతం పెంచాలని సూచించారు. మండల కేంద్రాల్లో సివిల్ రైట్స్ డే కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు.

అంగన్‌వాడీలకు సొంత భవనాలు

అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించేందుకు అంచనాలు సిద్ధం చేసి పంపించాలని సూచించారు. అట్రాసిటీ బాధిత కుటుంబాలకు 2బీహెచ్‌కే ఇళ్లు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 85 కులాంతర వివాహ ప్రోత్సాహక దరఖాస్తులు, బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌కు సంబంధించి రూ.2.42 కోట్ల బకాయిలు ఉన్నాయని అదనపు కలెక్టర్ లత తెలిపారు. ఇటీవల 185 మంది అట్రాసిటీ బాధితులకు రూ.1.06 కోట్లకుపైగా పరిహారం విడుదల చేసినట్లు వివరించారు.

అదనపు కలెక్టర్ రెవెన్యూ లత మాట్లాడుతూ

జిల్లాలో 85 కులాంతర వివాహ ప్రోత్సాహక దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌కు సంబంధించి సుమారు రూ.2.42 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితుల్లో ఐదుగురికి శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు.వారం రోజుల క్రితం 185 మంది బాధితులకు రూ.1.06 కోట్లకు పైగా పరిహారం విడుదలైందని, ఆ మొత్తం వెంటనే వారి ఖాతాల్లో జమ కానుందని తెలిపారు. మరో 91 మంది బాధితులకు రూ.69.45 లక్షల పరిహారం పెండింగ్‌లో ఉందని, ఉన్నతాధికారుల సమాచారం మేరకు వారంలోగా విడుదల కానుందని వివరించారు.పీఎం అజయ్ పథకం కింద 144 యూనిట్లు గ్రౌండింగ్ కాగా, మరో 30 యూనిట్లు పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు తెలిపారు. ఎస్సీ యాక్షన్ ప్లాన్ కింద 317 యూనిట్ల లక్ష్యానికి గాను 219 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు వివరించారు.గత సంవత్సరం పదో తరగతి ఫలితాల్లో జగిత్యాల జిల్లా రాష్ట్రంలో నాలుగో స్థానంలో నిలిచినట్లు అధికారులు తెలిపారు.

అదనపు ఎస్పీ చేతన్ నితిన్ మాట్లాడుతూ

జిల్లాలో మొత్తం 973 ఎస్సీ, 138 ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయని తెలిపారు. వీటిలో 870 కేసుల్లో ట్రూ ఎఫ్ఐఆర్ ఫైనలైజ్ కాగా, 787 కేసుల్లో చార్జిషీట్లు దాఖలు చేసినట్లు వివరించారు. 295 కేసుల్లో నిందితులు నిర్దోషులుగా విడుదలైనట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి సంబంధించిన ప్రతి అంశాన్ని అధికారులు ప్రాధాన్యతతో తీసుకొని, పథకాల అమలులో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, లక్ష్మీనారాయణ, ప్రవీణ్, ఆర్డీవోలు, డీఎస్పీలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సింగరేణిలో లేబర్ కోడ్ షురూ?

ఇక ఏటా వైద్య పరీక్ష!

ఉద్యోగులందరికీ పీఎంఈ తప్పనిసరి..

వయసుతో సంబంధం లేకుండా కొత్త విధానం

పరీక్షలకు గైర్హాజరైన వారిపై యాజమాన్యం దృష్టి..

అన్ని ఏరియాలకు ఆదేశాలు

ఆరోగ్య సమస్య తేలితే ఉద్యోగ భద్రత సంగతేంటి?..

కార్మికుల్లో కొత్త ఆందోళన

వైద్య పరీక్షలు భరోసా కల్పించేలా ఉండాలి..

సంఘాల డిమాండ్

గోదావరిఖని, ప్రభాతవార్త: సింగరేణి ఉద్యోగుల పీరియాడికల్ వైద్య పరీక్షల విధానంలో కీలక మార్పు చోటుచేసుకుంది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్ అండ్ వర్కింగ్ కండిషన్స్ కోడ్-2020 పరిధిలోని నిబంధనల మేరకు మైనింగ్ రంగంలో పనిచేసే ఉద్యోగులకు ఏటా ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం తప్పనిసరి కానుంది. దీంతో ఇప్పటివరకు అమల్లో ఉన్న నిర్దిష్ట వ్యవధుల వైద్య పరీక్షల స్థానంలో వార్షిక పరీక్షల విధానం అమలులోకి వచ్చింది.ఇప్పటివరకు వయసును బట్టి నిర్దిష్ట వ్యవధుల్లో నిర్వహిస్తున్న పీరియాడికల్ మెడికల్ ఎగ్జామినేషన్ (పీఎంఈ) ను ఇకపై ప్రతి ఉద్యోగికీ ఏడాదికోసారి తప్పనిసరిగా నిర్వహించాలని సింగరేణి యాజమాన్యం ఆదేశించింది. అధికారులు, కార్మికులు అనే తేడా లేకుండా సంస్థలోని అన్ని వర్గాల ఉద్యోగులు ఈ పరీక్షలకు హాజరు కావాల్సి ఉంటుంది. ఆగస్టు 28న సంస్థ భద్రతా విభాగం జారీ చేసిన ఉత్తర్వులతో ఈ అంశం సింగరేణిలో చర్చనీయాంశంగా మారింది.

వయసుతో సంబంధం లేకుండా..

గతంలో 45 ఏళ్ల దాటిన ఉద్యోగులకు రెండున్నరేళ్లకు ఒకసారి, 45 ఏళ్లలోపు వారికి ఐదేళ్లకు ఒకసారి పీఎంఈ నిర్వహించే విధానం ఉన్నట్లు తాజా నివేదికలు పేర్కొంటున్నాయి. ఇప్పుడు వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఉద్యోగికీ ఏడాదికోసారి వైద్య పరీక్ష నిర్వహించాలన్న నిబంధన అమల్లోకి వచ్చింది. కేంద్ర ప్రభుత్వ వృత్తి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల నిబంధనల్లోని 2026 నిబంధనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు యాజమాన్యం స్పష్టం చేసింది.

పరీక్షలకు రాకపోతే చర్యలేనా? ....

ఇప్పటికే నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం కొంతమంది ఉద్యోగులు పీఎంఈలకు హాజరు కాలేదని యాజమాన్యం గుర్తించింది. దీంతో అన్ని ప్రాంతాల ప్రధానాధికారులు, సంస్థ కార్యాలయాల విభాగాధిపతులు తమ పరిధిలోని ఉద్యోగులందరూ తప్పనిసరిగా పీఎంఈలకు హాజరయ్యేలా చూడాలని ఆదేశాలు జారీ అయ్యాయి. సింగరేణిలో పీఎంఈ కేంద్రాలు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి. ఉద్యోగులకు ఛాతీ ఎక్స్‌రే, ఊపిరితిత్తుల సామర్థ్య పరీక్ష, వినికిడి పరీక్ష తదితర ఆరోగ్య పరీక్షలు నిర్వహించే సదుపాయాలు ఉన్నట్లు సంస్థ పత్రాల్లో పేర్కొంది.

ఆరోగ్యం తేలితే.. ఉద్యోగం సంగతేంటి?

ఇక్కడే కార్మికుల్లో అసలు ఆందోళన మొదలైంది. ఏటా పరీక్షలు నిర్వహించడాన్ని వ్యతిరేకించడం లేదని, అయితే పరీక్షల్లో ఆరోగ్య సమస్య బయటపడితే దాని ఆధారంగా విధుల నిర్వహణ, ఉద్యోగ కొనసాగింపు, వైద్యపరమైన నిర్ణయాలపై ఎలాంటి ప్రభావం ఉంటుందో స్పష్టత ఇవ్వాలని కార్మికులు కోరుతున్నారు. ముఖ్యంగా సుదీర్ఘకాలంగా గనుల్లో పనిచేస్తున్న, వయసు పైబడుతున్న ఉద్యోగుల్లో ఈ సందేహాలు ఎక్కువగా వ్యక్తమవుతున్నాయి.పీఎంఈ ఉద్దేశం ఉద్యోగిని తప్పుపట్టడం కాకుండా వ్యాధిని ముందుగానే గుర్తించి చికిత్స అందించడం కావాలని కార్మిక సంఘాలు అంటున్నాయి. సింగరేణి ఇప్పటికే పీఎంఈల ద్వారా ఆరోగ్య సమస్యలను గుర్తించి సంస్థ ఆసుపత్రుల్లో వైద్యం అందిస్తున్నట్లు అధికారిక పత్రాల్లో పేర్కొంది.

భయపెట్టే పరీక్షలు వద్దు..

కొత్త విధానంపై యాజమాన్యం-కార్మిక సంఘాల మధ్య స్పష్టమైన చర్చ జరగాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పీఎంఈలో ఏదైనా ఆరోగ్య సమస్య తేలితే ఉద్యోగికి తగిన వైద్యం, తదుపరి వైద్య పరీక్ష, అవసరమైన విధి మార్పు వంటి అంశాలపై స్పష్టమైన విధానం ఉండాలని కార్మికులు కోరుతున్నారు.ఆరోగ్య రక్షణ కోసం తీసుకొచ్చిన ఏటా పీఎంఈ విధానం ఉద్యోగుల్లో ఉద్యోగ భద్రతపై భయం కలిగించేలా కాకుండా.. ఆరోగ్యంపై భరోసా కల్పించేలా ఉండాలన్నదే ఇప్పుడు కార్మికుల ప్రధాన డిమాండ్.!



సీపీఎస్ రద్దు, డీఏల విడుదల, పీఆర్సీ అమలులో...

ప్రభుత్వం వెంటనే సానుకూల నిర్ణయాలు తీసుకోవాలి

టీజీఈజేఏసీ జిల్లా ఛైర్మన్ బొంకూరి శంకర్

పెద్దపల్లిలో పెన్షన్ విద్రోహ దినం

సెప్టెంబర్ 10న చలో హైదరాబాద్ మహాధర్నాకు పిలుపు

పెద్దపల్లి, ప్రభాతవార్త:



సీపీఎస్ రద్దు, డీఏల విడుదల, పీఆర్సీ అమలు వంటి అంశాల్లో ప్రభుత్వం వెంటనే సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని టీజీఈజేఏసీ జిల్లా ఛైర్మన్ బొంకూరి శంకర్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికుల హక్కుల సాధన కోసం తెలంగాణ గవర్నమెంట్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించిన పెన్షన్ విద్రోహ దినం చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించారు. ఐడీఓసీ ఆవరణలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద జిల్లాలోని వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు నల్ల దుస్తులు, నల్ల బ్యాడ్జీలు ధరించి పెద్ద ఎత్తున సమావేశమై ప్రభుత్వానికి నిరసన స్వరం వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇది కేవలం పెన్షన్ సమస్య కాదని, ఉద్యోగుల గౌరవం, భద్రతకు సంబంధించిన ఉద్యమమని పేర్కొంటూ, ప్రభుత్వం స్పందించకపోతే సెప్టెంబర్ 10న జరిగే చలో హైదరాబాద్ మహాధర్నాను చరిత్రాత్మక విజయంగా నిలబెడతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో టీజీఈజేఏసీ జిల్లా కన్వీనర్ తూము రవీందర్, టీజీఓ జిల్లా కార్యదర్శి గండు సురేష్, టీఎన్జీఓ జిల్లా కార్యదర్శి అయిరెడ్డి సందీప్ రెడ్డి, టీఎన్జీఓ రాష్ట్ర నాయకులు సందీప్ రావు, టీఎన్జీఓ అసోసియేట్ అధ్యక్షులు గోపు అనిత, కోశాధికారి కొమురయ్య, జిల్లా సంఘ బాధ్యులు శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, స్వప్న కుమారి, ప్రవీణ్, శ్రీధర్, రమేష్, రాజారత్నం, సౌమ్య, అంజయ్య, నిశాంత్ రావు, శిల్ప, స్వప్న, శివ, శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు రవీంద్రనాథ్, గోడిశాల శ్రీనివాస్, సాజిద్ అలీ, జిల్లా అధికారుల సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ రెడ్డి, సభ్యులు కంపెల్లి రమేష్, సురేష్, యుటిఎఫ్ అధ్యక్షులు లక్ష్మ ణ్, ఇంజనీరింగ్ అసోసియేషన్ సభ్యులు రవీంద్రచారి, నరేష్, సమర్ సేన్, మధుబాబు, టీఎన్జీఓస్ గ్రామీణ సంఘం కార్యదర్శి ప్రేమ్ సాగర్, సుల్తానాబాద్ యూనిట్ అధ్యక్షురాలు భాగ్యమ్మ, కార్యదర్శి రాజిరెడ్డి, రామగుండం యూనిట్ అధ్యక్షుడు జగన్, కార్యదర్శి సరిత, పీఏఓ ఫోరం ప్రతినిధులు మహేందర్ రెడ్డి, రామ్ కుమార్, ట్రెజరీ ఫోరం ప్రతినిధులు సంతోష్, శ్రీనివాస్, ప్రేమ్ సాగర్, స్వప్న కుమారి, మనెమ్మ, రవి, దివ్య, శ్యాం కుమార్, మెడికల్ ఫోరం ప్రతినిధులు వీరగోని శ్రీనివాస్, ప్రవీణ్, లక్ష్మ ణ్, రాజేశం, మధు, శ్రీనివాసులు, వెటరినరీ ప్రతినిధులు అధ్యక్షుడు రాజేందర్, కార్యదర్శి సాదిక్ తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

మైనర్ బాలిక అదృశ్యం కేసును చేధించిన పోలీసులు

అదుపులోకి నిందితులు: ముత్తారం ఎస్ ఐ ఎన్.రవికుమార్

ముత్తారం, ప్రభాతవార్త:

ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టి అదృశ్యమైన మైనర్ బాలికను సురక్షితంగా రక్షించామని ముత్తారం ఎస్ ఐ ఎన్.రవికుమార్ తెలిపారారు. ముత్తారం పోలీస్ స్టేషన్ పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యనభ్యసిస్తున్న మైనర్ బాలికను ఈ నెల 23న కవిత అనే మహిళ తాను బాలికకు పెద్దమ్మనని పరిచయం చేసుకుని, వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్తానని చెప్పి హాస్టల్ నుంచి తీసుకెళ్లిందని తెలిపారు. ఈ క్రమంలో బాలిక ఇంటికి చేరుకోకపోవడంతో, ఆమె తల్లి హాస్టల్‌కు వచ్చి విచారించగా, బాలికను కవిత అనే మహిళతో పంపించినట్లు హాస్టల్ సిబ్బంది తెలిపారు. బాలిక ఇంటికి తిరిగి రాకపోవడంతో, ఆమె ఆచూకీ తెలియకపోవడంతో తల్లి ఫిర్యాదుతో ముత్తారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బాలిక ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టి, బాలికను సురక్షితంగా గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి నిందితులను అదుపులోకి తీసుకున్నామని ఎస్ ఐ తెలిపారు. ఆ బాలికను సురక్షితంగా సఖి సెంటర్‌కు తరలించి, ఆమెకు అవసరమైన కౌన్సెలింగ్, సంరక్షణ, తదుపరి సహాయ చర్యలు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నిందితులపై దర్యాప్తు కొనసాగుతుందని, వారిపై చట్టపరంగా చర్యలుంటాయని తెలిపారు.

సిరిసిల్లలో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ మెరుపు దాడి

-ఐదుగురు అరెస్ట్

సిరిసిల్ల అర్బన్ ప్రభాత వార్త:



సిరిసిల్ల పట్టణ పరిధిలోని బైపాస్ రోడ్డు, రామప్ప దేవాలయ సమీపంలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న పేకాట స్థావరంపై జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం సాయంత్రం మెరుపు దాడి చేశారు.విశ్వసనీయ సమాచారంతో టాస్క్‌ఫోర్స్ ఎస్సై వెంకట్రాజం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆకస్మిక దాడిలో పేకాట ఆడుతున్న ఐదుగురు నిందితులను రెడ్‌హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.9,400 నగదు, 5 మొబైల్ ఫోన్లు, ఒక ఆటో మరియు 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.అరెస్ట్ అయిన వారి వివరాలు: జాగిరి మధు (వెంకటాపురం, ఎల్లారెడ్డిపేట) చల్ల రాజు (చీర్లవంచ, వేములవాడ) కమ్మం కుమార్ (పర్వేదా, సిద్దిపేట జిల్లా) రాగుల చందు (వెంకటాపురం, ఎల్లారెడ్డిపేట)చెలిమెల్ల రమేష్ (అగ్రహారం, వేములవాడ) నిందితులను, స్వాధీనం చేసు కున్న సొత్తును తదుపరి చట్ట పరమైన చర్యల నిమిత్తం సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్‌కు అప్ప గించారు. జిల్లాలో ఎవరైనా జూదం, పేకాట వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, కఠిన చర్యలు తప్పవని టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నటేష్ హెచ్చరిం చారు. ఈ దాడిలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తిరుపతి, రాజేష్, ఉమాపతి, శంకర్, శివరాజ్ పాల్గొన్నారు.

ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను తక్షణం పరిష్కరించాలి

ముత్తారం, ప్రభాతవార్త: ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ, ఉద్యోగ వ్యతిరేక విధానాలకు నిరసనగా మంగళవారం ముత్తారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం విధులకు నల్ల బ్యాడ్జీలు ధరించి హాజరై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగుల సామాజిక భద్రతను దెబ్బతీసే కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని (సిపిఎస్) పూర్తిగా రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (ఓపిఎస్) విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా నిలిచి పోయిన 6 కరువు భత్యం (డిఎ) బకాయిలను ప్రభుత్వం ఆలస్యం చేయకుండా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తమ డిమాండ్లను అంగీకరించే వరకు రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముత్తారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



నేరాలు-దారుణాలు

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

-ఎస్ఐ రామ్మోహన్ -రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త:



అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై రామ్మోహన్ అన్నారు. మంగళవారం కోనరావుపేట మండలం గండిమేపల్లి గ్రామంలోని మూలబాగునుండి ఎలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్ లను పట్టుకొని స్టేషన్ కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని మూలవాగు వద్ద అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను ట్రాక్టరలలో కడారి శ్రీనివాస్, పెంట కరుణాకర్ రవాణా చేస్తున్నట్లు పక్క సమాచారం మేరకు ఘటన స్థలానికి చేరుకొని వాటిని పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. వారి పై కేసు నమోదు చేసి రెండు ట్రాక్టర్ లను సిజ్ చేసి స్టేషన్కు తరలించమన్నారు.

ఇంట్లోకి దూసుకెళ్లిన లారీ తప్పిన ఘోర ప్రమాదం

తిమ్మాపూర్, ప్రభాత వార్త :



కరీంనగర్ జిల్లా కార్పొషన్ పరిదిలోని ఎనిమిదవ ఆల్గునూర్ రాజీవ్ రహదారిపై మంగళవారం ఉదయం ఓ భారీ లారీ ఇంటిలోకి దూసుకెళ్లడంతో ఇంటి ముందు ఉన్న రెండు షటర్లు కూలిపోయాయి.ఇంట్లో ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొన్నారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుండి కరీంనగర్ వైపు వస్తున్న భారీ లారీ ఆల్గునూర్ కు రాగానే రాజీవ్ రహదారిపై ఉన్న డివైడర్ ఢీ కొట్టింది.అనంతరం రహదారి పక్కనే ఉన్న షటర్లను ఢీ కొని ఆగిపోయింది. షటర్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. ఘటన సమయంలో షటర్ల లో ఎవరు లేకపోవడంతో ఘోర ప్రమాదం తప్పింది.ప్రమాదం అనంతరం లారీ డిజిల్ ట్యాంక్ పేలి మంటలువ్యా పించాయి. దీంతో అప్రమత్తమైన గ్రామస్తులు మంటలను అదుపులోకి తెచ్చారు.లారీ ఢీ కొనడంతో ఇంటి ముందు భాగం, రేకుల షెడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. ఈ ప్రమాదంలో సుమారు రూ.8 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు జాప మధు తెలిపారు.పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు.

తాగిన మైకంలో బావిలో పడి వ్యక్తి మృతి

చందుర్తి : సెప్టెంబర్ 1 ప్రభాతవార్త:

మద్యం మత్తులో ఓ వ్యక్తి వ్యవసాయ బావిలో పడి మృతి చెందిన సంఘటన చందుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామ శివారులోని జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం ఆశీ రెడ్డి పల్లె గ్రామానికి చెందిన గసికంటి అశోక్ 40 అనే వ్యక్తి మూడు రోజుల క్రితం బావిలో పడి మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహం కుళ్ళిపోయి రోడ్డు వెంట వెళ్లే వారికి దుర్వాసన రావడంతో మృతదేహాన్ని గుర్తించారు. మృతునికి భార్య కొన్ని సంవత్సరాల క్రితమే విడాకులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. తల్లి లక్షి మ్మ తో పాటు ఇద్దరు అన్నలు ఉన్నట్లు తెలిపారు. ఈ సంఘటనపై విచారణ చేపట్టినట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

రామగుండంలో నిషేధాజ్ఞలు అమలు

పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

పెద్దపల్లి జిల్లా బ్యూరో (గోదావరిఖని క్రైం), ప్రభాతవార్త: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జోన్లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై నిషేధాజ్ఞలను పొడిగిస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా వెల్లడించారు. బహిరంగ స్థలాల్లో మందు తాగి ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో మహిళలు, సాధారణ ప్రజల భద్రత కోసం ఈ చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. రహదారులపై అసభ్యకర ప్రవర్తనను అరికట్టేందుకు ఈ ఆంక్షలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. సెప్టెంబర్ 1 నుంచి అక్టోబర్ 1 వరకు ఈ నిషేధాజ్ఞలు అమల్లో ఉంటాయని స్పష్టం చేశారు. నిబంధనలు మీరితే భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 223 మరియు హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్ ప్రకారం కఠిన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. శబ్ద కాలుష్య నియంత్రణ కోసం డీజే సౌండ్స్ మరియు అనుమతి లేని డ్రోన్ల వినియోగంపై కూడా నిషేధం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమాలకు మైక్ సెట్లు వాడాలంటే డివిజన్ ఏసీపీ అనుమతి తీసుకోవడం విధి అని సూచించారు.

నల్ల బ్యాడ్జీలతో పెన్షన్ విద్రోహ దినంపై నిరసన

కోరుట్ల టౌన్, ప్రభాతవార్త :

సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి జాక్ ఇంచార్జి మహమూద్ అన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయుల భవిష్యత్ భద్రతకు భరోసా కల్పించే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఉద్యోగులపై భారంగా మారిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 1న పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా తెలంగాణ ఎంప్లాయీస్ జాక్ ఆధ్వర్యంలో భోజన విరామ సమయంలో కోరుట్ల రెవెన్యూ డివిజన్ కార్యాలయం ముందు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా టీజీయుస్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు నునావత్ రాజు మాట్లాడుతూ ఉద్యోగులు తమ సేవా కాలమంతా ప్రభుత్వానికి అంకితభావంతో



పనిచేస్తున్నప్పటికీ, పదవీ విరమణ అనంతరం ఆర్థిక భద్రతపై అనిశ్చితి నెలకొనడం ఆందోళనకరమన్నారు. పాత పెన్షన్ విధానం ఉద్యోగులకు సామాజిక భద్రత, ఆర్థిక భరోసాను కల్పించేదని, సీపీఎస్ విధానం మాత్రం ఉద్యోగుల భవిష్యత్‌పై అనేక సందేహాలను కలిగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో టి ఆర్ టి ఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు రణధీర్,యస్ టి ఓ గణేష్, సంపత్, మేడి కిషన్, రాజేశ్వర్ రావు, రాజేష్, రిటైర్డ్ ఉద్యోగులు శివానందం తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబరు 8న రెడ్డి నిరసన దీక్షను విజయవంతం చేయాలి

మేడిపల్లి/భీమారం, ప్రభాతవార్త :

హైదరాబాద్‌లో సెప్టెంబర్ 8 న చేపట్టిన నిరసన దీను విజయవంతం చేయాలని రైతు కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్న రైతు బీమా పథకాన్ని ప్రభుత్వం కొనసాగించాలని కోరుతూ రాష్ట్ర రెడ్డి సంఘాల ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద నిరసన దీక్ష చేపట్టనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మేడిపల్లి మండలం వల్లంపల్లి, భీమారం మండలం మన్నెగూడెం గ్రామాల్లో నిరసన దీక్షకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రధానంగా రూ.1,000 కోట్లతో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి పాలకవర్గాన్ని వెంటనే నియమించాలని, హైదరాబాద్‌లో రెడ్డి హాస్టల్ కోసం కేటాయించిన 15 ఎకరాల స్థలాన్ని ఆక్రమణలకు గురికాకుండా



పరిరక్షించాలని కోరారు. ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లను అన్ని విభాగాల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రెడ్డి ఐక్య వేదిక జిల్లా నాయకులు గడ్డం చంద్రశేకేర్ రెడ్డి,రెడ్డి జన సంక్షేమ సంఘ జాయింట్ సెక్రటరీ వెల్మ నవీన్ రెడ్డి, ఉమ్మడి మేడిపల్లి మండల అధ్యక్షులు నోముల నర్సింహా రెడ్డి మండల కార్యవర్గ సభ్యులు కాటిపెల్లి శ్రీపాల్ రెడ్డి, దశరథ రెడ్డి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

కోరుట్ల టౌన్, ప్రభాతవార్త :



అసంఘటిత రంగంలోని వ్యాపార వాణిజ్య అనేక రకాల రవాణా రంగంలోని దిగుమతి ఎగుమతి హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం అమలు చేయాలని హమాలి కార్మిక సంఘం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సుతారి రాములు డిమాండ్ చేశారు. మంగళవారం రోజున కోరుట్ల డివిజన్ కేంద్రంలోని హమాలీ కార్మిక సంఘం పలు అడ్డాల వద్ద ఏఐటీయూసీ నాల్గవ రాష్ట్ర మహాసభలు వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు మారినా అమాలి కార్మికుల స్థితిగతులు మారలేవన్నారు. ఈ రంగంలో పని చేసే వారికి ఎలాంటి హక్కులు పని భద్రత బీమా సౌకర్యం లాంటి చట్టాలు లేవన్నారు. ఈ కార్మికులందరికీ కూడా ప్రభుత్వం గుర్తించి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి గుర్తింపు కార్డులు అందజేసి అర్హులైన వారికి ఇందిరమ్మ ఇల్లు కట్టించి ఆసరా పెన్షన్లు అమలు చేయాలన్నారు. ఈ సమస్యల పైన ఈ నెల 6న కరీంనగర్ లో జరిగే ఏఐటీయూసీ రాష్ట్ర మహాసభల సందర్భంగా భారీ ప్రదర్శన బహిరంగ సభ కు హమాలి కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా తరలివస్తున్నారన్నారు.ఈ కార్యక్రమంలో హమాలీ నాయకులు గంధం రాములు, జుంపాల సాయిలు, హైమాద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రీప్రైమరీ విద్యార్థులకు వర్క్‌బుక్స్, పెన్సిళ్లు, బొమ్మల పంపిణీ

భీమారం, ప్రభాతవార్త:



మండలంలోని ఒడ్యాడ్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ప్రీప్రైమరీ విద్యార్థులకు వర్క్‌బుక్స్, పెన్సిళ్లు, బొమ్మలను పంపిణీ చేశారు. చిన్నారుల్లో చదువుపై ఆసక్తి, సృజనాత్మకత పెంపొందించేందుకు ఆటల ద్వారా విద్యను అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు గ్రామ సర్పంచ్ బొమ్మెన ప్రశాంత్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చిన్నారులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం రాకేష్ కుమార్, ఉపాధ్యాయులు లింగమూర్తి, ప్రశాంత రేఖ, మురళి, మహేందర్, ధనలక్ష్మి, నాగరాణి, లాస్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ సవరణ ప్రక్రియ పరిశీలన

కోరుట్ల అర్బన్ , ప్రభాతవార్త :



కోరుట్ల పట్టణ ఏసుకొని గుట్ట ప్రాంతంలో స్థానిక వార్డు కౌన్సిలర్ పుప్పాల ఉమాదేవి ప్రభాకర్ ల ఆధ్వర్యంలో 156, 157, 158 వ బూతులలో ఇటీవల కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో కొంతమంది కి నోటీసులు ఇచ్చారు. ఈ నోటీసులలో చేపట్టిన సవరణ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు కృష్ణారావు సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 156వ బూత్ లో మొత్తం 684 మంది ఓటర్లు ఉండగా అందులో 177 మందికి నోటీసులు, 177వ బూత్ లో మొత్తం 81 మంది ఓటర్లు ఉండగా అందులో 240 మంది కి నోటీసులు వచ్చాయని, 158 వ బూత్ లో 999 మంది ఓటర్లు ఉండగా 394 మంది కి నోటీసులు వచ్చాయని వారందరూ కూడా అధికారులు సూచించిన విధంగా తగిన సమాచారాన్ని అందించుకొని తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. నూతనంగా ఓటు నమోదు చేసుకునేవారు ఫారం నెంబరు 6 పూర్తి చేసి అధికారులకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కొంతం రాజం, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షులు ఎలేటి మహిపాల్ రెడ్డి, నాయకులు పుప్పాల ప్రభాకర్, స్థానిక వార్డు ప్రజలు,మహిళలు,మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


సీపీఎస్ ను రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలి

కోరుట్ల, ప్రభాతవార్త :



కోరుట్లలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ (గర్ల్స్) హై స్కూల్లో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంను రద్దు చేసి, ఓల్డ్ పెన్షన్ స్కీంను పునరుద్ధరించాలనే డిమాండ్‌తో నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల గాజీట్టెడ్ హెడమాస్టర్ వడ్లకొండ గంగాధర్, డీటీఫ్ డిస్ట్రిక్ట్ జనరల్ సెక్రటరీ జి. సంతోష్ లు మాట్లాడుతూ ఉపాధ్యాయుల భవిష్యత్ భద్రతకు పెన్షన్ ఒక ముఖ్యమైన అంశమని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల పెన్షన్ రైట్స్ ను పరిరక్షించేందుకు ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోరుట్ల వార్త



సన్న రకం వరి సాగుపై రైతులకు అవగాహన

భీమారం, ప్రభాతవార్త:



భీమారం మండలంలోని మన్నెగూడెం గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ సాంకేతిక యజమాన్యం ఆత్మ పథకం ద్వారా సన్న రకం వరి సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పంట పొలాలను పరిశీలించిన వ్యవసాయ అధికారులు రైతులకు సన్న రకం వరి సాగులో పాటించాల్సిన పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు అందించారు. రైతులు శాస్త్రీయ పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు.

రాష్ట్ర స్థాయి గణిత విజ్ఞాన మేళాలో సరస్వతీ శిశుమందిర్ విద్యార్థుల ప్రతిభ

కోరుట్ల అర్బన్, ప్రభాతవార్త :



శ్రీ సరస్వతీ విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా ముధోల్ లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి గణిత విజ్ఞాన మేళా పోటీల్లో కోరుట్ల శ్రీ సరస్వతీ శిశుమందిర్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి ఘన విజయం సాధించారు.పాఠశాకు చెందిన గంధం బలరాం శిశు వర్గం సైన్స్ ఎగ్జిబిషన్ విభాగంలో ప్రథమ స్థానం సాధించి, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల పరిధిలో జరగనున్న క్షేత్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు.గూడూరు అభినవ్ గణిత ఇన్నోవేటివ్ ప్రదర్శన విభాగంలో ద్వితీయ స్థానం సాధించాడు. ఇల్లుటపు శ్రీకర్ గణిత ఇన్నోవేటివ్ ప్రదర్శన విభాగంలో ద్వితీయ స్థానం సాధించాడు.రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటి పాఠశాలకు, పట్టణానికి మంచి గుర్తింపు తెచ్చిన విద్యార్థులను పాఠశాల ప్రబంధకారిణి, సమితి సభ్యులు, ప్రధానాచార్యులు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

సామూహిక శ్రావణ మంగళ గౌరీ వ్రతాలు

కోరుట్ల, ప్రభాతవార్త:



శ్రీ శివ మార్కండేయ కోటి నవదుర్గ దేవాలయంలో ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో మూడో మంగళవారం నిర్వహించే ఈ మంగళ గౌరీ వ్రతాలను ఘనంగా నిర్వహించారు.మహిళలు అమ్మవారి యొక్క కృపా కటాక్షాలు పొంది సకల సౌభాగ్యాలు కలిగి ఆయుః ఆరోగ్యలతో జీవించాలని కోరుతూ వ్రతాలు నిర్వహించారు.జరుగుతుంది. ఈ కార్యక్రమంలో భక్తులు, మహిళలు పాల్గొన్నారు.



ఇంకెంతకాలం!



మోక్షం లేని సర్వీస్ రోడ్లు ఏడాది దాటినా కార్యరూపం దాల్చని పనులుచిన్న, చితక పనులతోనే సరి?.....గోదావరిఖని, ప్రభాతవార్త: .....రాజీవ్ రహదారి.. రామగుండం పారిశ్రామిక ప్రాంతానికి కీలకమైన రవాణా మార్గం. గోదావరిఖని నుంచి రామగుండం వరకు నిత్యం భారీ వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ఈ మార్గంలో సర్వీస్ రోడ్ల సమస్య మాత్రం ఏళ్లుగా వెంటాడుతోంది. ప్రమాదాలు జరుగుతున్నాయి.. బ్లాక్‌స్పాట్లు గుర్తిస్తున్నారు.. అధికారులు పరిశీలనలు చేస్తున్నారు.. రూ.25 కోట్లతో అభివృద్ధి చేస్తామంటున్నారు.. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం ఆశించిన స్థాయిలో మారడం లేదు.2025 మేలోనే రాజీవ్ రహదారి సర్వీస్ రోడ్లను సుమారు రూ.25 కోట్లతో అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ప్రమాదాల నివారణకు సర్వీస్ రోడ్ల నిర్మాణం, విస్తరణ అత్యవసరమని అప్పట్లో అధికారులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. సింగరేణి అతిథి గృహం, జీఎం కార్యాలయ మూల, బీ పవర్‌హౌస్ ప్రాంతాల్లో పరిశ్రమల ప్రహరీలను వెనక్కి జరిపి రహదారులను విస్తరించడం, జీఎం కార్యాలయ కూడలిని విస్తరించడం, బస్టాండ్, మున్సిపల్ కూడలి, ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్డులో వెలుగులు పెంచడం వంటి పలు చర్యలు ప్రకటించారు.

ఏడాది దాటినా..

ప్రణాళిక ప్రకటించి ఏడాది దాటుతున్నా మొత్తం రూ.25 కోట్ల పనులు ఎప్పుడు పూర్తవుతాయన్నదానిపై స్పష్టత లేదు. తాజాగా గోదావరిఖని బస్టాండ్ మూలమలుపు వద్ద ఆక్రమణలు తొలగించి తొలి విడతగా సుమారు రూ.1.50 కోట్లతో సర్వీస్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించడం కొంత ఊరటనిచ్చినా.. ఇది మొత్తం సమస్యకు పరిష్కారం కాదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.రామగుండం పారిశ్రామిక ప్రాంతం మొత్తం విస్తరించి ఉన్న సర్వీస్ రోడ్లను అభివృద్ధి చేయాల్సి ఉండగా.. ఒక్కో ప్రాంతంలో విడతల వారీగా పనులు చేపడితే ఎప్పటికి పూర్తవుతాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఇంతకాలమా?

గోదావరిఖని బస్టాండ్ మూలమలుపు వద్ద రహదారి విస్తరణకు అడ్డుగా ఉన్న భారీ భవనంతోపాటు 20కి పైగా చిన్న దుకాణాలను ఇటీవల అధికారులు తొలగించారు. రహదారి భద్రతకు అవరోధంగా ఉన్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవడం మంచిదే. కానీ ఇలాంటి ఆక్రమణలు ఏళ్ల తరబడి కొనసాగేందుకు అవకాశం ఎలా లభించిందన్నదే ప్రశ్న.ఆక్రమణలు తొలగించిన తర్వాత మళ్లీ ఏర్పడకుండా నిరంతర పర్యవేక్షణ అవసరం. లేకుంటే ప్రజా ప్రయోజనాల కోసం నిర్మించిన సర్వీస్ రోడ్లు మరోసారి ఆక్రమణలకు గురయ్యే ప్రమాదం ఉంది.

ప్రమాదాల జరిగితేనే హడావుడి?

రాజీవ్ రహదారిపై ప్రధాన సమస్య ప్రమాదాలు. వేగంగా దూసుకెళ్లే వాహనాలు, పరిశ్రమలకు వెళ్లే భారీ వాహనాలు, స్థానిక రాకపోకలు ఒకే మార్గంలో కలవడంతో ప్రమాద ముప్పు పెరుగుతోంది. సర్వీస్ రోడ్లు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో స్థానిక వాహనాలు కూడా ప్రధాన రహదారిపైకి రావాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.ప్రమాదాలు జరిగిన తర్వాత ప్రాంతాలను పరిశీలించడం, ప్రతిపాదనలు రూపొందించడం కాకుండా.. ప్రమాదం జరగకముందే బ్లాక్‌స్పాట్లను శాశ్వతంగా సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

అమలెక్కడ?

పారిశ్రామిక సంస్థల ప్రహరీలను కొంత వెనక్కి జరిపి సర్వీస్ రోడ్లను విస్తరిస్తామని గతంలో ప్రకటించారు. సింగరేణి అతిథి గృహం, జీఎం కార్యాలయ మూల, బీ పవర్‌హౌస్ ప్రాంతాల్లో ఈ చర్యలు చేపడతామని వెల్లడించారు. అయితే ఈ ప్రతిపాదనల్లో ఎంత మేర కార్యరూపం దాల్చిందన్నది స్పష్టంగా తెలియడం లేదు.పారిశ్రామిక ప్రాంతంలో రహదారి విస్తరణకు పరిశ్రమలు సహకరించాల్సిన అవసరం ఉన్నప్పటికీ.. ప్రజల భద్రతకు సంబంధించిన పనుల విషయంలో శాఖల మధ్య సమన్వయం ఆలస్యానికి కారణం కాకూడదని స్థానికులు అంటున్నారు.

మారేదెప్పుడు?

జీఎం కార్యాలయ జంక్షన్ విస్తరణ, మున్సిపల్ జంక్షన్, బస్టాండ్, ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్డు వద్ద అదనపు వెలుగులు ఏర్పాటు చేయాలని గతంలోనే సూచించారు. ఈ ప్రాంతాల్లో వాహనాల రద్దీ అధికంగా ఉండటంతో జంక్షన్ల రూపురేఖలు మార్చాల్సిన అవసరం ఉంది.కేవలం రహదారిని వెడల్పు చేయడం సరిపోదు. జంక్షన్ల వద్ద వాహనాల మళ్లింపు, వేగ నియంత్రణ, తగిన వెలుగులు, పాదచారుల భద్రత, హెచ్చరిక బోర్డులు వంటి అంశాలను సమగ్రంగా పరిగణనలోకి తీసుకోవాలి.తాజాగా నిర్మాణ పనులు ప్రారంభం కావడంతో కొన్ని ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు తాత్కాలిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నిర్మాణ సామగ్రి, యంత్రాల కారణంగా రహదారి వెడల్పు తగ్గుతోంది. రద్దీ సమయాల్లో ట్రాఫిక్ నెమ్మదిస్తోంది. పనులు త్వరగా పూర్తయితేనే ఈ ఇబ్బందులకు తెరపడనుంది.నిర్మాణ సమయంలోనే భద్రతా చర్యలు తీసుకోకపోతే.. ప్రమాదాలను నివారించాల్సిన పనులే కొత్త ప్రమాదాలకు కారణమయ్యే అవకాశం ఉంది.

సమస్యల సంగతేంటి?

రాజీవ్ రహదారిని భవిష్యత్‌లో ఎక్స్‌ప్రెస్ హైవేగా అభివృద్ధి చేయడం, హైదరాబాద్-రామగుండం గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం వంటి దీర్ఘకాలిక ప్రతిపాదనలు ఉన్నా.. అవి పూర్తయ్యే వరకు ప్రస్తుత రహదారిపై ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపాల్సిందే.కొత్త హైవేల కోసం ఎదురుచూస్తూ.. ప్రస్తుతం ఉన్న సర్వీస్ రోడ్లను నిరక్ష్యం చేయడం ప్రమాదకరం.రూ.25 కోట్ల ప్రణాళికలో భాగంగా ఏయే ప్రాంతాల్లో ఎంత మేర పనులు చేపట్టనున్నారు? ఎంత నిధులు ఖర్చు చేయనున్నారు? ఏ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి? మిగిలిన పనులు ఎప్పటికి ప్రారంభమవుతాయి? ఎప్పటికి పూర్తవుతాయి? అన్న వివరాలను అధికారులు బహిరంగంగా వెల్లడించాల్సిన అవసరం ఉంది. ప్రమాదాలు తగ్గించాలంటే పరిశీలనలు, ప్రకటనలు, ప్రణాళికలకే పరిమితం కాకుండా పనులు క్షేత్రస్థాయిలో పూర్తవ్వాలి. రూ.25 కోట్ల ప్రణాళికకు కాలపరిమితి లేకపోతే.. రాజీవ్ రహదారిపై'మృత్యు రహదారి' అనే ముద్ర మాత్రం కొనసాగుతూనే ఉంటుంది.

తెలంగాణ రాష్ట్ర గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్యాల రాములు గౌడ్ నియామకం

మానకొండూర్, ప్రభాతవార్త:



తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా మానకొండూరు మండలంలోని కొండపల్క ల గ్రామానికి చెందిన మల్యాల రాములు గౌడ్ ను నియమించినట్లు తెలంగాణ రాష్ట్ర గౌడ సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గట్టు రామచంద్ర రావు మంగళవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాములు గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన నూతన బాధ్యతల ను సమర్థవంతంగా నిర్వహిస్తూ, గౌడ జాతి అభ్యున్నతి, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. గౌడ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.అలాగే గౌడ యువతకు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు, సామాజికంగా, ఆర్థికంగా గౌడ సమాజం అభివృద్ధి చెందేలా కృషి చేస్తానని తెలిపారు.రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తమ నియామకానికి సహకరించిన తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు గట్టు రామచంద్ర రావు, రాష్ట్ర అధ్యక్షుడు గుండాల మల్లేష్ గౌడ్, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోల్కాపురి శ్రీకాంత్ గౌడ్, గండి వీరేందర్ గౌడ్, జిల్లా నాయకులకు రాములు గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ యమున గౌడ్, గండి శారద గౌడ్, నల్గొండ తిరుపతి గౌడ్, ఏరుకొండ హైమావతి గౌడ్ , అంతటి భాగ్యలక్ష్మి గౌడ్, తాళ్లపల్లి సంధ్య గౌడ్, గోపగాని నవీన్ గౌడ్ పాల్గొన్నారు.

గౌడ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

సంఘం బలోపేతం,సభ్యుల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు

జూలపల్లి,ప్రభాతవార్త:జూలపల్లి మండల కేంద్రంలో మంగళవారంగౌడ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా గౌడ సంఘం సభ్యులు సమావేశమై సంఘం అభివృద్ధికి, సభ్యుల సంక్షేమం,ఐక్యత తదితర అంశాలపై చర్చించి నూతన కమిటీని ఎంపిక చేశారు.నూతన కమిటీ అధ్యక్షులుగా అమరగాని చంద్రయ్య, ఉపాధ్యక్షులుగా బొంగాని రమేష్ లు ఎన్నికయ్యారు.కమిటీ సభ్యులుగా అమరగాని వర్మ రాములు, కొమురయ్య,చంద్రమోళి,ధర్మయ్య,మల్లేష్,తిరుపతి,భూసారపు మహేందర్, మడక వర్మ రాములు లను ఎంపిక చేశారు.ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ గౌడ సంఘం సభ్యులందరినీ కలుపుకొని సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.సభ్యుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయడంతో పాటు,సంఘం అభివృద్ధి కోసం ఐక్యంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు.నూతన కమిటీ ఏర్పాటుపై గౌడ సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేసి,నూతన అధ్యక్షుడు,ఉపాధ్యక్షుడు,కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి స్థల పరిశీలన చేసిన అధికారులు

ఓదెల,ప్రభాతవార్త:

దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో రైల్వే లైన్ విస్తరణ, అభివృద్ధిలో భాగంగా లెవల్ క్రాసింగ్‌ల వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబి), రోడ్డు అండర్ బ్రిడ్జి (ఆర్ యుబి), ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా కాజీపేట-బల్లార్షా రైల్వే సెక్షన్‌లోని ఓదెల మండల కేంద్రంలో ఓదెల గ్రామం వద్ద ఎల్ సి31, 32, కొలనూర్ గ్రామం వద్ద ఎల్ సి34 వద్ద ప్రతిపాదిత ఆర్ఓబి నిర్మాణానికి జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రతిపాదిత అలైన్‌మెంట్‌పై గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, రైతులకు అధికారులు వివరించారు. అనంతరం అలైన్‌మెంట్ మేరకు పెగ్ మార్కింగ్ చేసి, సేకరణకు అవసరమైన భూముల కొలతలు చేపట్టారు.ఈ కార్యక్రమంలో రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ సమ్రాట్ రాయ్, రైల్వే భూ సేకరణ నిపుణులు పి. దేవరాజు, రెవెన్యూ సర్వేయర్, ఆర్ఐ చంద్రమోళి, రెవెన్యూ సర్వేర్, జీపీఓ అనిల్ అధికారులు, గ్రామ సర్పంచులు కనికిరెడ్డి సతీష్, పల్లె కనకయ్య, ఉప సర్పంచ్లు పంచాయతీ కార్యదర్శులు నగునూరి వెంకట లక్ష్మణ్, శంకర్, గోపతి ప్రవీణ్, రాపల్లి రాజయ్య, పిట్టల నరసింగం, కోటగిరి స్వామి, సిరిగిరి రాజారాం ఇతర రైతులు పాల్గొన్నారు.



మాజీమంత్రి రాజేశం గౌడ్ ను పరామర్శించిన మాజీ జడ్పీ చైర్మన్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



హైదరాబాద్‌లోని స్టార్ హాస్పిటల్‌లో మోకాలి మార్పిడి శస్త్రచికిత్స చేయించుకుని చికిత్స పొందుతున్న మాజీ మంత్రి,రాష్ట్ర తొలి కార్పొరేషన్ చైర్మన్ గోడిసెల రాజేశం గౌడ్‌ను మాజీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా తొలి మహిళా జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ మంగళవారం ఆత్మీయంగా కలిసి పరామర్శించారు.గతంలో ఎడమ కాలికి మోకాలి మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్న రాజేశం గౌడ్,తాజాగా కుడి కాలికి కూడా శస్త్రచికిత్స చేయించుకున్నారు.ఈ సందర్భంగా స్టార్ హాస్పిటల్‌కు వెళ్లిన తుల ఉమ ఆయనను పరామర్శించి,వైద్యులను అడిగి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.రాజేశం గౌడ్‌తో కొద్దిసేపు ముచ్చటించి ధైర్యం చెప్పిన ఆమె,ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

పెద్దపల్లి డీసీపీ బి.రాంరెడ్డి



పెద్దపల్లి, ప్రభాతవార్త: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని పెద్దపల్లి డీసీపీ బి.రాంరెడ్డి హెచ్చరించారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో జరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతిభద్రతలను పర్యవేక్షించేందుకు డిసిపి బి.రాంరెడ్డి పలు ప్రాంతాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆందోళనల్లో సమయమనం పాటించాలని, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు అందరూ సహకరించాలని కోరారు. పెద్దపల్లి సిఐ కొండపాక ప్రవీణ్ కుమార్, ట్రాఫిక్ సిఐ బి.శ్రీనివాస్, ఎసఐలు నరేష్, శ్వేత తదితరులున్నారు.

సెప్టెంబర్ 12 లోక్ అదాలత్‌ను విజయవంతం చేద్దాం

-కేసుల పరిష్కారానికి పోలీసు, న్యాయవాదులు సహకరించాలి

- మెట్‌పల్లి సీనియర్ సివిల్ జడ్జి ఆర్. అజయ్‌కుమార్

మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త :



సెప్టెంబర్ 12న నిర్వహించనున్న లోక్ అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని మెట్‌పల్లి సీనియర్ సివిల్ జడ్జి ఆర్. అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, మధ్యవర్తిత్వ సమన్వయకర్తలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి ఆర్. అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. గతంలో నిర్వహించిన లోక్ అదాలత్‌కు పోలీసులు, న్యాయవాదులు అందించిన సహకారం అభినందనీయమన్నారు. అదే స్ఫూర్తితో సెప్టెంబర్ 12న నిర్వహించనున్న లోక్ అదాలత్‌లో కూడా పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. వివాదాలను సత్వరమే పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ ఒక మంచి వేదిక అని పేర్కొన్నారు.కేసుల పరిష్కారంలో పోలీసు అధికారులు, న్యాయవాదులు, మధ్యవర్తిత్వ సమన్వయకర్తలు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని ఆయన సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను గుర్తించి, లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు.ఈ సమావేశంలో జూనియర్ సివిల్ జడ్జి వినుకొండ మాధవి, రెండో తరగతి న్యాయమూర్తి దయ్యా రాజారాం, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలేటి రాంరెడ్డి, ఎస్సైలు కిరణ్‌కుమార్, నవీన్‌కుమార్, అనిల్‌కుమార్, సందీప్‌రావు, మధ్యవర్తిత్వ సమన్వయకర్తలు ఓజ్జెల శ్రీనివాస్, బక్కూరి రమేష్, పసునూరి శ్రీనివాస్, లోక్ అదాలత్ సభ్యులు జేడీ సుధాకర్, న్యాయ సేవా సంస్థ రిటైనర్ న్యాయవాదులు పుప్పాల భానుమూర్తి, తోగిటి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై మెట్‌పల్లి మున్సిపాలిటీ కొరడా

మున్సిపల్ నిబంధనల మేరకే నిర్మాణాలు చేపట్టాలి

మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్

మెట్‌పల్లి డివిజన్, ప్రభాతవార్త :





పట్టణంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై మెట్‌పల్లి మున్సిపాలిటీ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం కఠిన చర్యలు చేపట్టింది. భవన యజమానులు, నిర్మాణదారులు తప్పనిసరిగా మున్సిపల్ నిబంధనల మేరకే నిర్మాణాలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్ సూచించారు.పట్టణంలోని పలు ప్రాంతాల్లో అనుమతులు లేకుండా, అలాగే మంజూరైన అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నట్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో అధికారులు ఆయా ప్రాంతాల్లో నిర్మాణాలను పరిశీలించి, నిబంధనల ఉల్లంఘనలను గుర్తించారు. సంబంధిత నిర్మాణదారులకు నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేసి, తదుపరి చర్యల కోసం ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీకి సిఫార్సు చేశారు.ఫిర్యాదులు, నిర్మాణాల వివరాలను పరిశీలించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీ.. అనుమతులకు విరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించింది. కమిటీ నిర్ణయం మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఆదేశాలతో పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం కలిసి అక్రమ నిర్మాణాలను నిబంధనల ప్రకారం తొలగించారు.పట్టణంలోని 8వ వార్డులో 1191, 1192 సర్వే నంబర్లలో ప్రారంభ దశలో ఉన్న ఒక నిర్మాణంతో పాటు, అదే వార్డులో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన ఒక నివాస భవనంపై అధికారులు చర్యలు చేపట్టారు. అలాగే 17వ వార్డులో అనుమతులకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఒక వాణిజ్య భవనాన్ని కూడా తొలగించారు.ఈ సందర్భంగా కమిషనర్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. పట్టణంలో భవన నిర్మాణాలు చేపట్టే ముందు తప్పనిసరిగా మున్సిపల్ అనుమతులు పొందాలని తెలిపారు. మంజూరైన అనుమతులకు అనుగుణంగానే నిర్మాణాలు చేపట్టాలని, నిబంధనలను ఉల్లంఘించి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ పట్టణ ప్రణాళిక అధికారి కె. భూపతి, పట్టణ ప్రణాళిక పర్యవేక్షకుడు అశోక్, పట్టణ ప్రణాళిక భవన పర్యవేక్షణ అధికారి యమున, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం సభ్యులతో పాటు రెవెన్యూ, అగ్నిమాపక, పోలీస్, రోడ్లు-భవనాల శాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలి

మెట్ పల్లి డివిజన్, ప్రభాతవార్త :



కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం (ఓపీఎస్)ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ మెట్పల్లిలో ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన, ధర్నా నిర్వహించారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ డిమాండ్లకు మద్దతుగా నినాదాలు చేశారు.ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్ భద్రతకు పెన్షన్ అత్యంత కీలకమైన అంశమన్నారు. సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల పెన్షన్ హక్కులను పరిరక్షి ంచేందుకు ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.జేఏసీ నాయకుడు శ్రీనివాస స్వామి మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పెన్షన్ హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు.అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవోకు సమర్పించారు.ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు శ్రీనివాస స్వామి, హరి ప్రసాద్, నర్సింగరావు, తాహెర్, మోహన్, అంజిత్‌రెడ్డి, రమేష్, మురళి, నాగరాణి, విష్ణుకిషోర్, వెంకటేష్, రజిత, మణిచందన, సంధ్య, జమున, లతతో పాటు పలువురు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలని అధ్యాపకుల నిరసన

మల్లాపూర్, ప్రభాతవార్త :



సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ మల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సెప్టెంబర్ 1ని సీపీఎస్ విద్రోహ దినంగా పాటించాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు ఈ నిరసన చేపట్టారు.పెండింగ్‌లో ఉన్న రెండో పీఆర్సీ, ఆరు డీఏలను వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని అధ్యాపకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించాలని తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్ అసోసియేషన్-711 రాష్ట్ర ఉపాధ్యక్షులు నంచర్ల రాజేష్ కోరారు.కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఏ. శ్రీనివాస్, ఏ. నరేష్, కార్యదర్శి పి. మహేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి వార్త



క్యాన్సర్‌పై అప్రమత్తత అవసరం

మెట్ పల్లి జూనియర్ సివిల్ జడ్జి మాధవి

మెట్‌పల్లి టౌన్, ప్రభాతవార్త :



రోజురోజుకూ క్యాన్సర్ వ్యాధి తీవ్రరూపం దాలుస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మెట్‌పల్లి జూనియర్ సివిల్ జడ్జి వినుకొండ మాధవి సూచించారు. మంగళవారం మెట్‌పల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయవాది చావ కిషోర్ సంతాప సభలో ఆమె పాల్గొని నివాళులర్పించారు. న్యాయవాది చావ కిషోర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం జడ్జి మాధవి మాట్లాడుతూ.. క్యాన్సర్‌తో న్యాయవాది మృతి చెందడం తీవ్ర దిగ్భ్రాంతి, బాధ కలిగించిందన్నారు. క్యాన్సర్ వచ్చిన తర్వాత చికిత్స కోసం పోరాడటం కంటే ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో మేలని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు ముందస్తుగా క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.అనంతరం న్యాయవాదులు రెండు నిమిషాలు మౌనం పాటించి మృతునికి సంతాపం తెలిపారు.న్యాయవాది చావ కిషోర్ మృతికి సంతాప సూచకంగా సోమవారం,మంగళవారం న్యాయవాదులు విధులకు దూరంగా ఉన్నారు.ఈ కార్యక్రమంలో ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి దయ్యా రాజారాం, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెర్లపల్లి ఆనంద్ గౌడ్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలేటి రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్‌తో పాటు బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బిజెపి కార్యాలయంపై దాడి పిరికిపంద చర్య

బిజెపి మండల అధ్యక్షులు కొమ్ముల రాజుపాల్ రెడ్డి

మెట్‌పల్లి రూరల్, ప్రభాతవార్త:



హైదరాబాదులోని బిజెపి రాష్ట్ర పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడి పిరికిపందచర్య అని బిజెపి మండల అధ్యక్షులు కొమ్ముల రాజుపాల్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని జగ్గాసాగర్ గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..భారతీయ జనతా పార్టీ నాయకులను నేరుగా ఎదుర్కునే దమ్ము ధైర్యం కాంగ్రెస్ నాయకులకు లేక పార్టీ కార్యాలయంపై దాడులు చేస్తున్నారని, ఒకవేళ భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు తలుచుకుంటే కాంగ్రెస్ నాయకులు రోడ్డుపై తిరగలేరని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో బిజెపి మండల ప్రధాన కార్యదర్శులు మారు జనార్దన్ రెడ్డి జంగిటి శ్రీధర్, మేడిచెలిమెల రవి,కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు కాటిపెల్లి సురేష్ రెడ్డి,నాయకులు గంట రాజేశ్వర్,నలిమెల నరసింహారెడ్డి,చిలువేరు మల్లేష్,సబ్బని అశోక్, జిన్న శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

బకాయిలను వెంటనే విడుదల చేయాలి

మేడిపల్లి, ప్రభాతవార్త :

తెలంగాణలో విద్యార్థులకు సంబంధించిన బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ధర్నా సమాజ్ పార్టీ, బీసీ,ఎస్సీ,ఎస్టీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మేడిపల్లి మండల కేంద్రంలోని ఎంఆర్ఓ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. తెలంగాణలో సుమారు 30 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన రూ.14 వేల కోట్ల బకాయిలు ఉన్నాయని, వాటిని వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ,ఎస్సీ,ఎస్టీ జేఏసీ నాయకులు, డీఎస్సీ అధ్యక్షులు బాబు మహారాజ్, పృథ్వీ, వాసుదేవ్, రాము, డప్పు రాజన్న తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ,ఎస్టీ వర్గాల అభ్యున్నతికి చర్యలు తీసుకోవాలి

- రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య
- ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు, పథకాల అమలు, సంక్షేమం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితర అంశాలపై వివిధ శాఖల అధికారులతో ఐడీఓసీలో సమీక్ష సమావేశం.

సిరిసిల్ల బ్యూరో,సెప్టెంబర్ 01,ప్రభాతవార్త:





జిల్లాలో ఎస్సీ,ఎస్టీ వర్గాల ప్రజల అభ్యున్నతికి అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యుడు రాంబాబు నాయక్ జిల్లా పర్యటనకు రాగా,జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె స్వాగతం పలికి.. పుష్పగుచ్ఛం అందజేశారు.జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె, కమిషన్ సభ్యుడు రాంబాబు నాయక్ తో కలిసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, పథకాల అమలు, సంక్షేమం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ.. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అందుతున్న పథకాలు, సంక్షేమం, అట్రాసిటీ కేసుల పరిష్కారం గురించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించే అన్ని పథకాలు అర్హులైన ఎస్సీ, ఎస్టీలకు అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యను అభ్యసిస్తున్న ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల సంఖ్య, అంబేద్కర్ ఓవర్సీస్ పథకం, కులాంతర వివాహాల ఆర్థిక చేయూత, ఇందిరమ్మ ఇండ్లు, జాబ్ కార్డు కలిగిఉన్న ఎస్సీ, ఎస్టీలకు కల్పిస్తున్న పని వివరాలను అధికారుల ద్వారా సమీక్షించారు. ఇప్పటివరకు నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదు ఛార్జ్ షీట్ దాఖలు వివరాలు తెలుసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద నమోదయిన కేసుల దర్యాప్తు త్వరితగతిన, పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. బాధితులకు నష్ట పరిహారం అందేవిధంగా చూడాలని వివరించారు. ప్రతినెలా చివరి వారంలో మండలాల్లో సివిల్ రైట్స్ డే నిర్వహించాలని పేర్కొన్నారు. సంబంధిత శాఖల అధికారులు అందరూ సమావేశాల్లో పాల్గొని, ప్రజల్లో ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం అమలు పరుస్తున్న పథకాలు, చట్టాల గురించి అవగాహన కల్పించాలని వివరించారు. ప్రజలకు మానవీయ కోణంలో సేవలు అందించాలని సూచించారు. ఖచ్చితంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించాలని సూచించారు. ఏవైనా అభివృద్ధికి సంబంధించి నిధులు పెండింగ్ ఉంటే రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి విడుదల అయ్యేటట్లు చూస్తానని హామీ ఇచ్చారు.ఎస్సీ,ఎస్టీ ప్రజల అభ్యున్నతితో పాటు, జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా మరింత కృషి చేయాలని తెలిపారు. ఆయా శాఖల అధికారులు అందరికీ అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో లోని పారిశుధ్య కార్మికులకు ఎస్ బీ ఐ బ్యాంక్ ఖాతాలు తీయించాలని, దీంతో కార్మికులకు భీమా సౌకర్యం ఉందని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డిఆర్ఓ జయశ్రీ, వేములవాడ ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, డీఎస్పీలు నాగేంద్రచారి, శ్రీనివాసులు, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్ రెడ్డి, సీపీఓ శ్రీనివాసాచారి, జిల్లా ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి సంగీత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ అధికారులు, వివిధ సంఘాల నాయకులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రెడ్ల నిరసన దీక్ష పోస్టర్ ఆవిష్కరణ

తంగళ్ళపల్లి,ప్రభాతవార్త:



తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని రెడ్డి భవన్ లో రెడ్డి జె.ఎ.సి,రెడ్డి ఐక్యవేదిక,రెడ్డి జాగృతి,రెడ్డి సంఘం తెలంగాణ,రెడ్డి సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 8న హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నా చౌక్ లో చేపట్టనున్న రెడ్ల నిరసన దీక్ష వాల్ పోస్టర్లను రెడ్డి సంఘం నేతలు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా పలువురు రెడ్డి సంఘం నాయకులు మాట్లాడుతూ రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు.రైతు భీమాను ప్రభుత్వమే కొనసాగించాలని అన్నారు.గత ప్రభుత్వం రెడ్డి హాస్టళ్లకు బుద్ధేల్ లో కేటాయించిన 15 ఎకరాల భూమిని ఈ ప్రభుత్వం క్యాన్సిల్ చేసింది అని,ఆ భూమిని అక్కడే రెడ్డి కులస్తులకు ఇవ్వాలని తెలిపారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను ప్రభుత్వ అన్ని విభాగాలలో అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన దీక్ష కు రెడ్డి కులస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం అధ్యక్షుడు దోర్నాల సంజీవరెడ్డి,తెలంగాణ రాష్ట్ర రెడ్డి సంఘం సహా అధ్యక్షులు పూర్మని రామ్ లింగారెడ్డి,జిల్లా అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి,జిల్లా రెడ్డి సంఘం ఉపాధ్యక్షులు ఎగు మామిడి కృష్ణారెడ్డి,ఫ్యాక్స్ వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకట రమణారెడ్డి,నాయకులు కూతురు వెంకట్ రెడ్డి,హన్మంత రెడ్డి,బాల్ రెడ్డి,ఆసాని లింగ రెడ్డి,రెడ్డి కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి : జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి

వెయ్యి కోట్లతో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

గంభీరావుపేట,ప్రభాతవార్త:



ఎన్నికల సమయంలో ప్రభుత్వము రెడ్డిలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని జిల్లా రెడ్డి సేవా సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారము గంభీరావుపేట మండల కేంద్రంలోని రెడ్డి సంఘం భవనంలో నిరసన దీక్ష పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెడ్ల ఓట్లతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రెడ్లను విస్మరించిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా 1000 కోట్లతో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రములో అన్ని కార్పొరేషన్లు ఏర్పాటు జరిగి, రెడ్డి కార్పొరేషన్ ఇప్పటికి వరకు ఏర్పాటు చేయకపోవడం విచారకరమన్నారు. ఈడబ్ల్యూ ఎస్ అన్ని విభాగాలలో అమలు అయ్యే విధంగా ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. బాధిత రైతు కుటుంబాలకు ఆర్థిక అండగా నిలువనున్న రైతు బీమా పథకం ను ప్రభుత్వం కొనసాగించాలని డిమాండ్ చేశారు. రెడ్ల సమస్యల పరిష్కారానికై 7న జరిగే అసెంబ్లీలో ప్రకటన చేసి ప్రభుత్వము ఇచ్చిన మాట నెరవేర్చుకోవాలన్నారు. లేని పక్షంలో 8న ఇందిరా పార్క్ వద్ద భారీ సంఖ్యలో రెడ్ల నిరసన దీక్ష చేపట్టి ప్రభుత్వానికి కనువిప్పు కలిగే విధంగా తమ నిరసనగళం వినిపించనున్నట్లు ప్రకటించారు. అనంతరం జిల్లా రెడ్డి సంఘ అధ్యక్షుడు కృష్ణారెడ్డిని ఆయా గ్రామాల అధ్యక్షులు సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ రెడ్డి సంఘ అధ్యక్షుడు గడ్డమీది ప్రసాద్ రెడ్డి, జిల్లా సభ్యులు లక్కిరెడ్డి కమలాకర్ రెడ్డి, ముత్యాల రాజిరెడ్డి, సభ్యులు కామిడి సంజీవ రెడ్డి, దేవరెడ్డి, సురేందర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, సంజీవరెడ్డి, అంజిరెడ్డి, రాజిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సుభాష్ రెడ్డి, కిష్టా రెడ్డి లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడానికి వార్డు అధ్యక్షులు పాత్ర కీలకం

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సూర దేవరాజు

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త:

కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతానికి వార్డు అధ్యక్షుల కృషి చేయాలని పట్టణ అధ్యక్షుడు సూర దేవరాజు అన్నారు. పట్టణంలోని 39 వార్డులకు నియమించిన వార్డు అధ్యక్షుల నియమక పత్రాన్ని పట్టణ అధ్యక్షుడు సూర దేవరాజు మంగళవారం అందజేశారు ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు సూర దేవరాజు మాట్లాడుతూ ప్రతి వార్డులో పార్టీ కార్య కలాపాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.పార్టీ నాయకులు, కార్యకర్తల సమన్వయంతో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు.ప్రభుత్వ పథకాలను ప్రతి అర్హుడికి అందేలా కృషి చేయాలని అన్నారు.

సిరిసిల్ల వార్త



మహిళా సంఘాల సభ్యులకు హెల్త్ టెస్టులు

తంగళ్ళపల్లి,ప్రభాతవార్త:



తంగళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా సంఘాల సభ్యులకు వైద్యులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.మహిళా సంఘాల సభ్యులకు వివిధ రకాల హెల్త్ టెస్టులు నిర్వహించి ఆరోగ్యం పై వైద్యులు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోర లక్ష్మీరాజం,ఏఏంసి వైస్ చైర్మన్ నర్సింగం గౌడ్,మండల కాంగ్రెస్ అధ్యక్షులు మునిగెల రాజు,డాక్టర్ స్నేహ,ఏపిఎం చంద్రయ్య,నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చుక్క రాజ శేఖర్,గుగ్గిళ్ల భరత్,తిరుపతి,మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి

ఇల్లంతకుంట, ప్రభాతవార్త:



రాష్ట్రప్రభుత్వం మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు పరచాలని సీపీ ఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షులు అయ్యన్నగారి హరికృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. పెన్షన్ విద్రోహ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం వెల్జీపూర్ ప్రభుత్వ పాఠశాలలో భోజన విరామ సమయంలోఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన చేశారు.ఈ సందర్భంగా హరికృష్ణ రెడ్డి మాట్లాడుతూ నూతన పెన్షన్ విధానం వల్ల ఉపాధ్యాయులు, ఉద్యోగులు తీవ్రంగా నష్ట పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఉద్యోగ భద్రత లేక ఉద్యోగులు మానసిక క్షోభకు గురవుతున్నారన్నారు.రాష్ట్ర ముఖ్యమంతి రేవంత్ రెడ్డి 2.70 లక్షల ఉద్యోగుల కుటుంబాల క్షేమం కాంక్షించి పాత పెన్షన్ నిపుణరుద్ధరించాలని కోరారు.ఈ నిరసన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాట్నపల్లి స్వామిరెడ్డి,అన్న పూర్ణ,ఉపాధ్యాయులు కుమారస్వామి,రాజిరెడ్డి,శ్రీనివాస్,అరుణ,అనురాధ పాల్గొన్నారు.

విద్యార్థులకు టీ షర్టుల అందజేత

ఇల్లంతకుంట, ప్రభతవార్త



మండలంలోని కందికట్కూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం టీ షర్టులు అందించారు. గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి బిగుల్ల రాజకుమార్ దాదాపు 45 వేల రూపాయల విలువచేసే టీషర్టును విద్యార్థినీ విద్యార్థులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు రవీందర్‌రెడ్డి,ఉపాధ్యాయులు రాజు,అంగన్‌వాడి టీచర్ లక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

పెగడపల్లిలో ఓపెన్ పాఠశాల కేంద్రం

పెగడపల్లి, ప్రభాతవార్త:

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ కోఆర్డినేటర్ కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా టాస్క్ కోఆర్డినేటర్ రామడుగు రవీందర్ తెలిపారు. చదువుకు దూరమై మధ్యలో విద్యను నిలిపివేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఓపెన్ పాఠశాల విద్య ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ చదువులను పూర్తిచేసుకునే అవకాశం ఉందని సెంటర్ కోఆర్డినేటర్ శ్రీధర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లలిత తెలిపారు. ఆసక్తి ఉన్న వారు సెప్టెంబర్ 15వ తేదీలోగా ప్రవేశాలు పొందాలని సూచించారు.

రేవంత్ రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలి

-జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మైకు దొరికిన ప్రతిసారీ బిఆర్ఎస్ అధినేత,మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అక్కసు వెళ్లగక్కుతూ వ్యక్తిగత దూషణలకు దిగడంపై జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేసీఆర్‌ను విమర్శించడం వల్ల రేవంత్ రెడ్డి స్థాయి ఏమాత్రం పెరగదని హితవు పలికారు.ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన నాయకుడు కేసీఆర్ అయితే,ఆ ఉద్యమంలో రేవంత్ రెడ్డి పాత్ర ఏంటని ప్రశ్నించారు.కేసీఆర్‌తో రేవంత్‌ను పోల్చడం నక్కకు నాగలోకానికి ఉన్న తేడా వంటిదని, వెయ్యి జన్మలెత్తినా కేసీఆర్‌తో రేవంత్ సరితూగరని పేర్కొన్నారు.రాష్ట్రంలో పాలనను పక్కనబెట్టి,కేసీఆర్ కుటుంబాన్ని తిడుతూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు.వంద రోజుల్లో అమలు చేస్తామన్న ఆరు గ్యారంటీలు, 420 హామీలపై ఎలాంటి చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు.నంది ఎవరో..పంది ఎవరో కాంగ్రెస్ పాలనలోనే తేటతెల్లమైందని,అతి తక్కువ సమయంలోనే ప్రజల నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న ముఖ్యమంత్రిగా రేవంత్ నిలిచారని అన్నారు.ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలనను కోరుకుంటున్నారని,చిల్లర మాటలు మాని ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టాలని సూచించారు.కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలకు రేవంత్ రెడ్డి వెంటనే బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఈ సందర్భంగా బిఆర్ఎస్ తరఫున డిమాండ్ చేశారు.

పేద బాలికలకు సత్యసాయి మిషన్ ఉచిత విద్య

బాలికలు తమ కళ్ళమీద నిలబడాలన్నదే సత్యసాయి సంకల్పం

6నుండి పీహెచ్డీ వరకు బాలికలకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత విద్య

కొండపాక నుంచి జగిత్యాల దాకా సత్యసాయి విద్యా మిషన్ ఉచిత విద్య

కొండపాక క్యాంపస్ సిఎస్ఆర్ అసిస్టెంట్ మేనేజర్ సునయన

జగిత్యాల, బ్యూరో ప్రభాత వార్త:



గ్రామీణ, పట్టణ ప్రాంతాలోని పేద బాలికలు విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతో సత్యసాయి విద్య మిషన్ ఉచిత విద్యను అందిస్తుందని తెలంగాణలోని సిద్దిపేట జిల్లా కొండపాక సత్యసాయి విద్య మిషన్ సిఎస్ఆర్ అసిస్టెంట్ మేనేజర్ కె. సునయన అన్నారు.సత్యసాయిబాబా స్థాపించిన వన్ వరల్డ్ వన్ ఫ్యామిలీ వసుధైక కుటుంబం అనే ఉన్నత సంకల్పంతో సత్యసాయి విద్యా మిషన్ తెలంగాణలో విద్యా విప్లవాన్ని సృష్టిస్తోందని ఆమె పేర్కొన్నారు.సత్యసాయిబాబా శిష్యులు మధుసూదన సాయి ఆశయాలతో, సిద్దిపేట జిల్లా కొండపాక లో ప్రారంభమైన సత్యసాయి విద్యా మిషన్ ఇప్పుడు జగిత్యాలకు విస్తరించిందని తెలిపారు.మంగళవారం కొండపాక క్యాంపస్ అసిస్టెంట్ మేనేజర్ సునయన, కామర్స్ లెక్చరర్ స్వప్న, లెక్చరర్ జయశ్రీ, కంప్యూటర్ లెక్చరర్ హర్షితలు జగిత్యాలలోని అయ్యప్ప స్వామి ఆలయంలో పేరెంట్స్ తో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సునయన, స్వప్న లు మాట్లాడుతూ 2018 లో కొండపాకలో మొదలయిందని ఇప్పుడు 151 మంది బాలికలు వివిధ తరగతుల్లో విద్యను అభ్యశిస్తున్నారని తెలిపారు. 6 వ తరగతి నుండి ఇంటర్, డిగ్రీ, పీజీ, పిహెచ్డీ వరకు ఉచితంగా కార్పొరేట్ స్థాయిలో ఆధ్యాత్మిక వాతావరణంలో విద్యను అందిస్తున్నామని స్పష్టం చేశారు. ఇక్కడ మేము చేస్తున్నది కేవలం విద్య కాదు, ఒక మహా యజ్ఞం అని వివరించారు.ప్రతి విద్యార్థికి విద్యతో పాటు డ్రెస్, పుస్తకాలతో పాటు నిత్య జీవితంలో అవసరమయ్యే వస్తువులు అందిస్తున్నామని, ఏడాదికి లక్ష రూపాయలు ఖర్చు చేస్తున్నామని, దానికి తగ్గట్టు బాలికలు ఉన్నతంగా రాణిస్తూ ఆడ సింహాలుగా తయారయ్యారని సునయన, స్వప్నలు తెలిపారు. విద్యతో పాటు ఉచిత వైద్యం, పోషకహారాన్ని అందిస్తున్నామన్నారు.ప్రభుత్వపరంగా వివిధ రకాల విద్యాలయాలు ఉన్నప్పటికీ, మేము ఎంచుకున్నది జగిత్యాలను మాత్రమేనని, ఇక్కడి బాలికలకు పూర్తి ఉచితంగా విద్యను అందించాలని నిర్ణయించామని వారు తెలిపారు.సత్య సాయి ట్రస్ట్ గా మా ప్రత్యేకత ఏమిటంటే మార్కులతో కూడిన చదువుతో పాటు, మహాభారతం, రామాయణం వంటి భారతీయ ఇతిహాసాలు,ఉపనిషత్తులతో నైతిక విలువలతో కూడిన సంస్కార విద్యను బోధిస్తున్నామని తెలిపారు.దీని ద్వారా పిల్లల్లో అద్భుతమైన మార్పు వచ్చిందన్నారు.పిల్లలకు బేసిక్ ఉన్న విద్యను బోధిస్తున్నామని, పిల్లల్లో బేధభిప్రాయాలూ లేవని అందరిని ఒకేలా చూస్తున్నామన్నారు.అన్ని దానాల్లోకెల్లా విద్యాదానం గొప్పదన్న సత్యసాయి బాబా సంకల్పాన్ని, వన్ వరల్డ్ వన్ ఫ్యామిలీ స్ఫూర్తితో ముందుకు తీసుకెళ్తామని వారు స్పష్టం చేశారు.ఇక్కడ చదివి ఉన్నతంగా రానించి ఉద్యోగం కోసం విద్యను బోధించడానికి విద్యార్థులే రిటర్న్ గా క్యాంపస్ కు వస్తున్నారని పేర్కొన్నారు.బాలికలు ఉద్యోగాలు చేసి జీవితాన్ని ఎలా డీల్ చేయాలో ఈ విద్య మిషన్ లో నేర్పుతామణి చెప్పారు. అనంతరం సత్యసాయి కొండపాక విద్య మిషన్ క్యాంపస్ లెక్చరర్లను అయ్యప్ప స్వామి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో సన్మానించారు.ఈ సమావేశంలో మధుసూదన సాయి గ్లోబల్ మిషన్ కో ఆర్డినేటర్ వూటూరి శ్రీకాంత్, గురు స్వాములు బండారి లక్ష్మీనారాయణ, నీలం దశరథ రెడ్డి, మానాల కిషన్, ప్రభాకర్, బాలు, పూజారి లక్ష్మీపతి, పేరెంట్స్ పాల్గొన్నారు.

కృష్ణవేణికి గౌరవ డాక్టరేట్‌ప్రదానం చేసిన ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ

జగిత్యాల టౌన్,ప్రభాత వార్త:



ఉమ్మడి జిల్లాకు చెందిన సంగీత రంగంలో విశిష్టేవలు అందిస్తున్న ప్రముగాయకురాలు అరికొంతం కృష్ణవేణి అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తించి స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆమె కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ అందించిన గౌరవ డాక్టరేట్‌ను బొగ్గులకుంటలోని తెలంగాణ సరస్వత భవన్‌లో జరిగిన కార్యక్రమంలో స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ వ్యవస్థాపకులు ఆకుల రమేష్, గూడూరు చెన్నారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా డాక్టరేట్ గ్రహీత కృష్ణవేణి మాట్లాడుతూ ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా తాను చేస్తున్న సంగీత సేవను గుర్తించి గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ గౌరవం తన బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులో మరింత అంకితభావంతో సేవలందిస్తూ సమాజ అభివృద్ధికి పునరంకితం అవుతానని వెల్లడించారు. అవార్డుల ప్రదానోత్సవంలో డా.పీ.జీ.సుదర్శన్, ప్రొ. కుంట సురేష్, ఆకుల మంజుల, మల్లం రమేష్ పాల్గొని వివిధ రంగాల్లో విశేష సేవలందించిన వారికి భారత్ గౌరవ్ సమ్మాన్, గౌరవ డాక్టరేట్‌లు, గ్లోబల్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టరేట్ పొందిన కృష్ణవేణికికవి కొత్త అనిల్ కుమార్,కళాశ్రీ ఈశ్వరమ్మ సాహిత్య పీఠం అధినేత గుండేటి రాజు, రుద్రమ సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు డా. చిందం సునీత, శ్రీరామోజు సంగీత తదితరులు అభినందలుతెలియజేశారు.

విద్యార్థులకు ఉచిత కంటి అద్దాలు పంపిణీ

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:జగిత్యాల జిల్లా అంధత్వ నివారణ సమితి ఆధ్వర్యంలో,జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత కంటి అద్దాల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుజాత మంగళవారం ప్రారంభించారు. గతంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 41,290 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించగా,మొదటి విడతలో 740 మందికి ఉచితంగా అద్దాలు అందజేశారు.తాజాగా రెండవ విడత కింద మిగిలిన 1,389 మంది విద్యార్థులకు ఉచిత కంటి అద్దాలను అందజేస్తున్నట్లు డీఎంహెచ్ఓ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ రాజేందర్ రెడ్డి,డిపిఓ రవీందర్, నేత్ర అధికారులు తిరుపతి, లక్ష్మీ నారాయణ,ఆర్‌బిఎస్‌కె వైద్యులు డాక్టర్ విద్య,డాక్టర్ సురేందర్,పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



జగిత్యాల వార్త



పాత పెన్షన్ పునరుద్ధరించాలి

-టీజీఈ జేఏ సి జగిత్యాల జిల్లా ఆధ్వర్యంలో నిరసనలు

జగిత్యాల టౌన్,ప్రభాత వార్త:



పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా టీజీ ఈ జేఏసీ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కా ర్యాలయం ఎదుట ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు మంగళవారం కలెక్టర్ కా ర్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయం లో నిరసన కార్యక్రమం నిర్వహించారు.జిల్లా చైర్మన్ మిర్యాలనాగేందర్ రెడ్డి, కన్వీనర్ కందుకూరు రవి బాబు, ట్రెసా అధ్యక్షులు ఎం. డీ. వకీల్, పెన్షనర్ల జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ సీ పి ఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, పెండింగ్ లో ఉన్న డీ ఏ లను విడుదల చేయాలని, పీ ఆర్ సీ ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీ ఎన్ జీవో జిల్లా కార్యదర్శి అమరేందర్ రెడ్డి, కోశాధికారి షాహెద్ బాబా పెన్షనర్ల జిల్లా కార్యదర్శి పి. సి హన్మంత్ రెడ్డి, ఎస్టీ యు జిల్లా అధ్యక్షులు బైరం హరి కిరణ్,నాల్గవ తరగతి సంఘ అధ్యక్షులు అరుణ,వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:



జగిత్యాల మండలం రూరల్ తక్కల పల్లి గ్రామంలో కసనబద గంగాధర్,దివ్య దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశ కార్యక్రమానికి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై, నూతన గృహప్రవేశం చేసిన కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా లబ్ధిదారులకు చీరను కానుకగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజంగి నందయ్య,ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణ రెడ్డి,సర్పంచ్,ఉప సర్పంచ్,మండల పార్టీ అధ్యక్షుడు బాల ముకుందం,మాజీ మున్సిపల్ ఛైర్మన్ గిరి నాగభూషణం, నాయకులు రమణ రెడ్డి,రాజశేఖర్ రెడ్డి,మహేష్,వార్డు సభ్యులు,గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర శస్త్రచికిత్స విజయవంతం

రోగి ప్రాణాలు కాపాడిన డాక్టర్ టి.విజయ్ రెడ్డి బృందం

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:

జగిత్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో తాండ్రాల గ్రామానికి చెందిన గంగారాం అనే వ్యక్తికి ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ టి. విజయ్ రెడ్డి నాయకత్వంలో అత్యవసర శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయింది. చికిత్స సమయంలో బాధితుడికి తీవ్ర రక్తస్రావమై, రక్తపోటు 80 మి.మి. హెచ్ జి కి పడిపోవడంతో వైద్యులు తక్షణమే స్పందించి 3 యూనిట్ల రక్తాన్ని ఎక్కించారు. ప్రస్తుతం రోగి కోలుకుంటున్నారని, ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు. బాధితుడి రక్తపోటు సాధారణ స్థాయికి చేరుకునే వరకు ప్రతి 15 నుండి 30 నిమిషాలకు ఒకసారి రక్తపోటు,నాడి స్పందనల వేగాన్ని వైద్య సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.రక్తం ఎక్కించడం వల్ల జ్వరం, దద్దుర్లు, వణుకు లేదా శ్వాసకోస ఇబ్బందులు వంటి ఎలాంటి దుష్ప్రభావాలు తలెత్తకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారని, అలాగే ఆపరేషన్ గాయం వద్ద మళ్లీ రక్తస్రావం కాకుండా కట్టును ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నామని వైద్యులు తెలిపారు.

డిజిటలైజేషన్‌తో సత్వర వ్యాపార అభివృద్ధి

ఓఎన్డీసీపై ఎంఎస్ఎంఈ అవగాహన కార్యక్రమం

కరీంనగర్ బిజినెస్, ప్రభాతవార్త:

డిజిటలైజేషన్‌తో సత్వర వ్యాపార విస్తృతి, అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంఎస్ఎంఈ జిల్లా మేనేజర్ దేవేందర్ అన్నారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలలో డిజిటల్ వాణిజ్య అవకాశాలు, వ్యాపార వృద్ధికి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగించడం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించేందుకు, రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్ ఎంఎస్ఎంఈ పెర్ఫార్మెన్స్ పథకం కింద ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ పై ఎంఎస్ఎంఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓఎన్డీసీ గురించి పరిచయం చేయడం, ఓపెన్ డిజిటల్ వాణిజ్య నెట్‌వర్క్ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు విస్తృత మార్కెట్‌లను చేరుకోవడానికి, డిజిటల్ ఉనికిని మెరుగుపరచుకోవడానికి, వినియోగదారుల సంఖ్యను పెంచుకోవడానికి ఎలా సహాయపడుతుందో,



డిజిటలైజేషన్, ఆన్‌లైన్ వ్యాపార అవకాశాలు, సాంకేతికత ఆధారిత పారిశ్రామికత యొక్క ప్రాముఖ్యతను వివరించారు. రాంప్ పథకం యొక్క లక్ష్యాలను, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ఎంఎస్ఎంఈలకు లభించే అవకాశాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొ.డి.వరలక్ష్మి, ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ మేనేజర్ రామకృష్ణ, డైరెక్టర్ వర ప్రసాద్, ఐక్యూఎసి కోఆర్డినేటర్ ఎం.కల్పన, ఈడీసి కోఆర్డినేటర్ బి.రజనీ దేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

-కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ అలాం
-జిల్లాలో నేరాలు 4 శాతం తగ్గాయి

తిమ్మాపూర్, ప్రభాత వార్త :



కరీంనగర్ జిల్లాలో వినాయక చవితితో పాటు దసరా పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలని కరీంనగర్ సీపీ గౌస్ అలాం కోరారు. వార్షిక తనిఖీలో భాగంగా మంగళ వారం సీపీ గౌస్ అలాం ఎల్ఎండీ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. నేరస్థుల రికార్డులను,క్రైమ్ రికార్డులను, సీజ్ చేసిన ప్రాపర్టీని, స్టేషన్ నిర్వహణ, పరిసరాలను పరిశీలించి సీఐ, ఎస్సై, సిబ్బందిని సీపీ అభినందించారు. పోలీసుల డ్రిల్ ను పరిశీలించారు. సిబ్బందికి ఆయన పలు సూచనలు, సలహాలు చేశారు. పోలీసులను ఒక్కొక్కరిని వ్యక్తిగతంగా పిలిచి వారి సమస్యలను అడిగి తీసుకున్నారు. అన్ని గ్రామాల్లో సిసీ కెమెరాల సంఖ్యను పెంచాలని, అన్ని పనిచేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది జిల్లాలో 4 శాతం నేరాలు తగ్గాయని కరీంనగర్ సీపీ గౌస్ అలాం తెలిపారు. సైబర్ నేరాలు, హత్యలు, నార్కోటిక్ కేసులు, మహిళా ఫిర్యాదు కేసుల నేరాలు పెరిగినట్లు, రోడ్డు ప్రమాదాల సంఖ్య సమానంగా ఉందని తెలిపారు. జిల్లాలో పదోన్నతుల కోసం లూప్ లైన్ పోస్టులకు వెళ్లడంతో పోలీసు అధికారుల కొరత ఉందన్నారు. జనాభా తక్కువ ఉన్న దృష్ట్యా ఎల్ఎండి పోలీస్ స్టేషన్ అప్గ్రేడ్ ప్రతిపాదన లేదన్నారు. ఇసుక అక్రమ రవాణా చేస్తూ మూడు కి పైగా కేసులు ఉంటే షీట్స్ తీరుస్తున్నామని తెలిపారు. నేరాల నియంత్రణకు పోలీస్ ఎన్ఫోర్స్మెంట్ తరచూ చేపడుతున్నట్లు తెలిపారు.రేణుకుంట టోల్ ప్లాజా వద్ద ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్ ను ఏర్పాటు చేసినట్లు సీపీ తెలిపారు. అనంతరం చెక్ పోస్ట్ ను సీపీ పరిశీలించారు.ఈ కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ ఏసిపి విజయ్, కుమార్ తిమ్మాపూర్ సిఐ బోల్లం రమేష్, ఎల్ఎండి ఎస్ఐ అన్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

వసతిగృహాన్ని సుందరంగా తీర్చిదిద్దాలి

-కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ కలెక్టరేట్, ప్రభాతవార్త:

వృద్ధులకు ఆప్యాయత.. దివ్యాంగులకు భరోసా.. వారి బాగోగులే లక్ష్యంగా కార్ఖానాగడ్డలోని ప్రభుత్వ వృద్ధుల, దివ్యాంగుల వసతిగృహాన్ని మరింత సుందరంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ చిత్రా మిశ్రా తెలిపారు.మంగళవారం వసతిగృహాన్ని సందర్శించిన కలెక్టర్.. అక్కడి వృద్ధులు, దివ్యాంగులతో ఆత్మీయంగా మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. వసతిగృహంలో అందుతున్న సౌకర్యాలు ఎలా ఉన్నాయి.. ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇప్పటికే చేపట్టిన ఆధునీకరణ పనులను పరిశీలించారు. గతంలో మంజూరైన నిధులతో చేపట్టిన పనులు ఎంతవరకు పూర్తయ్యాయి.. ఇంకా చేపట్టాల్సిన పనులు ఏమిటి.. ఇప్పటివరకు ఎలాంటి పనులు నిర్వహించారనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పెయింటింగ్ పనులను కూడా పరిశీలించారు...ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...వృద్ధులు, దివ్యాంగులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా వసతిగృహంలో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. వసతిగృహాన్ని అత్యద్భుతంగా ఆధునీకరించి,



సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని, వారి అవసరాలకు అనుగుణంగా మోలిక వసతులు మెరుగుపర్చాలని ఆదేశించారు.మోలిక వసతుల కల్పనతో పాటు అవసరమైన మరమ్మతు పనులకు ఫేజ్2 కింద మరిన్ని నిధులు మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఇందుకు అవసరమైన ప్రతిపాదనలు, అంచనాలను సిద్ధం చేయాలని జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతిని ఆదేశించారు. వృద్ధులు, దివ్యాంగులకు మెరుగైన సౌకర్యాలు అందేలా సంక్షేమ శాఖ ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు.వసతిగృహం కేవలం నివాస ప్రదేశంగా కాకుండా వృద్ధులు, దివ్యాంగులకు ఆత్మీయత, భద్రత, సౌకర్యం కలిగించే మంచి వాతావరణంగా ఉండేలా తీర్చిదిద్దాలని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, వార్డెన్ రాధిక, స్వప్న,తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదువుకోండి....కలలను సాకారం చేసుకోండి

-కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ టౌన్, ప్రభాతవార్త:

కళాశాలలోని వసతులను పరిశీలిస్తూ.. విద్యార్థుల యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ.. వారితో ఆప్యాయంగా ముచ్చటిస్తూ.. వారి భవిష్యత్ లక్ష్యాలపై దిశానిర్దేశం చేస్తూ కలెక్టర్ చిత్రా మిశ్రా ఆత్మీయత చాటారు. విద్యార్థులతో కలిసిమెలిసి మాట్లాడిన ఆమె.. వారి సమస్యలను తెలుసుకుని,కష్టపడి చదువుకోండి.. ఉన్నత లక్ష్యాలను సాధించండి.. మీ కలలను సాకారం చేసుకోండి" అంటూ వారిలో ఆత్మవిశ్వాసం నింపారు.కరీంనగర్ రూరల్ మండలం నగునూరులోని సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలను కలెక్టర్ చిత్రా మిశ్రా మంగళవారం సాయంత్రం తనిఖీ చేశారు. విద్యార్థుల కోసం తయారు చేస్తున్న వంటలను,అన్నం నాణ్యతను పరిశీలించారు. అనంతరం స్టోర్ రూమ్‌ను సందర్శించి కూరగాయలు, పండ్లు, ఇతర సామగ్రిని పరిశీలించారు.విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడారు."ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా...భోజనం బాగుంటుందా..మెనూ ప్రకారం పెడుతున్నారా. చదువు ఎలా సాగుతోంది...యూనిఫామ్స్, పుస్తకాలు వచ్చాయా... అంటూ ఒక్కో అంశంపై అడిగి తెలుసుకున్నారు.కళాశాలలోని రిజిస్టర్లను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడుతూ.. కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మాలతి, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ వార్త

జిల్లా గొర్రెల పెంపకందారుల జనరల్ బాడీ సమావేశం

కరీంనగర్ టౌన్, ప్రభాతవార్త:



కరీంనగర్ జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార సంఘం జనరల్ బాడీ సమావేశాన్ని ఈ నెల ఆఖరి వారంలో నిర్వహించనున్నట్లు జిల్లా యూనియన్ చైర్మన్ బాషవేణి మల్లేశం యాదవ్ ఒక ప్రకటనలో మంగళవారం పేర్కొన్నారు...ఈ సమావేశ ఏర్పాట్లపై రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో మల్లేశం యాదవ్ చర్చించినట్లు తెలిపారు.అసెంబ్లీ సమావేశాల అనంతరం జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేసుకోవాలని మంత్రి సూచించినట్లు ఆయన వెల్లడించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు గొర్రెలు, మేకల సంక్షేమ సంఘం రాష్ట్ర ఫెడరేషన్ చైర్మన్ కే. సరిత తిరుపతయ్యలను ఆహ్వానించినట్లు తెలిపారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

కరీంనగర్ కలెక్టరేట్, ప్రభాతవార్త:

సెప్టెంబర్ 1, 2004న పాత పెన్షన్ విధానాన్ని రద్దు చేసి కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్)ను అమలు చేయడం తో ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్ సామాజిక భద్రతను ప్రశ్నార్థకంగా మార్చారని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు షేక్ నిసార్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి కె. క్రిష్ణమ్యాచారి, అసోసియేట్ ప్రెసిడెంట్ జి. శివరాం ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎస్ అమలై 22 సంవత్సరాలు పూర్తయినా ఓపీఎస్ పునరుద్ధరించకపోవడంతో మంగళవారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల ఉద్యోగులు, ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు, నల్ల రిబ్బన్లు ధరించి విధులకు హాజరై, మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. గత ఆగస్టు 23న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన భారీ బహిరంగ సభకు రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు హాజరై పాత పెన్షన్ విధానం పునరుద్ధరణపై వారి ఆకాంక్షను ప్రభుత్వానికి స్పష్టంగా తెలియజేశారని జిల్లా నాయకులు పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో ప్రకటించిన సీపీఎస్ రద్దు పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ హామీని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన నవంబర్ 17న మేనిఫెస్టో డే గా పాటిస్తూ, ఆ రోజున రాష్ట్ర వ్యాప్తంగా సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు సామూహిక సెలవు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఇప్పటి నుంచే సిద్ధం కావాలని యూనియన్ జిల్లా నాయకత్వం పిలుపునిచ్చింది. సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ పునరుద్ధరణ కోసం జరుగుతున్న పోరాటంలో ప్రతి ఉద్యోగి, ఉపాధ్యాయుడు భాగస్వామి కావాలని, నవంబర్ 17న సామూహిక సెలవు కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ద్వారా ప్రభుత్వానికి ఉద్యోగుల ఐక్యతను, పాత పెన్షన్ పై ఉన్న బలమైన ఆకాంక్షను తెలియజేయాలని కోరారు.

పోగొట్టుకున్న సెల్ ఫోన్ అందజేసిన కరీంనగర్ రూరల్ పోలీసులు

కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త :



కరీంనగర్ రూరల్ లోని దుర్వేడ్ గ్రామానికి చెందిన కొల్లూరి అంజయ్య గత ఏడాది పోగొట్టుకున్న ఐక్యూ సెల్ ఫోన్‌ను కరీంనగర్ రూరల్ పోలీసులు రికవరీ చేసి మంగళవారం అంద జేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సిఈఐఆర్ టెక్నాలజీ సహాయంతో ఫోన్ పెద్దపల్లిలో ఉన్నట్లు ట్రేస్ చేసి స్వాధీనం చేసుకున్నారు. ఇన్స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి చేతుల మీదుగా ఫోన్‌ను బాధితుడికి అందించారు. ఫోన్‌ను ట్రేస్ చేయడంలో ప్రతిభ చూపిన టెక్ టీమ్ కానిస్టేబుళ్లు చిట్యాల రాంసాయి, ఫైజాన్‌లను సీఐ అభినందించారు.

విలాసాగర్-రూప్‌నారయణపేట.. వంతెన పనులు పూర్తి చేస్తాం

- ప్రభుత్వ విప్ విజయ రమణరావు

- 80కోట్లు నిధులు మంజూరు చేసాం..కాంట్రాక్టర్‌కు నోటిసులు

జమ్మికుంట/ హుజురాబాద్, ప్రభాతవార్త:



కరీంనగర్.. పెద్దపల్లి జిల్లాలను కలుపుతూ జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామం నుండి మానేరు వాగు మీదుగా ఓదెల మండల పరిధిలోని రూప్‌నారయణపేట మానేరు ఒడ్డు అవతలివైపుకు రెండు జిల్లాలను కలుపుతూ రవాణ సౌకర్యం కోసం ప్రజల కోరిక మేరకు బ్రిడ్జి పనులకు 80 కోట్ల రూపాయలు ప్రభుత్వం నుండి మంజూరు చేసి, పనులు ప్రారంభించామని కొంత వరకు పనులు ముందుకు సాగి, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం మూలంగా పనులు స్థంబించిపోయాయని, తక్షణమే పనులు చేపట్టవల్సిందిగా కాంట్రాక్టర్‌కు నోటిసులు ఇవ్వడం జరిగిందని రాష్ట్ర ప్రభుత్వ విప్ విజయ రమణరావు వెల్లడించారు. మంగళవారం కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలంలోని మారుమూల గ్రామం విలాసాగర్‌లో వేద పండితుడు సముద్రాల ప్రసాదాచార్యులు వారం రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించేందుకు ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణరావు, కెడిసిసి జిల్లా వైస్ చైర్మన్ పింగిలి రమేష్‌లు గ్రామానికి వచ్చి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం విలేకరులతో ప్రభుత్వ విప్ విజయ రమణరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉందని, ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నేరవేరుస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లో ప్రభుత్వ ఇమేజ్‌ని ఎంతగానో పెంచిందని, దాన్ని చూసి జీర్ణించుకోలేని బిఆర్ఎస్, బిజెపి పార్టీలు చీకటి ఒప్పందాలు కూదుర్చుకుని ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విజయరమణరావు ఆగ్రహం వ్యక్తం చేసారు. ప్రజాస్వామ్యంలో పాలన కొనసాగిస్తున్న అధికార ప్రభుత్వానికి ప్రతిపక్ష పార్టీలు ప్రజాసంక్షేమం పట్ల చిత్తశుద్ది ఉంటే.. విలువైన సూచనలు, సలహాలు ప్రభుత్వానికి ఇవ్వాలని ప్రజాస్వామ్యబద్దంగా పొరాటం చేయాలేతప్ప.. రాజకీయ ఉనికి కోసం ప్రజల్లో పబ్బం గడుపుకోవడానికి రోజుకో ఆరోపణలు చేస్తూ ప్రజల హృదయాల నుండి ఇప్పటికే బిఆర్ఎస్ పార్టీ కనుమరుగై పోయిందని విజయ రమణరావు అన్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిధిలో ప్రభుత్వం గతంలో ఎన్నడులేని విధంగా అనేక అభివృద్ది పనులకు శ్రీకారం చుట్టిందని.. ఇది ప్రజాప్రభుత్వమని విజయరమణరావు గుర్తుచేసారు. రానున్న సంవత్సర కాలంలో ఇప్పటికే రామభద్ర వంతెనపై ఆనాడు మాజీ దివంగగత ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్థన్ రెడ్డి శంకుస్థాపనలు చేసి నిర్మించిన అతి భారీ వంతెనతో పాటు దానికి కొద్ది కిలోమీటర్ల దూరంలోనే మరో రహదారి వంతెనను నిర్మించుకుంటున్నామని, ఆ వంతెన వల్ల సుల్తానాబాద్, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల వైపు వెళ్లే ప్రయాణికులకు, వాహనాలకు మరింత చేరువవుతుందన్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంపై ఇటీవలనే తక్షణమే పనులు ప్రారంభించాలని నోటీసులు జారీ చేయడం జరిగిందని విజయరమణరావు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీధర్, పంచాయితీ వార్డు సభ్యులు, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకలు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ పరామర్శ



కరీంనగర్ జిల్లా విలాసాగర్ గ్రామానికి చెందిన వేద పండితులు సముద్రాల ప్రసాదాచార్యులు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుటుంబాన్ని మంగళవారం పెద్దపల్లి శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణరావు విలాసాగర్ గ్రామాన్ని సందర్శించి మృతుడు ప్రసాదాచార్యులు చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రసాదాచార్యులు ఆయన తండ్రి సముద్రాల లోకాచార్యులు కరీంనగర్ జిల్లా జమ్మికుంట, వీణవంక, ఇల్లందకుంట మండలాలతో పాటు పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం రూప్‌నారయణపేట, మడక, ఇందుర్తి, శానగోండ,తో పాటు శ్రీరాంపూర్ మండలంలోని పలు మండలాలలో ఆ బ్రాహ్మణ కుటుంబం తన పూర్వికుల నుండి అనేక సంవత్సరాలుగా ఈ ప్రాంతానికి జగమెరిగిన బ్రాహ్మణుడని ప్రసాదాచార్యుల మరణం తీరనిలోటని ఆయనతో ఉన్న అనుబంధాన్ని ప్రభుత్వ విప్ విజయరమణరావు గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆశా డే మీటింగ్ ను ఆకస్మికంగా సందర్శించిన డీఎంహెచ్ వో డాక్టర్ అప్పయ్య

కమలాపూర్, ప్రభాతవార్త:

మంగళవారం కమలాపూర్ లో నిర్వహించిన ఆశా డే మీటింగ్ ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య ఆకస్మికంగా సందర్శించి ఆశాకార్యకర్తల పనితీరును సమీక్షించారు.ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలతో సమావేశమై గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అందుతున్న ప్రాథమిక ఆరోగ్య సేవలు, వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు, ప్రజారోగ్య కార్యక్రమాల పురోగతి, గర్భిణీ స్త్రీల నమోదు, హెచ్ పివి వ్యాక్సినేషన్ పై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.ముఖ్యంగా గర్భిణీల నమోదు, ప్రసూతి సేవలు, తల్లి శిశు ఆరోగ్యం, పూర్తిస్థాయి వ్యాక్సినేషన్, కుటుంబ నియంత్రణ, క్షయ వ్యాధి గుర్తింపు మరియు చికిత్స, రక్తహీనత నివారణ, అంటువ్యాధుల నియంత్రణ, మధుమేహం, రక్తపోటు స్క్రీనింగ్, ఫీవర్ సర్వేలు, సీజనల్ వ్యాధుల నివారణ వంటి అంశాలపై ఆశా కార్యకర్తల పనితీరును అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా హౌస్ విజిట్లు, హైరిస్క్ గర్భిణీల గుర్తింపు, పిల్లల టీకాలపై అవగాహన కల్పించడం



, అనుమానిత టీబీ కేసులను గుర్తించి పరీక్షలకు పంపడం, ప్రజలను ఆరోగ్య కేంద్రాలకు రిఫర్ చేయడం వంటి అంశాలపై వివరాలు సేకరించారు.ప్రతి ఆశాకార్యకర్త తమ పరిధిలోని కుటుంబాలతో నిరంతర సంబంధాలు కొనసాగిస్తూ ఆరోగ్య సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి సంబంధిత ఆరోగ్య కేంద్రాలకు సమాచారం అందించాలని, ప్రభుత్వ ఆరోగ్య పథకాలు, వైద్య సేవలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఆశా డే మీటింగ్ నిర్వహణ, రికార్డుల నిర్వహణ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచడం, పెండింగ్ లో ఉన్న ఆరోగ్య కార్యక్రమాల పురోగతి పై కూడా సమీక్షించారు. ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడంలో ఆశా కార్యకర్తలు కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి కృషి ద్వారా గ్రామీణ స్థాయిలో ఆరోగ్య సూచికలను మెరుగు పరచవచ్చని అన్నారు.ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు తమకు ఎదురవుతున్న సమస్యలను డీఎంహెచ్ వో దృష్టికి తీసుకురాగా పరిశీలించి అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 20వ తేదీన పల్స్ పోలియో కార్యక్రమం ఉందని, ఐదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఇంటికి ఆరోగ్యం, ప్రతి కుటుంబానికి ఆరోగ్య భద్రత అనే లక్ష్యంతో ఆరోగ్య శాఖ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిహెచ్ సి సూపరింటెండెంట్ చందు నాయక్, గైనకాలజీ వైద్యులు ప్రియదర్శిని రెడ్డి, ప్రణీత, పిహెచ్ సి వైద్యాధికారి నాగరాజు, డాక్టర్లు రోహిత్, అరుణ్, మానస, రమ్య, సబ్ యూనిట్ ఆఫీసర్ విప్లవ్ కుమార్, ఆరోగ్య విస్తరణ అధికారి రవీందర్, హెల్త్ సూపర్ వైజర్లు శ్రీకాంత్, అమృత, టీబీ నోడల్ పర్సన్ ప్రభాకర్, హెల్త్ అసిస్టెంట్లు, స్టాఫ్ నర్సులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

హుజురాబాద్ టౌన్, ప్రభాత వార్త:

డీడబ్ల్యూఓ సరస్వతి సమక్షంలో మంగళవారం హుజురాబాద్ పట్టణ శివారులోని కేసీ క్యాంపులో గల ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్ అభ్యర్థుల ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా మొత్తం 144 మంది అభ్యర్థులకు గాను 102 మంది హాజరై తమ పత్రాలను పరిశీలనకు సమర్పించగా, 42 మంది గైర్హాజరయ్యారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ సీడీపీఓ మరారి సుగుణ,



ఏసీడీపీఓ ప్రవళిక, సూపర్ వైజర్ రమ్య, అభ్యర్థులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ వార్త



వైభవంగా అభయాంజనేయ స్వామికి 1,116 నాగవల్లి దళాలతో ప్రత్యేక పూజలు

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;



జమ్మికుంట పట్టణంలోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం 1,116నాగవల్లి (తమలపాకుల) దళాలతో ఆంజనేయ స్వామికి భక్తులు వైభవంగా అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ మాసం మూడవ మంగళ వారం సందర్భంగా అర్చనలు నిర్వహించారు. దేవాలయ ప్రధాన అర్చకులు డింగిరి హరికృష్ణ మాచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాలతో భక్తులు అభిషేకం చేశారు.నాగవల్లి దళాలను స్వామివారికి సమర్పించారు. హనుమాన్ నామ స్మరణతో స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. శివరామకృష్ణ భజన మండలి ఆధ్వర్యంలో భక్తులు భజనలు చేశారు.

శంకర్ రెడ్డి కుటుంబానికి రూ. కోటి బీమా పరిహారం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేతుల మీదుగా చెక్కు అందజేత

జమ్మికుంట/హుజురాబాద్,ప్రభాతవార్త:



విధి నిర్వహణలో మరణించిన 132 కేవీ సబ్ స్టేషన్ ఆర్టిజన్, హుజురాబాద్ కు చెందిన బోడ శంకర్ రెడ్డి కుటుంబానికి రూ. కోటి ప్రమాద బీమా చెక్కును మంజూరు చేశారు. ప్రజాభవన్ లో జరిగిన ఈ కార్యక్రమంలో పవర్ ఎంప్లాయిస్ యూనియన్ (1535) ఆధ్వర్యంలో రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేతుల మీదుగా శంకర్ రెడ్డి భార్య స్వాతికి ఎస్.బి.ఐ బ్యాంక్ ద్వారా మంజూరైన ఈ చెక్కును ప్రదానం చేశారు. ఈ భారీ బీమా పరిహారం సకాలంలో రావడంలో 1535 పవర్ ఎంప్లాయిస్ యూనియన్ విశేషంగా సహకరించింది. బాధిత కుటుంబానికి అండగా నిలిచిన ప్రభుత్వానికి, డిప్యూటీ సీఎంకు యూనియన్ తరపున నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర నాయకులు వజీర్, ఉట్ల ప్రభుదాస్, ప్రమోద్ కుమార్, కీర్తి శ్రీనివాస్, పులి కోటి గౌడ్, రాజు లింగం, మేడి రమేష్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర పార్టీ కార్యాలయముపై దాడిని ఖండిస్తున్నాం

ముస్తాబాద్, ప్రభాతవార్త:



బీజేపీ రాష్ట్ర పార్టీ కార్యాలయం పై కాంగ్రెస్ నాయకులు బీజేపీ పార్టీ కార్యాలయము పై దాడిచేసి దాడి చేసి నల్ల రంగు పూయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని బీజేపీ నాయకులు కస్తూరి కార్తీక్ రెడ్డి అన్నారు.రాజకీయ విభేదాలు వుంటే ప్రజాస్వామ్య పద్ధతిలో ఎదుర్కోవాలి తప్ప దాడులు,విధ్వంసాలకు పాల్పడటం ప్రజస్వామ్య విలువలకు విరుద్ధమని తెలిపారు.రాష్ట్ర బీజేపీ కార్యాలయము పై దాడికి పాల్పడిన ప్రతి ఒక్కరిపై కేసులు నమోదు చేసి కఠిన మైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.దాడికి పాల్పడిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోకపోతే ఊరుకునే ప్రసక్తే లేదని సృష్టం చేశారు.భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

యువతను మత్తుపదార్థాల బారిన పడకుండా కాపాడటమే లక్ష్యం

గోదావరిఖని 1 టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి

గోదావరిఖని 1 టౌన్ పరిధిలో నార్కోటిక్ డాగ్ స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు

పెద్దపల్లి జిల్లా బ్యూరో (గోదావరిఖని క్రైమ్), ప్రభాతవార్త:

యువతను మత్తుపదార్థాల బారిన పడకుండా కాపాడటమే లక్ష్యం తనిఖీలు చేపడుతున్నామని గోదావరిఖని 1 టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు మాదక ద్రవ్యాల నిర్మూలన, నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా మంగళవారం గోదావరిఖని 1 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీ చౌక్‌లో గోదావరిఖని 1 టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి, ఆప్జాలోద్దీన్ ఆధ్వర్యంలో నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ సహాయంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పలు దుకాణాలు, పాన్ షాపులు, టీ స్టాల్స్, నూతన నిర్మాణ ప్రాంతాలు, యువత ఎక్కువగా గుమికూడే ప్రదేశాలు, ఇతర అనుమానాస్పద ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మాదక ద్రవ్యాల రవాణా, విక్రయం,



వినియోగం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు సీఐ తెలిపారు. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల రవాణా, విక్రయం, నిల్వ లేదా వినియోగానికి పాల్పడే వారిపై చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో పోలీసు సిబ్బంది, నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

100 రోజుల ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉచిత కోచింగ్ అందిస్తున్నాం

టీఆర్‌పి పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు మెరుగు చందర్ యాదవ్

పెద్దపల్లి, ప్రభాతవార్త:



నిరుద్యోగ యువత ఆర్థిక భారం ఎదుర్కోకుండా ఉండేందుకే ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలంగాణ రాజ్యాధికార పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు మెరుగు చందర్ యాదవ్ తెలిపారు. ఎస్సై, కానిస్టేబుల్, ఎఫ్‌బీఓ, జీపీవో లాంటి వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల కోసం ఈ ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా సహకారంతో 100 రోజుల పాటు నిరంతరంగా ఈ ఉచిత కోచింగ్ కొనసాగుతుందని వెల్లడించారు. ప్రస్తుతం శిక్షణ కోసం దరఖాస్తుల స్వీకరణ జరుగుతోందని, అర్హులైన అభ్యర్థులు వెంటనే వాట్సాప్ గ్రూప్‌లో చేరి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. పెద్దపల్లి జిల్లాలోని నిరుద్యోగులంతా ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కోర్సుకి సంబంధించిన సందేహాలు లేదా పూర్తి వివరాల కోసం 9700577556 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు మేరుగు సతీష్ గౌడ్, జిల్లా జాయింట్ సెక్రటరీ కాంపెల్లి స్వామి, జిల్లా సెక్రటరీ కుమ్మరి పరమేష్, పెద్దపల్లి మండల అధ్యక్షులు వెంగల కృష్ణ, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్ల ప్రశాంత్, గోగు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలి

గ్రామ సర్పంచ్ మేకల రోజా రాణి విజయకుమార్

విద్యార్థులకు షూస్, యూనిఫాంల పంపిణీ

పెద్దపల్లి రూరల్, ప్రభాతవార్త: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని చదువులో రాణించాలని బ్రాహ్మణపల్లి గ్రామ సర్పంచ్ మేకల రోజా రాణి విజయకుమార్ సూచించారు. బ్రాహ్మణపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా షూస్, స్కూల్ యూనిఫాంల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ మేకల రోజా రాణి విజయకుమార్ హాజరై తమ చేతుల మీదుగా విద్యార్థులకు షూస్, యూనిఫాంలను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద



విద్యార్థులకు యూనిఫాం, షూస్ అందించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సీసీ మెంబర్, వీవోఏలు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడల్లో సత్తా చాటండి.. లక్ష్యాన్ని చేరుకోండి!

మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ

సుల్తానాబాద్, ప్రభాతవార్త: విద్యార్థినీ, విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటి తమ లక్ష్యాలను చేరుకోవాలని సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ అన్నారు. చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యం ఇచ్చి అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు.మంగళవారం సుల్తానాబాద్‌లోని ఇండియన్ పబ్లిక్ పాఠశాలలో ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలను బిరుదు రాధాకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతోపాటు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులకు మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో మంచి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.మండలంలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థినీ, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. గెలుపోటములను సమానంగా



స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు.

బాలికల విభాగంలో పోటీలు

మంగళవారం బాలికల విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడా పోటీలను నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన క్రీడాకారులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తదుపరి స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి సురేష్, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అంతటి పుష్పలత ఇండియన్ పబ్లిక్ పాఠశాల చైర్మన్, ప్రిన్సిపాల్ మాటేటి కృష్ణప్రియ సంజీవ్, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు ముస్త్యాల రవీందర్, తిరుపతి, పేట కార్యదర్శి దాసరి రమేష్, మండల కార్యదర్శి తాండ్ర ప్రణయ్, ఖేల్ ఇండియా కోచ్ గెల్లు మధుకర్,వ్యాయామ ఉపాధ్యాయులు దాసరి ప్రసాద్, వెంకటేష్, ఆసియా, శ్రీవాణి, సంధ్య, వెంకటలక్ష్మి, అంజలి,బొల్లి సత్యనారాయణ, శివ, సతీష్, జ్యోతి, ఇక్బాల్, సంపత్, రాజేష్, సునీత, అజ్జు, రాకేష్, రాజు, అజయ్,తోపాటు వివిధ పాఠశాలల విద్యార్థులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



పెద్దపల్లి వార్త

చీడపీడల నివారణపై రైతులకు అవగాహన

ఓదెల,ప్రభాతవార్త:

ఓదెల మండలం పోత్కపల్లి రైతు వేదికలో ఆత్మ ఆధ్వర్యంలో ఆర్పిఎల్ శిక్షణలో భాగంగా సమీకృత వ్యవసాయం, నూతన సాగు పద్ధతులు, వానాకాలం పంటల్లో చీడపీడల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.కునారం వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సతీష్ చంద్ర మాట్లాడుతూ పంట మార్పిడి ప్రయోజనాలు, వరి, పత్తి, మొక్కజొన్నలో ఎరువుల యాజమాన్యం, కలుపు నివారణ, చీడపీడల నియంత్రణపై రైతులకు పలు సూచనలు చేశారు. తెలంగాణ విజ్ఞాన కేంద్రం పెద్దపల్లి జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సంపత్ మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణ, ఆరుతడి పంటల ప్రయోజనాలను వివరించారు.వరిలో మోగి పురుగు, మొక్కజొన్నలో కత్తెర పురుగు, పత్తిలో పచ్చదోమ నివారణకు శాస్త్రవేత్తలు సూచించిన మందులను సిఫార్సు చేసిన మోతాదులో వినియోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి. భాస్కర్, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ల సుమన్ రెడ్డి, స్థానిక సర్పంచ్ అంబాలసారమ్మ, ఏఈఓలు మోనిక, కిరణ్, రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

కాల్వ శ్రీరాంపూర్ ప్రభాతవార్త:



ఉద్యోగుల సమస్యలను తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు స్థానిక తాసిల్దార్ రాపల్లి రాముడు అన్నారు సిపిఎస్ విద్రోహ దిన సందర్భంగా మండల తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉద్యోగులు నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, అలాగే ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను వెంటనే విడుదల చేయాలని, పి ఆర్ సి తక్షణమే అమలు చేయాలని, వివిధ కారణాలతో నిలిచిపోయిన ఉద్యోగుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్నిడిమాండ్చేశారు.ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల ఆర్థిక భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం ఉద్యోగ సంఘాలు ఐక్యంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో తమపోరాటాన్ని కొనసాగిస్తామనితెలిపారు.ఈ కార్యక్రమంలో మండల గిర్దవార్లు, ఎం.వినోద్, రాజేష్ మరియు ఎం పి ఎస్ ఓ శ్రీవాణి, జి పి ఓ లు మరియు ఇతర కార్యాలయ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు

సదాశయ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

డా. సుపర్ణ

ఓదెల,ప్రభాతవార్త:



41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా సదాశయ ఫౌండేషన్ పక్షోత్సవాలను వాసన్ ఐ బ్యాంక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. హైదరాబాద్‌లో బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వాసన్ ఐ బ్యాంక్ సీనియర్ మేనేజర్ అరవింద్ కుమార్ అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారుముఖ్య అతిథి ఎంపీసీబీ వీఎల్ జాయింట్ డైరెక్టర్ డా. ఎం. సుపర్ణ మాట్లాడుతూ గత 18 ఏళ్లుగా నేత్ర, అవయవ, శరీరదానాలపై సదాశయ ఫౌండేషన్ చేస్తున్న సేవలను అభినందించారు. కార్నియల్ అంధత్వ నివారణకు స్వచ్ఛంద సంస్థలతో కలిసి త్వరలో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు టి. శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ 2008లో ప్రారంభమైన సంస్థ ఇప్పటివరకు 1,645 నేత్రదానాలు, 160 దేహదానాలు, 95 అవయవదానాలు చేయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా టి. శ్రవణ్ కుమార్, సీహెచ్. లింగమూర్తి, డా. మేరుగు భీష్మాచారి తదితరులను డా. సుపర్ణ, అరవింద్ కుమార్, కార్నియల్ సర్జన్ డా. శ్రీవిన్య సన్మానించారు.

ఎక్సలెంట్ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోండి

మండల విద్యాధికారి కార్యాలయ సిబ్బందిని బదిలీ చేయండి

భక్తు విజయ్ కుమార్

చొప్పదండి,ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన చైల్డ్ ఇన్ఫో యు డి ఐ ఎస్ ఇ లో భక్తు అద్వితశ్రీ 2023 నుండి 2026 వరకు 1,2,3 తరగతులు ఎక్సలెంట్ స్కూల్లో చదివిన ఆన్లైన్ చేయలేదని, మేము ఫీజులు కట్టి ఎంతో నమ్మకంతో చదివిస్తే కనీసం యుడిఐఎస్ ఇ లో ఆన్లైన్ చేయలేదని, ఆన్లైన్ చేయడంలో కంప్యూటర్ ఆపరేటర్ నిరక్ష్యమ్మా, యాజమాన్యం నిరక్ష్యమ్మా బాధ్యత లేకుండా వ్యవహరించారని,తక్షణమే ఎక్సలెంట్ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని భక్తు విజయ్ కుమార్ మండల విద్యాధికారికి మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫిర్యాదులో ఎక్సలెంట్ పాఠశాలలో పి పి టి టి సి, డి ఈ డి, బీఈడీ ఉన్నారా అని కనీసం పరిశీలించని, పర్యవేక్షించని మండల విద్యాధికారి కార్యాలయం సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు.విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని,పిల్లల తల్లిదండ్రుల ఫీజులు కట్టి పాఠశాలకు పంపిస్తే,పిల్లల పేర్లు ఆన్లైన్ చేయకపోవడం వల్ల తీవ్ర ఆందోళనకు గురవుతున్నామని, తక్షణమే పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని విజయ్ కుమార్ కోరారు. లేనిపక్షంలో సమ స్యను లిఖితపూర్వకంగా జిల్లా విద్యాధికారికి, జిల్లా కలెక్టర్ కు సృష్టికి తీసుకువెళ్తూ ఫిర్యాదు చేస్తామని విజయ్ కుమార్ తెలిపారు. లో కూడా మా కుమారుని ది యు డి ఐ ఎస్ ఇ చేయకపోవడం వల్ల సిరిసిల్ల జిల్లా కార్యాలయం కు వెళ్లి తల్లిదండ్రులమైన మేమే ఆన్లైన్ చేసుకున్నా మన్నారు. విషయంపై మండల విద్యాధికారి కార్యాలయంలో సిబ్బందికి ఫోన్ చేస్తే తల్లిదండ్రులమైన మమ్ములను బెదిరింపులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. ఏళ్ల తరబడి బదిలీలు లేక ఇక్కడే కొనసాగుతున్న సిబ్బందిని బదిలీ చేయాలని విజయ్ కుమార్ కోరారు. ఆ పాఠశాలలో చదివే తల్లిదండ్రులు వెంటనే పాఠశాలకు వెళ్లి వారి పిల్లల డేటా యు డి ఐ ఎస్ ఇ ఉందో లేదో, పాఠశాల సిబ్బంది క్వాలిఫై టీచర్స్ ఉన్నారో లేదో తెలుసుకోవాలని కోరారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలి

సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్

చొప్పదండి,ప్రభాతవార్త:



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వాగ్దానాలను అమలు చేయాలని సిపిఎం పార్టీ చొప్పదండి మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక డిప్యూటీ తాసిల్దారు కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉప్పునూటి శ్రీనివాస్ సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రైతులకు ఉచిత విద్యుత్తు అందించాలని రైతాంగానికి24 గంటల కరెంటు ఇవ్వాలని కరెంటు కోతలు ఉండదని ఎరువుల కొరత నివారించాలని కోరారు .హమాలీలకు హమాలి కాలనీలు ఏర్పాటు చేసి ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని, కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ గుర్తింపు కార్డు ఇవ్వాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, ఎన్నికలసమయంలో ఇచ్చిన హామీల ను ప్రభుత్వాలు నిరక్ష్యం చేయకుండా ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలలు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో అధిక ఫీజులతో సామాన్య ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్య, వైద్యం సామాన్యులకు అందుబాటులో ఉండేలా ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసి యువతకు ఉపాధి భద్రత కల్పించాలని కోరారు. చొప్పదండి మున్సిపల్ కేంద్రంలో పైప్ లైన్ల పేరుతోనే సీసీ రోడ్లను తవ్వుతున్నారు రోడ్ల ను మరమ్మతులు చేయకుండా ప్రజలకు ఇబ్బందికి కురిచేస్తున్నారని వెంటనే పనులు పూర్తి చేయాలని అధికారులను కోరారు.ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని సీపీఎం నాయకులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి గంగిపల్లి కుమారు మావురం శ్రీనివాస్ మునిగంటి కనకయ్య, అశోక్ రాజన్నల రాజమల్లు, జవ్వాజి అరుణ్, నరసయ్య, నరేష్, శేఖరు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలి

మల్యాల, ప్రభాతవార్త



తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 30 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన 14 వేల కోట్ల రూపాయల బకాయిలు ఉన్న ఫీజు రీయంబర్స్మెంట్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరుతూ మంగళవారం ధర్మ సమాజ్ పార్టీ నాయకులు మల్యాల మండలం తహసిల్దార్ కి వినతిపత్రం అందజేశారు, కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి గసికంటి ఉపేందర్, బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ మండల అధ్యక్షులు ప్రణీత్, నాయకులు విజయ్, సతీష్, విగ్నేష్, తరుణ్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ సమస్యల సమీక్ష సమావేశం లో కోనేరుపల్లి సర్పంచ్

చొప్పదండి,ప్రభాతవార్త:



రాష్ట్రంలో గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం గ్రామాలు ఎదుర్కొంటు న్న సమస్యల పై పంచాయతీ రాజ్ కమిషనర్ కార్యాలయం లో మంగళ వారం పంచాయతీ రాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్ నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుండి హాజరై అభిప్రాయాలు కోనేరుపల్లి గ్రామ సర్పంచ్ కాసు వేణుగోపాల రాజు వివరించారు.ఈ సమీక్ష సమావేశం లో డివ్యూటీ కమిషనర్లు, ఉమ్మడి జిల్లా నుండి సర్పంచ్ లు పాల్గొన్నారు.

కొండగట్టు అంజన్న ను దర్శించుకున్న పోతారం పాక్స్ పాలకవర్గం

మల్యాల ,ప్రభాతవార్త



మల్యాల మండలం పోతారం సింగిల్ విండో కు ఇటీవలే ప్రభుత్వం నూతన పాలకవర్గాన్ని నియమించగా,ఈ మేరకు చైర్మన్ కొల్లూరి గంగాధర్ ఆధ్వర్యంలో నూతన పాలకవర్గ సభ్యులు మంగళవారం జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయాన్ని సందర్శించారు, ఆలయంలో శ్రీ ఆంజనేయ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు,అనంతరం చైర్మన్ గంగాధర్ మాట్లాడుతూ, సమృద్ధిగా వర్షాలు కురిసి, వ్యవసాయ రంగంలో రైతులు ఆర్థిక అభివృద్ధి సాధించి, సహకార సంఘం అభివృద్ధి పథంలో పయనించాలని శ్రీ స్వామి వారిని కోరుకున్నట్లు తెలిపారు, కార్యక్రమంలో విండో ఉపాధ్యక్షులు నల్ల వసంత తిరుపతి రెడ్డి, డైరెక్టర్లు విజయ, రమేష్ ,లక్ష్మి, శంకర్, మనోహర్ ,లక్ష్మారెడ్డి, మనోహర్ రెడ్డి, భూమక్క, తిరుపతి, చంద్రయ్య సీఈవో కంఠం గంగాధర్, కాంగ్రెస్ నాయకులు కంటే అరుణ్ కుమార్ పాల్గొన్నారు,

9 నుండి మండల స్థాయి పాఠశాలల క్రీడలు

మల్యాల, ప్రభాతవార్త: ఈనెల 9 నుండి 11 వరకు మండల స్థాయిలో పాఠశాల ల విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు మల్యాల మండల విద్యాధికారి జయ సింహారావు తెలిపారు, ఈ మేరకు మంగళవారం క్రీడల నిర్వహణపై వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు, ఈనెల 9న అండర్ 14, 17 బాలికలకు కబడ్డీ, కోకో, వాలీబాల్ 10 న బాలురకు,11 న బాల బాలికలకు అథ్లెటిక్స్ చదరంగం ఎంపిక పోటీలు నిర్వహించ నున్నట్లు ఆయన తెలిపారు, తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించే ఈ క్రీడా పోటీలకు విద్యార్థులు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల సంతకం చేయబడిన ధ్రువపత్రంతో హాజరు కావాలన్నారు,

చొప్పదండి వార్త



పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు మొక్కలను నాటండి

పర్యావరణం ను కాపాడండి చొప్పదండి

మునిసిపల్ చైర్ పర్సన్ వడ్లూరి సరిత శ్రీనివాస్

చొప్పదండి,ప్రభాతవార్త:



మొక్కలను ప్రతి వింటానాటి పచ్చదనాన్ని పెంచినట్లయితే పర్యావరణాన్ని కాపాడిన వాళ్ళం అవుతామని ఆడిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని చొప్పదండి మున్సిపల్ చైర్ పర్సన్ వడ్లూరి సరిత శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు మంగళవారం చొప్పదండి పట్టణంలోని 12వ వార్డులు కౌన్సిలర్ ముద్దం రాజేశ్వరి తిరుపతి ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ పెరుమండ్ల మానస గంగయ్య, కౌన్సిలర్లు కొత్త సుమలత గంగారెడ్డి, గుర్రం రాజేందర్ రెడ్డి, పిట్టల వెంకటేష్, జిట్ట మంగ కుమార్, కనుమల్ల రాజశేఖర్, విండో డైరెక్టర్ మారు తిరుపతిరెడ్డి, సింహాచలం ప్రభాకరాచార్యులు, బొడిగె తిరుపతి, బొడిగె మహేందర్ తో పాటు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

లంబాడిపల్లి పద్మశాలి సంఘం అధ్యక్షునిగా శ్రీకాంత్

మల్యాల, ప్రభాతవార్త:

మల్యాల మండలం లంబాడి పల్లి గ్రామంలో మంగళవారం పద్మశాలి



గ్రామ శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు, సంఘం అధ్యక్షులుగా వేముల శ్రీకాంత్ ఎన్నికయ్యారు,ఉపాధ్యక్షులుగా పెంట శ్రీధర్, కోశాధికారిగా వేముల మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా పెంట రమేష్, సహాయ కార్యదర్శిగా వేముల సతీష్, కార్యవర్గ సభ్యులుగా, వేముల ప్రభాకర్, పెంట ప్రభాకర్ లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పద్మశాలి మండల అధ్యక్షులు ముల్క మల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు పెంట సుధాకర్, లంబాడిపల్లె గ్రామ పద్మశాలి కుల సంఘ సభ్యులు పాల్గొన్నారు,

మెడికవర్ ఉచిత వైద్య శిబిరంకు విశేష స్పందన

చొప్పదండి,ప్రభాతవార్త:



చొప్పదండి మున్సిపాలిటీలోని 9వ వార్డులో మెడికవర్ హాస్పిటల్, వార్డు కౌన్సిలర్ గుర్రం రాజేందర్ రెడ్డి సంయుక్తధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు వడ్లూరి అజయ్ కుమార్ నేతృత్వంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా మున్సి పల్ చైర్ పర్సన్ వడ్లూరి సరిత‌శ్రీనివాస్ హాజరై కార్య క్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ సరిత మాట్లాడుతూ కార్పొరేట్ రెస్పాన్సి బిలిటీ (సీఎస్ఆర్)లో భాగంగా మెడికవర్ ఆసుపత్రి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను గ్రామీణ ప్రజలకు అందించడం అభినందనీయమన్నారు. చొప్పదండి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులోకి తేవడం ఎంతో ప్రయోజనకరమని పేర్కొన్నారు. వైద్య శిబిరానికి 150 మంది హాజరు అయినవారికి వైద్యులు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగరు, ఈసీజీ, రక్త పరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందించారు. మెడికవర్ సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ పెరుమాండ్ల మానస గంగయ్య గౌడ్, కౌన్సిలర్లు పిట్టల వెంకటేష్, ముద్దం తిరుపతి గౌడ్, మెడికవర్ ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ కోట కరుణాకర్, అబ్దుల్ వకీల్, విద్యాసాగర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

భీమన్న సేవలో ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

వేములవాడ, ప్రభాతవార్త:







వేములవాడలోని శ్రీ భీమేశ్వర స్వామివారిని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్ మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భీమేశ్వర వసతి గృహం వద్దకు చేరుకున్న చైర్మన్‌కు పోలీసు సిబ్బంది గౌరవ వందనంతో గార్డ్ ఆఫ్ ఆనర్ అందించారు. అనంతరం ఆలయానికి చేరుకున్న చైర్మన్, సభ్యులకు అర్చకులు, వేద పండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. ఆలయ ఈఓ ప్రతాప నవీన్‌కుమార్ స్వామివారి శేషవస్త్రం, లడ్డూ ప్రసాదాలను అందించి వారిని సత్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని భీమేశ్వర స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. చిన్నతనంలో కాలినడకన వేములవాడకు వచ్చి రాజన్నను దర్శించుకుని,రెండు మూడు రోజులు ఇక్కడే ఉండేవాళ్లమని ఆయన గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ సీఐ వీరప్రసాద్, పీఆర్వో పెరుక శ్రీనివాస్,ఆలయ పర్యవేక్షకులు రాజేందర్, నరేందర్, ఆలయ ఉద్యోగులు,అర్చకులు,పోలీసు సిబ్బంది,ఇతర అధికారులు పాల్గొన్నారు.

మల్లాపూర్ లో తపస్
ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన

కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు చేయాలి

తపస్ జిల్లా అధ్యక్షులు గసికంటి శ్రీనివాస్

బోయిన్‌పల్లి, ప్రభాతవార్త :



తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఆరు నెలల్లోపు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలులో ఉన్న కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని ఓ పి ఎస్ కొనసాగిస్తామని కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ హామీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ టి జి ఈ జాక్ పిలుపు మేరకు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న జిల్లాలోని అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. బోయిన్ పల్లి మండలంలోని మల్లాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో తాపస్ జిల్లా అధ్యక్షులు గసికంటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్ ఆర్థిక భద్రతకు పాత పెన్షన్ విధానం ఎంతో కీలకమైనదని తపస్ జిల్లా అధ్యక్షులు గసికంటి శ్రీనివాస్ గారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల న్యాయమైన డిమాండ్‌ను సానుకూలంగా పరిశీలించి కొత్త పెన్షన్ విధానాన్ని (ఎన్‌పిఎస్/కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం) వెంటనే రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ప్రభుత్వం ఇకనైనా స్పందించి ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలకు అనుగుణంగా పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం ఈ విషయంలో వెంటనే నిర్ణయం తీసుకోకుండా కాలయాపన చేస్తే, భవిష్యత్తులో మరింత విస్తృతమైన ఉద్యమ కార్యాచరణను ప్రకటించి, ఉద్యోగ, ఉపాధ్యాయుల హక్కుల కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో పోరాటాన్ని కొనసాగిస్తామని తపస్ జిల్లా అధ్యక్షులు గసికంటి శ్రీనివాస్ హెచ్చరించారు. పాత పెన్షన్ విధానం అమలు చేయాలి–ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్‌కు భద్రత కల్పించాలి అని తపస్ స్పష్టం చేసింది. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు
కుటుంబ సర్వేకు సహకరించాలి

బోయిన్‌పల్లి ,ప్రభాతవార్త :



మున్నూరుకాపు సమాజ అభివృద్ధి, సంక్షేమం, ఐక్యతకు అవసరమైన సమగ్ర సమాచారాన్ని సేకరించే లక్ష్యంతో నిర్వహిస్తున్న మున్నూరుకాపు కుటుంబ సర్వే–2026లో ప్రతి కుటుంబం భాగస్వామ్యం కావాలని చొప్పదండి నియోజకవర్గం మున్నూరుకాపు జర్నలిస్ట్ ఫోరం ఇన్‌చార్జ్ మడ్లపల్లి శ్రీనివాస్ పటేల్ పిలుపునిచ్చారు. చొప్పదండి నియోజకవర్గంలోని బోయినపల్లి మండల కేంద్రంలో మంగళవారం మండల మున్నూరుకాపు ప్రతినిధులతో కలిసి సర్వే పోస్టర్‌ను ఆవిష్కరించారు. మున్నూరుకాపు జర్నలిస్టు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కొత్త లక్ష్మణ్ పటేల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు వేల్పుల శ్రీనివాస్ పటేల్‌తో పాటు బోయినపల్లి మండలానికి చెందిన మున్నూరుకాపు ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మడ్లపల్లి శ్రీనివాస్ పటేల్ మాట్లాడుతూ మున్నూరుకాపుల ఐక్యత, సమగ్ర అభివృద్ధి, సంక్షేమానికి ఉపయోగపడే విధంగా డిజిటల్ డేటాబేస్ రూపొందించేందుకు కుటుంబ సర్వే చేపట్టినట్లు తెలిపారు. సేకరించిన సమాచారంతో భవిష్యత్‌లో సమాజ అవసరాలను గుర్తించి సంక్షేమ కార్యక్రమాల రూపకల్పనకు దోహద పడుతుందని పేర్కొన్నారు. చొప్పదండి నియోజకవర్గంలోని మున్నూరు కాపు కుటుంబాలన్నీ సర్వేలో తమ వివరాలను నమోదు చేసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రతి కుటుంబం భాగస్వామ్యం కావడం ద్వారా సమాజ ఐక్యత మరింత బలోపేతం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో బోయినపల్లి మండల మున్నూరుకాపు ప్రతినిధులు రాజన్న సిరిసిల్ల జిల్లా సంయుక్త కార్యదర్శి మరియు తడగొండ మాజీ సర్పంచ్ చిందం రమేష్ దేశేపల్లి మాజీ సర్పంచ్ మాడిశెట్టి జనార్ధన్ బోయినిపల్లి మండల ప్రధాన కార్యదర్శి అమీర్ శెట్టి భూమి రెడ్డి బూరుగుపల్లి సర్పంచ్ పెంచాల సౌమ్య మహేష్ తడగొండ మున్నూరు కాపు సేవా సంఘం అధ్యక్షులు సింగరి రమేష్ గౌరవ అధ్యక్షులు రేండ్ల కనకయ్య వార్డు మెంబర్ బుర్ర రాజు మాజీ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శులు కుల సంఘాల నాయకులు కుల సభ్యులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

బోయిన్ పల్లి ప్రభాత వార్త



బోయిన్‌పల్లి మండల కేంద్రం లో 2005 2006 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు పూర్వవిద్యార్థులు అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాతో సన్మానించారు అనంతరం ఒకరికి ఒకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నార.ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ బిల్లా ఆనందం,పాఠశాల ఉపాధ్యాయులు ఆంజనేయులు, కృష్ణ హరి, చంద్రమోళి, సంతోష్, రామానుజం, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ ను రద్దుచేసి, ఓపిఎస్ ను అమలు చేయాలి

రుద్రంగి ప్రభాత వార్త:



సీపీఎస్ ను రద్దుచేసి, ఓపిఎస్ ను అమలు చేసి ఉద్యోగ జేఏసీ ఆదేశాలను నెరవేర్చాలని కోరుతూ రుద్రంగి మండల ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు బోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భముగా వారు మాట్లాడుతూ.. సీపీఎస్ విధానం వల్ల ఉద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతుందని, ఉద్యోగ సంఘాలు పలుమార్లు ఆందోళనలు చేసినప్పటికిని ప్రభుత్వంలో ఎలాంటి మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేసారు. ప్రభుత్వం ఇప్పటికైన పునరాలోచించి సీపీఎస్ విదానాన్ని రద్దు చేసి ఓపీఎస్ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేములవాడ వార్త

తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కలిసిన సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్

బోయిన్ పల్లి ప్రభాత వార్త



బోయిన్‌పల్లి మండల సెస్ డైరెక్టర్ ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు కొట్టేపల్లి సుధాకర్ తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య రాజన్న సిరిసిల్ల జిల్లాకు విచ్చేయగా ఆయన ను కలెక్టర్ కార్యాలయంలో కలిసి మర్యాదపూర్వకంగా పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానం నిర్వహించి మర్యాదపూర్వకంగా మాట్లాడినట్లు తెలిపారు. ఆయన వెంట పలువురు నాయకులు పాల్గొన్నారు.

108, అంబులెన్స్ సేవలపై అవగాహన

ప్రభాత వార్త కోనరావుపేట



కోనరావుపేట మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలకు 108 అత్యవసర సేవలు, నియోనాటల్ అంబులెన్స్ సేవలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవం అనంతరం నవజాత శిశువులకు మెరుగైన వైద్యం అవసరమైన సందర్భాల్లో అంబులెన్స్ సేవలను వినియోగించుకోవాలని నవజాత శిశువులను సిరిసిల్ల, కరీంనగర్, వరంగల్ తదితర ప్రధాన ఆసుపత్రులకు తరలించేందుకు 24 గంటల పాటు వాహన సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ఆలస్యం చేయకుండా 108 సేవలను సద్వినియోగం చేసుకోవాలని, తల్లి, శిశువుల ఆరోగ్య పరిరక్షణలో అత్యవసర రవాణా సేవల ప్రాధాన్యతను వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లోని తల్లిదండ్రులకు ఈ సేవలపై ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యశాల సిబ్బంది ఆశా వర్కర్లు 108 సిబ్బంది పెద్ది శ్రీనివాస్, జలగం సత్యసాగర్ తదితరులు పాల్గొన్నారు.

బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ, ప్రభాతవార్త:



వేములవాడ పట్టణంలోని ప్రసిద్ధ బద్ది పోచమ్మ ఆలయంలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడగా, భక్తులు క్యూలైన్లలో నిలబడి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. మొక్కులు చెల్లించుకుని, కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది, పోలీసులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రైతుల వ్యవసాయ అవసరాలకు సహకార సంఘం ద్వారా రుణాలు

సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్

మంథని రూరల్ ప్రభాతవార్త:



రైతుల వ్యవసాయ అవసరాల కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా రైతులకు కర్షక మిత్ర రుణాలు మంజూరు చేసినట్లు మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక సంఘ కార్యాలయంలో రుణాలు మంజూరైన రైతులకు సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ సంఘ కార్యదర్శి బొద్దుల సమ్మయ్య తో కలిసి రుణ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ పనులకు అవసరమైన ఆర్థిక సహకారం అందించడమే సహకార సంఘం ప్రధాన లక్ష్యమని తెలిపారు. రైతులు ఈ రుణాలను సద్వినియోగం చేసుకొని వ్యవసాయ రంగంలో అభివృద్ధి సాధించాలని ఆయన సూచించారు. రైతుల సంక్షేమం కోసం సహకార సంఘం ద్వారా మరిన్ని రుణ సదుపాయాలు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పర్వవేన సంతోష్ కు రూ.7.80లక్షలు, మీసాల రవి, పర్వవేన బాలరాజు, నాగుల జగన్, అనవేన రాజేశ్వరి కి రూ.6లక్షల చొప్పున మంజూరు కాగా, చెక్కులు అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో సహకార సంఘం పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, రైతులు రుణ లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆగస్టు నెల బొగ్గు ఉత్పత్తి, రవాణా వివరాలను వెల్లడించి జి.ఎంలు

రామగిరి ప్రభాతవార్త:



ఆగస్టు నెల బొగ్గు ఉత్పత్తి, రవాణా వివరాలను రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ కొలిపాక నాగేశ్వరరావు మంగళవారం జీ.యం కార్యక్రమంలో జరిగిన పత్రికా విలేకరుల సమావేశంలో బొగ్గు ఉత్పత్తి, రవాణా వివరాలను వెల్లడించారు.రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ మాట్లాడుతూ ఆగస్టు నెలలో రామగుండం3 ఏరియాకు నిర్దేశించిన 2.30 లక్షల టన్నుల లక్ష్యానికి గాను, 1.79 లక్షల టన్నులు అనగా 78 శాతం బొగ్గు ఉత్పత్తి, తో పాటు, కంపనీ షావల్స్ కు నిర్దేశించిన 08.00 లక్షల క్యూబిక్ మీటర్ల ఓ.బి(మట్టి) వెలికితీత లక్ష్యానికి గాను, 9.75 లక్షల క్యూబిక్ మీటర్లు అనగా 122 శాతం ఓ.బి (మట్టి) వెలికి తీయడం జరిగిందని, ఆఫ్ లోడింగ్ కు నిర్దేశించిన 13:00 లక్షల క్యూబిక్ మీటర్ల ఓ.బి లక్ష్యానికి గాన్పు 9.26 లక్షల క్యూబిక్ మీటర్లు అనగా 71 శాతం మట్టిని వెలికితీయడం జరిగిందన్నారు.అదేవిధంగా 4.69 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేయడం జరిగిందన్నారు. తదుపరి గనుల వారిగా ఉత్పత్తి వివరాలను తెలియజేస్తూ ఆగస్టు నెలలో ఓ.సి.పి1 గనికి నిర్దేశించిన 0.30 లక్షల టన్నుల లక్ష్యానికి గాను, 1.03 లక్షల టన్నులు అనగా 343 శాతం, ఓ.సి.పి2 గనికి నిర్దేశించిన 2.00 లక్షల టన్నుల లక్ష్యానికి గాను 0.77 లక్షల టన్నులు అనగా 38 శాతం బొగ్గు ఉత్పత్తి చేయడం జరిగిందన్నారు. భవిష్యత్తులో కూడా లక్ష్యానికి అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి, రవాణా చేయడానికి తగిన చర్యలు తీసుకుంటూ విధులు నిర్వహించాలని కోరారు.ఆగస్టు మాసంలో అధిక వర్షాలు కురిసి నందున ఉత్పత్తిలో కొంత వెనుకపడ్డామని, వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్త చర్యలను తూచ తప్పక పాటించాలని, ఉద్యోగులందరూ బాధ్యతాయుతంగా పనిచేస్తూ సింగరేణి సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను భద్రత తో సాధించడానికి కృషి చేయాలన్నారు.అనంతరం అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు మాట్లాడుతూ అడ్రియాల లాంగ్ వాల్ ప్రాజెక్ట్ కు ఆగస్టు నెలలో నిర్దేశించిన 15,300 టన్నుల లక్ష్యానికి గాను 14,576 టన్నులు బొగ్గు ఉత్పత్తి చేయడం జరిగిందన్నారు. లాంగ్ వాల్ 3వ ప్యానెల్ సాల్వేజింగ్ పనులను పూర్తి చేసి సుమారు 145 చాకులను బయటకు తీయడం జరిగిందని, సాల్వేజింగ్ పనులను పూర్తి చేయడంలో సహకరించిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు.4వ ప్యానల్ తయారీ పనులు కొనసాగుతున్నాయని, త్వరలోనే పనులు పూర్తి చేసి నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో సాధించడానికి ఉద్యోగులందరూ కృషి చేయాలన్నారు. అలాగే ఉద్యోగులు చాలా మంది గైర్హాజరు అవుతున్నారని, గైర్హాజరు కాకుండా విధులు సక్రమంగా నిర్వహించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్ఓటుజియంలు యం.రామ్మోహన్, బండి సత్య నారాయణ, ఏరియా ఇంజినీర్ ఎ.ఉదయ భాస్కర్, ఐ ఇ డీజీఎం బి.టి.మురళీ కృష్ణ, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, డివై పియం యండి.ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సర్వముఖ అభివృద్ధికి క్రీడలు ఎంతో దోహదపడతాయి

మండల విద్యాశాఖ అధికారి హరి ప్రసాద్, ఎస్సై రవికుమార్
దర్యాపూర్ మోడల్ స్కూల్‌లో ముత్తారం మండల స్థాయి ఎస్జీఎఫ్ క్రీడా పోటీలు ప్రారంభం



ముత్తారం, ప్రభాతవార్త: విద్యార్థుల సర్వముఖ అభివృద్ధికి క్రీడలు ఎంతో దోహదపడతాయని మండల విద్యాశాఖ అధికారి హరి ప్రసాద్, ఎస్సై రవికుమార్ అన్నారు. ముత్తారం మండలంలోని దర్యాపూర్ తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కాలేజీలో 70వ ఎస్జీఎఫ్ క్రీడా సంబరాల్లో భాగంగా ముత్తారం మండల స్థాయి క్రీడా పోటీలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు నిర్వహించిన కోకో, వాలీబాల్, కబడ్డీ పోటీల్లో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 150 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ పోటీలను హోరాహోరీగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టుస్ఫూర్తి, ఆత్మవిశ్వాసం పెంపొందించడంతో పాటు శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదపడతాయని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు నిర్వాహకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాపెల్లి రాజయ్య, అలాగే దర్యాపూర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డా. కేసరి సంతోష్ కుమార్ పాల్గొని క్రీడాకారులను అభినందించారు. మండల ఎస్జీఎఫ్ కార్యదర్శి కే. వెంకటేష్, వ్యాయామ ఉపాధ్యాయులు స్వప్న, రజిత, దుర్గాభవాని, శ్రీమన్ తదితరులతో పాటు పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేషనల్ హైవేకు ఇరువైపుల మొక్కలు నాటిన సర్పంచ్

మంథని రూరల్ ప్రభాతవార్త:నాగపూర్ నుండి వరంగల్ నేషనల్ హైవే జాతీయ 4వే రహదారికి ఇరువైపులా కన్నాల, పండులపల్లి శివారు లోని రోడ్డుకు కన్నాల సర్పంచ్ గుడిసె గట్టయ్య యాదవ్ మొక్కలు నాటారు. మంగళవారం గ్రామపంచాయతీ పరిధిలోనీ నర్సరీ (మొక్కల పెంపక కేంద్రం) నుండి గుడిసె గట్టయ్య యాదవ్ సర్పంచ్ మొక్కలు అంద జేశారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్, వనసేవక్ స్వప్న గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



గ్రామకంఠం భూముల సర్వే పనులు పరిశీలన

రామగిరి ప్రభాతవార్త: రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో మంగళవారం గ్రామకంఠం భూముల సర్వే పనులను సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు పరిశీలించారు. ప్రభుత్వము రత్నాపూర్ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద గ్రామ సరిహద్దులు,గ్రామ కంఠం, ప్రభుత్వ భూములు, పట్టా భూములు సరిహద్దులు నిర్ణయిస్తున్నారు. దీనిలో భాగంగా మంథని ఏరియా డి ఐ (సర్వే) రమేష్ .లైసెన్స్ సర్వేయర్ ఈసారపు మహేందర్, పడాలకృష్ణలు సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ గంగుల సంతోష్, జిపిఓ పెరక వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మంథని వార్త



బిఆర్ఎస్ నాయకుల పరామర్శ

ముత్తారం, ప్రభాతవార్త:



ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామంలో మృతుల కుటుంబాలను బి ఆర్ ఎస్ నాయకులు మంగళవారం పరామర్శించారు. గ్రామానికి చెందిన ఉగ్గె మొగిలి తండ్రి రాజయ్య, బుద్ధర్తి రాజేశం, శంకర్, శ్రీనివాస్, సంజీవ్ ల తల్లి రాజమ్మ ఇటీవల మరణించారు. ఈ సందర్భంగా బి ఆర్ ఎస్ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి, ముత్తారం సర్పంచ్ రవీందర్ రావు, సింగల్ విండో మాజీ చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డిలు మృతుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతు బంధు మాజీ మండల అధ్యక్షులు అత్తే చంద్రమోళి, మాజీ ఎంపీపీ ముత్యాలు, మాజీ సర్పంచుల పోరం అధ్యక్షులు నూనె కుమార్, మాజీ ఎఎంసి డైరెక్టర్ నమ్మశాని సమ్మయ్య, గ్రామ సర్పంచ్ నక్క రాజేశ్వరి రాజయ్య, ఉప సర్పంచ్ కార్కురి సతీష్, వార్డు మెంబర్లు రావుల లక్ష్మి, రావుల శేఖర్, మనేశ్వరి శ్రీశైలం, సమ్మయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు కేక్కర్ల శీను, మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు అల్లం దినేష్, ఎఎంసి డైరెక్టర్ రమేష్, మాజీ సర్పంచ్ జక్కుల సదయ్య తదితరులున్నారు.

రేవంత్ రెడ్డి శ్రీధర్ బాబు చిత్రపటాలకు ఉద్యమకారుల పాలభిషేకం

16న ఆర్ట్స్ కాలేజీ సభ విజయవంతం చేయండి

మంథని ప్రభాతవార్త:



తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం,గుర్తింపు కార్డు,పెన్షన్, ఉచిత ఆర్టీసీ ప్రయాణం, ఆరోగ్య పథకం అమలుతో పాటు కేకే కమిటీ సిఫార్సులను అమలు చేయడానికి అంగీకరించిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ మంగళవారం మంథని లో పాలాభిషేకం చేశారు. తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి కావటి సతీష్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీను బాబు చిత్రపటాలకు స్థానిక అంబేద్కర్ చౌక్ లో పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు హర్షం వ్యక్తం చేశారు. ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు అభినందనీయమని పేర్కొన్నారు. అలాగే సెప్టెంబర్ 16న ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రి శ్రీధర్ బాబుకు కృతజ్ఞత సభ నిర్వహించనున్నట్లు కావటి సతీష్ తెలిపారు. ఈ సభకు తెలంగాణ ఉద్యమకారులు, అభిమానులు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు మిరాల రామిరెడ్డి, సాదుల శ్రీను, అజీమ్ ఖాన్, ఎస్.కె. ముజీబ్, ముస్కె ఈశ్వరమ్మ, కాసిపేట మల్లేష్, బర్ల సుధాకర్, దాసరి శంకర్, తోకల మల్లేష్, మధుకర్ రెడ్డి, ఆనంద్, అలీమ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బుగ్గారం తహసీల్దార్ కు జాతీయ అవార్డ్

నరేందుల భూమేశ్వర్ సేవలను గుర్తించిన బహుజన సాహిత్య అకాడమీ

బుగ్గారం, ప్రభాతవార్త :



బుగ్గారం మండల తహసీల్దార్ నరేందుల భూమేశ్వర్ బెస్ట్ సర్వీస్ సొసైటీ నేషనల్ అవార్డ్ కు ఎంపికయ్యారు. గత 39 సంవత్సరాలకు పైగా ఉద్యోగ రీత్యా ఆయన అందించిన సేవలను బహుజన సాహిత్య అకాడమీ అనే జాతీయ సంస్థ గుర్తించింది. ఆ సంస్థ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ ఈ అవార్డ్ ఎంపిక పత్రాన్ని జారీ చేశారు.జగిత్యాల జిల్లా కలెక్టరేట్ లో సోమవారం రాత్రి ఇద్దరు జిల్లా అదనపు కలెక్టర్ లు బి.ఎస్. లత, బి.రాజా గౌడ్ ల చేతుల మీదుగా బహుజన సాహిత్య అకాడమీనేషనల్ అవార్డ్ ల సెలెక్షన్ కమిటీ సభ్యులు "చుక్క గంగారెడ్డి" ఈ అవార్డ్ ఎంపిక పత్రాన్ని బుగ్గారం తహసీల్దార్ నరేందుల భూమేశ్వర్ కు అందజేశారు.నరేందుల భూమేశ్వర్ 1987లో ఉద్యోగంలో చేరి 25 స్థానాలలో వివిధ హోదాల్లో ప్రజలకు అందించిన మెరుగైన సేవలను, ఆయన సత్ ప్రవర్తనను, సమయ స్ఫూర్తిని, ప్రజల నుండి, రైతుల నుండి పొందిన మన్ననలను అభిమానాన్ని, ఉన్నతాధికారుల ప్రశంసలను గుర్తించి ఈ అవార్డ్ కు ఎంపిక చేయడం జరిగిందని చుక్క గంగారెడ్డి ఆ సభలో వివరించారు.సెప్టెంబర్ 5న హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే బహుజన సాహిత్య అకాడమీ 19వ జాతీయ సదస్సు లోఈ అవార్డుల ప్రధానోత్సవం ఉంటుందన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు, బిలిగెట్స్ హాజరయ్యే ఈ



జాతీయ అవార్డుల ప్రధానోత్సవ సభలో ఆ సంస్థ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా తహసీల్దార్ నరేందుల భూమేశ్వర్ కు బెస్ట్ సర్వీస్ సొసైటీ నేషనల్ అవార్డ్ ను అందజేయనున్నట్లు చుక్క గంగారెడ్డి తెలిపారు.సోమవారం రాత్రి బుగ్గారం మండల తహసీల్దార్ నరేందుల భూమేశ్వర్ పదవీ విరమణ మహోత్సవ సభ జిల్లా కలెక్టరేట్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లు బిఎస్. లత, బి.రాజా గౌడ్, జిల్లా రెవెన్యూ అధికారి దేవిప్రసాద్, కలెక్టరేట్ ఎ.ఓ. ఇట్టియాల వెంకట కిషన్, జగిత్యాల ఆర్డీవో మధుసుధన్ గౌడ్, ఫార్మర్ ఎ.వో. పుప్పాల హనుమంతరావు,కలెక్టరేట్ అధికారులుముద్దం తిరుపతి తదితరులతో పాటు వివిధ మండలాల తహసీల్దార్ లు అబ్దుల్ మాజిద్, శ్రీనివాస్, ఇతరులు, డిప్యూటీ తహసీల్దార్ లు మండలోజు రాకేష్ తదితరులు సురేందర్ రావు, రాజేష్ యాదవ్, రమేష్, భూమేష్, జి.పి.ఓ.లు, బి.ఎల్.ఓ.లు, రేషన్ డీలర్లు, వివిధ శాఖల అధికారులు సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు, భూమేశ్వర్ వసంత ల అభిమానులు, బంధుమిత్రులు, తదితరులు అధిక సంఖ్యలో పాల్గొని తహసీల్దార్ నరేందుల భూమేశ్వర్ వసంత ల సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. అనంతరం జ్ఞాపికలు, పుష్ప గుచ్చాలు అందజేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు.

విద్యార్థులకు ఉచిత ఏకరూప దుస్తుల పంపిణీ

పెగడపల్లి, ప్రభాతవార్త:



పెగడపల్లి మండలం బతికెపల్లి గ్రామంలోని ఎం.పి.పి.ఎస్ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఉచిత ఏకరూప దుస్తులను గ్రామ సర్పంచ్ ముంజ మహేశ్వరి మధుకర్‌గౌడ్, ఉపసర్పంచ్ కస్తూరి పద్మ విద్యార్థులకు అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న ఉచితవిద్య, పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు, ఉపకార వేతనాలు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని తల్లిదండ్రులు, గ్రామానికి, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ప్రధానోపాధ్యాయుడు వెల్ముల రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు పెంపొందిస్తూ సర్వతోముఖ అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం రవివర్మ,సీసీ ఏసుమణి,గ్రామ వీఓఏలు నాగలక్షి ్మ,సుమలత, ఉపాధ్యాయులు డి. ఆనందరెడ్డి.యు.తిరుపతి,జరీనాబేగం పాల్గొన్నారు.

రక్తదానం చేసిన వార్డు సభ్యులు సురేష్

గొల్లపల్లి, ప్రభాతవార్త:



జగిత్యాలలోని మాతా శిశు ఆస్పత్రిలో రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణీ స్త్రీ గాజుల మనోజ్ఞకు సర్జరీ నిర్వహించేందుకు రక్తం అవసరం కాగా.విషయం తెలుసుకున్న వెంగలాపూర్ గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు రాసమల్ల సురేష్ ఆస్పత్రికి చేరుకుని రక్తదానం చేశారు. అత్యవసర సమయంలో స్పందించి రక్త దానం చేసిన రాసమల్ల సురేష్ సేవాభావాన్ని పలువురు అభినందించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బలబత్తుల కిషన్ సురేష్‌ను అభినందించి, ఆయన చేసిన సేవను కొనియాడారు.

బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం

గొల్లపల్లి, ప్రభాతవార్త:

మండలంలోని శంకర్రావుపేట గ్రామానికి చెందిన వడ్లకొండ నరసయ్య అనారోగ్యంతో మృతి చెందగా, వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి గురించి తెలుసుకున్న సామాజిక సేవకుడు ఎడమల భోజేందర్ రెడ్డి స్పందించారు. కష్టకాలంలో ఉన్న ఆ కుటుంబానికి అండగా నిలుస్తూ రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.నిరుపేద కుటుంబం ఆపదలో ఉన్న సమయంలో ఆర్థిక సాయం చేసి మానవత్వాన్ని చాటుకున్న ఎడమల భోజేందర్ రెడ్డిని స్థానికులు అభినందించారు.

సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలి

ధర్మపురి,ప్రభాతవార్త.



సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మ్యాన పవన్ కుమార్ డిమాండ్ చేశారు. సీపీఎస్ అమలై 22 సంవత్సరాలు పూర్తయినా ఓపీఎ పునరుద్ధరించకపోవడాన్ని నిరసిస్తూ మంగళవారం ఉద్యోగ, ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి, నిరసనలు తెలిపారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ పునరుద్ధరణ హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.నవంబర్ 17న మేనిఫెస్టో డే సందర్భంగా నిర్వహించే సామూహిక సెలవు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఉద్యోగ, ఉపాధ్యాయులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఎస్ ఎంప్లాయిస్ యూనియన్ బాధ్యులు మెరుగు రమేష్, ఎదుల మహేష్, సంద వెంకటేష్, నూనావత్ రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలని ఉపాధ్యాయుల నిరసన

పెగడపల్లి, ప్రభాతవార్త:



ఉపాధ్యాయుల న్యాయమైన హక్కుల సాధన కోసం టీజీఈజేఏసీ, ఎస్‌జీటీయూ రాష్ట్ర, జగిత్యాల జిల్లా శాఖల పిలుపు మేరకు పెగడపల్లి మండలంలోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులు మంగళవారం భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సెప్టెంబర్ 1ని పెన్షన్ విద్రోహ దినంగా పాటిస్తూ నిరసన తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా బాధ్యులు చాట్ల వెంకటేష్, సాగర్ మాట్లాడుతూ ఉద్యోగ భద్రత లేని సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయడంతో పాటు పీఆర్సీని తక్షణమే అమలు చేయాలని, జీవో నంబర్ 25ను సవరించాలని ప్రభుత్వాన్ని కోరారు.కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దేవయ్య, ప్రధాన కార్యదర్శి తిరుపతి, మండల బాధ్యులు విష్ణుప్రసాద్, దశరథం, శ్రీధర్, మయూరి, శ్రీనివాస్, కృష్ణవేణి, జహీరాబేగం, జైపాల్, విజయ్, నరసయ్య, సురేందర్‌రెడ్డి, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, నందగిరి గ్రామ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి వార్త

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని వినతి

గొల్లపల్లి, ప్రభాతవార్త:



రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కోరుతూ ధర్మ సమాజ్ పార్టీ ,బీసీ,ఎస్సీ,ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం గొల్లపల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 లక్షల మంది విద్యార్థులకు రూ.14 వేల కోట్ల వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు.ప్రభుత్వం ఈ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిరక్ష్యం కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి విద్యా భ్యాసం దెబ్బతినకుండా తక్షణమే నిధులు విడుదల చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ గొల్లపల్లి మండల ప్రధాన కార్యదర్శి బాలే అశోక్, పట్టణ అధ్యక్షుడు శాతల్ల లక్ష్మ ణ్, మండల నాయకులు చిలుముల జానీ, బాలే రాజు, అరికిల్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన సర్పంచ్

పెగడపల్లి , ప్రభాతవార్త:



మండలంలోని బతికపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గ్రామ సర్పంచ్ ముంజ మహేశ్వరి మధుకర్‌గౌడ్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యత, రుచిని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లింగాపూర్‌లో విద్యార్థులకు దుస్తుల పంపిణీ

పెగడపల్లి, ప్రభాతవార్త:



మండలంలోని లింగాపూర్ గ్రామంలోని ఎం.పీ.యూ.పీ.ఎస్ పాఠశాలలో విద్యార్థులకు గ్రామ సర్పంచ్ కాశెట్టి వీరేశం, ఉపసర్పంచ్ గజ్జి రమా తిరుపతి విద్యార్థులకు మంగళవారం ఏకరూప దుస్తులను అందజేశారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఏకరూప దుస్తులను సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ మమత, సీఏ రజిత, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెద్దపల్లి జిల్లా ఆసుపత్రిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

◆జిల్లా ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీ నిర్వహించి వివిధ విభాగాలను పరిశీలన

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:

జిల్లా ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందుతున్నందుకు సంతృప్తి వ్యక్తం చేస్తూ, రోగుల నుంచి డబ్బులు ఆశిస్తే కఠిన చర్యలు ఉంటాయని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు. మంగళవారం జిల్లా ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, ఆసుపత్రిలోని వివిధ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించామని తెలిపారు. చిన్నపిల్లల వార్డు, గర్భిణీల వార్డు, ఎక్స్‌రే గది, ఔటోపేషెంట్ విభాగం, చికిత్స విభాగం, డెంటల్ విభాగం, ఇన్‌పేషెంట్ విభాగం, జనరల్ ఫిజీషియన్, ఆర్థోపెడిక్స్ తదితర అన్ని విభాగాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఆయా విభాగాల్లో రోగులకు అందుతున్న వైద్య సేవలు, సిబ్బంది పనితీరు, పారిశుధ్య నిర్వహణ తదితర అంశాలను ఆయన పరిశీలించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై రోగులు, వారి సహాయకుల నుంచి కలెక్టర్ నేరుగా ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. వైద్యం, మందుల లభ్యత, పారిశుధ్యం, సిబ్బంది వ్యవహారశైలిపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండటంతో ఎస్టీపీసీ, చెన్నూరు ప్రాంతాల నుంచి కూడా ప్రజలు వైద్యం కోసం పెద్దపల్లి జిల్లా ఆసుపత్రికి వస్తున్నారని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికి నాణ్యమైన వైద్యం అందేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆసుపత్రిలో పారిశుధ్య సిబ్బంది రోగుల నుంచి డబ్బులు ఆశిస్తున్నారనే ఫిర్యాదులు తరచుగా వస్తున్న నేపథ్యంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించినట్లు కలెక్టర్ తెలిపారు. రోగుల నుంచి స్వీకరించిన ఫీడ్‌బ్యాక్‌ను పరిశీలించి, ఫిర్యాదులు నిజమని తేలితే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి సహాయకుల నుంచి ఎలాంటి రూపంలోనూ డబ్బులు ఆశించరాదని పారిశుధ్య సిబ్బందిని హెచ్చరించారు. రోగుల వద్ద డబ్బులు డిమాండ్ చేయడం, ఆశించడం వంటి చర్యలను ఏమాత్రం ఉపేక్షించేది లేదన్నారు. పారిశుధ్య సిబ్బంది తమ పనితీరును మార్చుకుని బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఇకపై కూడా రోగుల నుంచి డబ్బులు ఆశిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే సంబంధిత సిబ్బందిని విధుల నుంచి వెంటనే తొలగించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆసుపత్రి పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. వైద్య సేవల నాణ్యత, రోగుల సంతృప్తిపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట డిజిహెచఎస్ డాక్టర్ శ్రీధర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




ఎస్.ఐ.ఆర్.లో బిఎల్‌వోల మాయజాలం..

❖ఒక్కొక్క వార్డులో వందల సంఖ్యలో ఓటర్‌ల నమోదు..

❖గగ్గోలు పెడుతున్న ఇంటి ఓనర్‌లు..

❖హుజురాబాద్ డివిజన్‌లో ఇదే తంతు..

జమ్మికుంట/ హుజురాబాద్, ప్రభాతవార్త:



కేంద్ర ప్రభుత్వం గొప్ప సంకల్ప బలంతో.. ” వన్ ఓట్.. వన్ నేషన్..” అన్న నినాదంతో దేశ వ్యాప్తంగా ఎస్.ఐ.ఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పెట్టి కోట్లాది రూపాయల వ్యయ ప్రయాసలకు ఓరుస్తూ.. రాజకీయ పార్టీల విమర్శలకు లోనవుతూ, పకడ్బందిగా నిర్వహిస్తున్నప్పటికి కరీంనగర్ జిల్లా హుజురాబాద్ సబ్ డివిజన్ పరిధిలోని పలు మండలాలు, గ్రామాలతో పాటు మున్సిపాలిటీలలో బిఎల్‌వోలు రాజకీయ పార్టీల నేతల ఒత్తిడిలకు తలొగ్గి ప్రభుత్వ ఆశయాలకు తూట్లు పొడుస్తున్న వైనం.. జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో ఆయా వార్డులలో, కాలనీవాసులు మా అనుమతులు లేకుండానే ముక్కు, మొఖం, కులం, మతం తెలియని ఓటర్‌ల పేర్లు మా ఇంటి నెంబర్‌పై ఎలా నమోదు చేసారంటూ అధికారులను నిలదీస్తున్న వైనం జమ్మికుంట మున్సిపాలిటీలో చర్చానీయాంశంగా మారింది. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా గత రెండు మాసాలుగా ఎస్.ఐ.ఆర్.ను జిల్లా కలెక్టర్ చిత్రమిశ్రా నేతృత్వంలో ఆయా డివిజన్‌ల ఆర్డివోలు, ఎమ్మార్వోలు వారి కింద సూపర్‌వైజర్‌లు, మంది మార్బలానికి శిక్షణలు ఇచ్చి పద్దతి ప్రకారంగా నియమ నిబంధనలు ఇచ్చినప్పటికి కొన్ని ప్రాంతాలలో ముఖ్యంగా జమ్మికుంట పట్టణంలోని పలు వార్డులలో గత 20ఏళ్లగా అనేక ఇండ్లలో జమ్మికుంటలో ఉపాధి కోసం రైస్ మిల్లులు, కాటన్ జిన్నింగ్ మిల్లులు, ఆయిల్ మిల్లులు, గృహానిర్మాణ పరిశ్రమ అనేక రంగాలలో పనిచేస్తున్న కార్మికుల ఓట్లను ఒక్కొక్క వార్డులో వందల సంఖ్యలో ఇక్కడ అధార్ కార్డులు పుట్టించి, ఓట్లు నమోదు చేసిన సంఘటనలపై రాష్ట్ర ఎన్నికల కమీషన్‌కు, జిల్లా కలెక్టర్‌కు ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదులు అందాయి. కొంతమేర దొంగ ఓట్లు తొలగించినప్పటికి బిఎల్‌వోల మాయాజలం, సూపర్ వైజర్‌ల పట్టింపులేనితనం, తహసిల్దార్‌ల ఉదాసీన వైఖరి వల్ల చోట, మోట రాజకీయ పార్టీల నేతలు 2019.. 2002.. 2022.. వరకు పాత ఓటర్ లిస్టులలో పేర్లు లేనటువంటి ఓటర్‌ల పేర్లను జమ్మికుంట 30వార్డుల పరిధిలో వందల సంఖ్యలో తప్పుడు ఓట్లు నమోదై.. ఇటీవల విడుదలైన కొత్త ఓటర్ లిస్టులో సంబంధంలేని వ్యక్తుల పేర్లు ఆయా ఇంటి నెంబర్‌లపై నమోదు కావడంతో ఆ ఇంటి యజమానులు ఇదేక్కడి పాపం అంటూ గగ్గోలు పెడుతున్నారు. అధికారుల తీరుపై దుమ్మెత్తిపోస్తున్నారు. ఆ వార్డులోని బిఎల్‌వోలను ఇంటి యజమానులు ప్రశ్నిస్తే.. సార్.. అయ్యో పాపం వాళ్లకు మన పట్టణంలో ఇండ్లు లేదు.. కనుక మీ ఇంటిపై నమోదు చేయడం జరిగింది అంటూ బిఎల్‌వో నిర్లక్ష్యమైన సమాధానం ఇవ్వడం ఆ ఇంటి యజమానులకు ఆగ్రహం తెప్పించింది. జమ్మికుంట పట్టణంలో ఆయా వార్డుల పరిధిలో ఇంటి యజమానుల అనుమతులు లేకుండా (ఆ ఇంటిలో ఏనాడు కిరాయికి లేనటువంటి వారు) ప్రస్తుతం కరీంనగర్ కార్పోరేషన్ పరిధిలో.. గ్రేటర్ హైద్రాబాద్ పరిధిలో, సూరత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కోల్‌బెల్ట్ ఏరియాలో ఎక్కడడెక్కడనో జీవిస్తున్నారు. ఇక్కడ నమోదైన ఓటర్లు వందల సంఖ్యలో కొందరు హిందువులు కాగా... మరికొందరు ముస్లింలు ఉన్నారు. ఈ జరుగుతున్న తతంగంపై అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఇంటి యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

▶జిల్లా కలెక్టర్ గారు.. మా ఇంటిలోని గుర్తు తెలియని వ్యక్తుల ఓట్లు తొలగించండి..

ప్రజాస్వామ్య బద్దంగా ఎస్.ఐ.ఆర్. కార్యక్రమం జరుగుతుండగా మా హుజురాబాద్ సబ్ డివిజన్ పరిధిలో బిఎల్‌వోలు, సూపర్‌వైజర్లు, ఎమ్మార్వోల నిర్లక్ష్యం మూలంగా ముక్కు, మొఖం తెలియని వారి పేర్లు మా ఇంటి నెంబర్‌పై నమోదు అయ్యాయని, తక్షణంగా న్యాయవిచారణ జరిపి తప్పుడు నమోదు ఓట్లను తొలగించాలని బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని జమ్మికుంట పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. 30వార్డులలో ఏ వార్డులో చూసిన ఎక్కడ చక్కదనంలేదని, జిల్లా కలెక్టర్, ఆర్డివో పర్యవేక్షణలో ఇంటి యజమానులకు ఆ ఇంటిలో నమోదైన ఓట్లు మీ ఇంటివారియేన.. కాదా..? నిజా నిర్ధారణ చేయవల్సిన అవసరం ఎంతైన ఉందని ప్రజలు కోరుకుంటున్నారు. జమ్మికుంట మున్సిపాలిటీలో సుమారు 5000 నుండి 8000 వరకు వివిధ సుదూర ప్రాంతాలలో, ఇతర రాష్ట్రాలలో, ఇతర జిల్లాలలో అక్కడ, ఇక్కడ ఓట్లు కల్గి ఉన్నారని ఈ ప్రాంతానికి సంబంధంలేని వ్యక్తుల పేర్లను కొన్ని రాజకీయ పార్టీల నేతలు వారు ముందు భవిష్యత్తుతో తప్పుడుగా నమోదు చేసుకుంటున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

▶ఎమ్మార్వో వివరణ..

జమ్మికుంట పట్టణంలో ఇంటి యజమానుల అనుమతులు లేకుండానే ఎక్కడైతే తప్పుడు ఓటర్‌ల జాబితా నమోదు అయిందో.. వాటిని తొలగిస్తామని బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని ఎమ్మార్వో సుధాకర్ ప్రభాతవార్త అడిగిన ఒక ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. 2022 ఓటర్‌ల లిస్టులో ఏ మాత్రం పేరులేని వారి జాబితా, కొత్తగా వచ్చిన ఓటర్ జాబితాలో ఎలా నమోదు అయిందో పరిశీలిస్తామన్నారు. ఒకే వ్యక్తి రెండు చోట్ల ఓటు హక్కు నమోదు చేసుకుని ఉంటే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటామని ఎమ్మార్వో వివరించారు.

కార్యాలయం ఖాళీ..!

■పత్తాలేని అధికారులు, సిబ్బంది

■జూనియర్ అసిస్టెంట్ మాత్రమే విధుల్లో..

■తహసిల్దార్ ఆఫీస్‌లో దర్శనమిచ్చిన ఖాళీ కుర్చీలు

కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త:



ఆయా అవసరాల నిమిత్తం ఆఫీస్‌కి వెళ్తే ఖాళీ కుర్చీలు దర్శనం ఇవ్వడంతో మండల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. భూ సమస్యలు, సర్టిఫికెట్ల వెళ్లిన కోసం తహసిల్దార్ కు వెళ్లగా ఖాళీ కుర్చీలు కనిపించడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. కేవలం జూనియర్ అసిస్టెంట్ పాషా మాత్రమే విధుల్లో కనిపించగా, తహసిల్దార్, డిప్యూటీ తహసిల్దార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, సీనియర్ అసిస్టెంట్లు, జిపిఓలు కనిపించకుండా పోవడంతో ఆయా అవసరాల నిమిత్తం వచ్చిన ప్రజలకు అధికారులు అందుబాటులో లేకుండా పోయారు. అధికారులు సక్రమంగా విధులు నిర్వహించకుండా ప్రజలకు అందుబాటులో లేకుండా ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నారని, కార్యాలానికి విచ్చేసిన ఆయా గ్రామాల ప్రజలు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ మేరీ అయిన సేవలందించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుతో నిరంతర ఆదాయం

-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

తంగళ్లపల్లి,ప్రభాతవార్త:ప్రత్యామ్నాయ పంటల సాగుతో రైతులకు నిరంతర ఆదాయం వస్తుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు.తంగళ్లపల్లి మండలం దేశాయిపల్లి గ్రామంలో కంకణాల రమేష్, కంకణాల రాజు దాదాపు 4 ఎకరాల్లో బీరకాయలు, టమాట, మిర్చి, సొరకాయ, బంతి సాగు చేస్తుండగా,జిల్లా కలెక్టర్ ప్రతి మంగళవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా పరిశీలించారు. రైతులను జిల్లా కలెక్టర్ అభినందించారు.అలాగే పరిపల్లి మహేందర్ తన పొలంలో పాంపాండ్ నిర్మించుకుంటుడగా పరిశీలించి..వివరాలు అడిగి తెలుసుకున్నారు.!!ఎల్ నినో ప్రభావానికి అధిగమించేందుకు వినూత్న విధానంలో రైతు కంకణాల రమేష్ దాదాపు 2.5 ఎకరాల్లో బీరకాయ, సొరకాయ సాగు చేస్తుండగా జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం బీరకాయ పంట చేతికి వచ్చింది. బీరకాయ, సొరకాయ సాగు విధానం, సస్యరక్షణ చర్యలు, దిగుబడి, విక్రయాలు, ఆదాయం తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఆ రైతును అభినందించారు. !!!జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ..ఎల్ నినో ప్రభావంతో రైతులు సంప్రదాయ పంటలు సాగు చేయకుండా కూరగాయలు సాగు చేస్తున్నారని వివరించారు. వరికి బదులుగా కూరగాయలు సాగు చేసి ఆదాయం పొందే మార్గాన్ని రైతు అవలంబిస్తున్నారని తెలిపారు. వివిధ రకాల కూరగాయలు సాగు చేయడంతో మంచి ఆదాయం వచ్చే అవకాశం ఉందని, వాతావరణ ఇబ్బందులు, నీటి సమస్య దూరం చేసుకునే అవకాశం ఉందని వెల్లడించారు.మిగతా రైతులు కూడా తమకు ఉన్న భూమిలో ఆరుతడి పంటలు, కూరగాయలు సాగు చేసి ఆదాయం పొందాలని, ప్రస్తుత వాతావరణ ఇబ్బందుల నుంచి బయట పడాలని పిలుపు నిచ్చారు. ఉద్యానవన శాఖ,ఇతర శాఖల నుంచి వచ్చే ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు.రైతు కంకణాల రాజు తన పొలంలోని పాంపాండ్ నీరు నింపి కొరమీను, రవు చేప పిల్లలు వేశారు. సహజ పద్దతిలో వాటిని పెంచుతున్నారు. ప్రతి ఆరు నెలలకు ఒక్కసారి చేపలు పట్టి విక్రయిస్తుండగా, రూ.40 వేల వరకు ఆదాయం వస్తుందని రైతు తెలిపారు.పరిశీలనలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖా అధికారి లక్ష్మీనారాయణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అప్జల్ బేగం,ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు తదితరులు ఉన్నారు.



సేంద్రియ వ్యవసాయంపై రైతులకు అవగాహన

మండల వ్యవసాయ అధికారి చిందం శ్రీకాంత్



రామగిరి ప్రభాతవార్త సేంద్రియ వ్యవసాయము నానో ఎరువులు మరియు జీవన ఎరువుల వాడకము కిచెన్ గార్డెన్ గురించి రామగిరి మండలంలోని సుందిళ్ల రైతు వేదికలో వ్యవసాయ సాంకేతిక సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు అవగాహన కార్యక్రమము మరియు డెమోనిస్ట్రేషన్ నిర్వహించడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి చిందం శ్రీకాంత్ తెలిపారు. ఈ సందర్భంగా మంథని సహాయ వ్యవసాయ సంచాలకులు అంజని మాట్లాడుతూ జీవన ఎరువులు, నానో ఎరువులు వాడడం ద్వారా ఖర్చు తగ్గడమే కాకుండా దిగుబడి పెరుగుతుందని సేంద్రీయ వ్యవసాయం యొక్క లాభాలను వివరించారు. కెవికె శాస్త్రవేత్త వినోద్ కుమార్ మాట్లాడుతూ ప్రతి రైతు ఇంటి ఆవరణలో కిచెన్ గార్డెన్ చేయడం ద్వారా రైతులకు ఎలాంటి రసాయనాలు లేని మంచి కూరగాయలు పండ్లు సాగు చేయడం ద్వారా ఆరోగ్యం పెరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా వర్మి కంపోస్టుల్లో ట్రైకోడెర్మా పిఎస్బి కల్చి తయారు చేసే విధానాన్ని రైతులకు చూపించారు. ఈ అవగాహన శిక్షణ కార్యక్రమంలో ఏఈఓ మౌనిక,రైతులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి నిధుల మంజూరు చేసిన మంత్రి మంత్రి శ్రీధర్ బాబు

చొరవతో నెరవేరిన ఆర్ఎంపి పీఎంపీల కళ

మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన ఆర్ఎంపి పీఎంపీ లు



రామగిరి ప్రభాతవార్త ఎన్నో ఏళ్లుగా రామగిరి మండల ఆర్ఎంపీ, పీఎంపీలు ఎదురుచూస్తున్న భవన నిర్మాణ కల ఎట్టకేలకు సాకారమైంది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చొరవతో పాటు మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ కృషితో భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు పనులు ప్రారంభం కావడంతో రామగిరి మండల ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా రామగిరి మండలం బేగంపేట్ ఎక్స్ రోడ్‌లోని మంథని బ్లాక్ కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ ప్రతినిధులు తొట్ల తిరుపతి యాదవ్ కలిసి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కు తిరుపతి యాదవ్‌లకు వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నో ఏళ్ల తమ కలను సాకారం చేసేందుకు చొరవ చూపిన మంత్రి శ్రీధర్ బాబుకు, నిధుల మంజూరులో సహకరించిన తిరుపతి యాదవ్‌కు వారు ధన్యవాదాలు తెలిపారుఈ కార్యక్రమంలోకమాన్‌పూర్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్ఎస్ అన్వర్, మండల ఆర్ఎంపీ, పీఎంపీల అసోసియేషన్ అధ్యక్షులు బొద్దుల జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి గండి పైడయ్య, క్యాషియర్ సందీప్‌తో పాటు మండల ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రష్యా బాంబు దాడిలో యువకుడు మృతి

కన్నీరుమున్నీరవుతున్న కుటుంబ సభ్యులు

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

ఉక్రెయిన్‌రష్యా సరిహద్దుల్లో జరిగిన బాంబు దాడిలో జగిత్యాల జిల్లా జగిత్యాల అర్బన్ పరిధిలోని హస్నాబాద్‌కు చెందిన వావిలాల సుదర్శన్ గౌడ్ మరణించారు.దాదాపు నాలుగు నెలల క్రితం ఉపాధి నిమిత్తం ఉక్రెయిన్ వెళ్లిన ఆయన,రష్యా దళాలు జరిపిన బాంబు దాడిలో ప్రాణాలు కోల్పోయినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది.సుదర్శన్ గౌడ్‌కు భార్య,ఇద్దరు కుమార్తెలు,తల్లి, తమ్ముడు ఉన్నారు. కుటుంబానికి ఆధారం అయిన వ్యక్తి దూరమవ్వడంతో హుస్నాబాద్‌లో విషాదఛాయలు అలముకున్నాయి. బాధితుని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రభుత్వం చొరవ తీసుకుని మృతదేహాన్ని త్వరగా స్వగ్రామానికి రప్పించేలా చర్యలు చేపట్టాలని,అలాగే బాధితుని కుటుంబానికి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని స్థానికులు,కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కలిసికట్టుగా గ్రామ అభివృద్ధిపై దృష్టి సారిద్దాం

సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీరావు

రామగిరి ప్రభాతవార్త



గ్రామాభివృద్ధికి గ్రామ ప్రజలంతా కలిసికట్టుగా పని చేద్దామని సర్పంచ్ పల్లె ప్రతిమపీవీరావు అన్నారు. రామగిరి మండలం రత్నాపూర్ గ్రామ పంచాయతీ సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. గ్రామ అభివృద్ధికి సంబంధించి వివిధ అంశాలపై చర్చించారు. వర్షాకాలంలో పారిశుధ్యం పై దృష్టి సారించాలని ఆమె కోరారు. అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. గ్రామంలో వివిధ వాడలో ఉన్న సమస్యలు తీర్చడానికి నిర్ణయించారు. రత్నాపూర్ ప్రధాన రహదారి వెడల్పు చేయడం, నూతన రోడ్డు వేయడానికి తీర్మాణం చేయడం జరిగింది. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ బాద్రపు ప్రవళిక ప్రశాంత్, పంచాయతీ సెక్రటరీ గంగుల సంతోష్ వార్డు సభ్యులు కేక్కేర్ల ఉషా అశోక్, బత్తుల రాజమణి రమేష్, జక్కుల పద్మచందన్, బత్తిని ప్రశాంత్, పున్నం మణితేజ, అల్లి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలాల పెంపు కి జలసిరి పథకం

ఎంపీడీఓ శైలజరాణి, సర్పంచ్ ప్రతిమ



రామగిరి ప్రభాతవార్త భూగర్భ జలాల పెంపుకే జలసిరి పథకమని ఎంపీడీఓ బద్రి శైలజ రాణి, సర్పంచ్ పల్లె.ప్రతిమ పీవీరావు అన్నారు. మంగళవారం రత్నాపూర్ గ్రామంలోని రామగిరి ఖిల్లా ప్రాంతంలోని మేగా పల్లె ప్రకృతి వనం ప్రాంతంలో రెండో ఫామ్ ఫండ్ నిర్మాణం పనులను సర్పంచ్ పల్లె ప్రతిమపీవీరావు, ఎంపీడీవో బద్రి శైలజా రాణి తో కలిసి ప్రారంభించారు. వి.బి.జి రామ్.జి ఉపాధి హామీ పథకం కింద ఈ నిర్మాణం జరుగుతుందన్నారు. 12 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పు, 2 మీటర్ల లోతుతో నిర్మాణం జరుగుతుంది. రూ.1.27 లక్షల నిధులు మెటీరియల్ కొరకు కేటాయించారు. 260 మస్టర్లు కేటాయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి ఏ.పీ.ఓ వరకొల్ల.మౌనిక, ఉపాధి టి.ఏ మల్కా అఖిల, సెక్రటరీ గంగుల సంతోష్, ఫీల్డ్ అసిస్టెంట్ సందవేన జ్యోతి పాల్గొన్నారు.

జిల్లాకు పదోన్నతిపై వచ్చిన ముగ్గురు వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్లు

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త;

పశు వైద్య పశుసంవర్ధక శాఖలో జూనియర్ వెటర్నరీ ఆఫీసర్లుగా పనిచేస్తున్నటువంటి వారికి లేక సంఖ్యా నెంబర్ 13 642 ప్రొసీడింగ్ తేదీ 29 2026 ద్వారా రాష్ట్ర పశు వైద్య పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ బి గోపి ఐఏఎస్ వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్లుగా పదోన్నతి కల్పించారు ఈ మేరకు జగిత్యాల జిల్లా పశువైద్య పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో పదోన్నతి పొందినటువంటి వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ లకు మంగళవారం జిల్లా పశు వైద్య పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బొల్లం ప్రకాష్ ప్రొసిడింగ్ కాపీలు అందజేశారు ఈ మేరకు జగిత్యాల జిల్లా మల్యాల మండలం రాంపూర్ పశు వైద్య ఉపకేంద్రం కేంద్రంలో పనిచేస్తున్నటువంటి మారిశెట్టి శ్రీనివాస్ బాబుకు సారంగాపూర్ మండలం రేచపల్లి పశువైద్య ఉపకేంద్రానికి అసిఫాబాద్ జిల్లా నుండి మాధవరావుకు ఇబ్రహీంపట్నం మండలం గోదురు ప్రాథమిక పశు వైద్య కేంద్రానికి నిజాంబాద్ జిల్లా నుండి పి సురేష్ కోరుట్ల మండలం పైడుమడుగు పశువైద్య ఉపకేంద్రానికి పదోన్నతి ఉత్తర్వులు జారీ చేశారు ఈ కార్యక్రమంలో జిల్లా కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సలు వాజి శ్రీధర్ వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ కందుకూరి పూర్ణచందర్ కార్యాలయపు సూపరింటెండెంట్ పోలుక అశోక్ కు మార్ సీనియర్ అసిస్టెంట్ శైలజ పదోన్నతి పొందిన వారికి అభినందనలు తెలిపారు



అనారోగ్యంతో ఉన్న కార్మికులకు అన్ ఫిట్ చేయాలి

ప్రతినెల రెండు మెడికల్ బోర్డులు నిర్వహించాలి

టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన



రామగిరి ప్రభాతవార్త సింగరేణిలో తీవ్ర అనారోగ్యాల బారిన ఉన్న కార్మికులను అన్ ఫిట్ చేయాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు కొప్పుల ఈశ్వర్ సూచనలతో యూనియన్ అధ్యక్షులు మిరియాల రాజిరెడ్డి మరియు కేంద్ర నాయకత్వం ఆదేశాలతో ఆర్ జి త్రీ ఏపీఏ ఉపాధ్యక్షులు నాగేల్లి సాంబయ్య ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం తెలియజేస్తూ మేనేజర్ల కు వినతి పత్రం అందజేశారు.సింగరేణిలో తీవ్ర అనారోగ్యాల బారిన ఉన్న కార్మికులను సైతం మెడికల్ ఇన్వాల్యుడేషన్ చేయడం లేదని దీంతో కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నదని పేర్కొంటూ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అన్ని గనులలో నల్ల బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కార్మికులందరితో కలిసి ఓసిపి వన్ మేనేజర్ పాపయ్య కు ఏఎల్పి మేనేజర్ పెంచలయ్య కు ఓసిపి టు ఇన్చార్జి మేనేజర్ కాలేష లకు పిట్ సెక్రటరీలు మరియు నాయకులు కార్మికులతో కలిసి వినతి పత్రం సమర్పించడం జరిగింది. భూగర్భగనుల్లో ఆరుగాలం శ్రమించి బొగ్గు ఉత్పత్తికి పనిచేస్తున్న క్రమంలో కార్మికుడు తీవ్ర అనారోగ్యాలకు మరియు ప్రమాదాలకు గురవుతున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకొని బార్డర్లో సైనికులకు ఇస్తున్న విలువను సింగరేణి కార్మికులకు సైతం అందజేయాలన్న సదుద్దేశంతో గతంలో టిఆర్ఎస్ పార్టీ ప్రభుత్వంలో ఉన్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ గారు 15వేల పైచిలుకు కారుణ్య నియామకాలను మెడికల్ ఇన్వాల్యుడేషన్ ద్వారా ఇవ్వడం ద్వారా కార్మికులను ఆదుకున్న వారు అయ్యారని తెలిపారు. అప్పట్లో 70 శాతం నుండి 90 శాతం పైచిలుకు అన్ ఫీట్లు అయినప్పటికీ ఇంకా ఎక్కువ చేయాలని అప్పటి సంఘాలు ఏఐటియుసి ఐఎన్టియుసి నిరసన కార్యక్రమాలు చేపట్టారని వారు గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలుగా గెలిచిన తర్వాత క్రమం తప్పకుండా మెడికల్ బోర్డులు కూడా నిర్వహించలేకపోయారని, ఒకటి రెండు మెడికల్ బోర్డులు పెట్టినప్పటికీ వాటిలో అతి తక్కువ మందిని అన్ ఫిట్ చేసి కార్మికులకు తీరని అన్యాయం చేశారని పేర్కొన్నారు. కార్మికుల అనారోగ్యాలను పరిగణలోకి తీసుకొని ఇప్పటినుండి అయినా క్రమం తప్పకుండా నెలకు రెండు లేదా మూడు మెడికల్ బోర్డులు నిర్వహించి అనారోగ్య బారిన ఉన్న కార్మికుల అందరిని మెడికల్ అన్ఫిట్ చేసి ఆదుకోవాలని లేఖ ద్వారా వివరించగా టీబీజీకేస్ నాయకులు కార్మికులు కలిసి ఇచ్చిన వినతి పత్రాన్ని కంపెనీ చైర్మన్ కు పంపుతామని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ నాయకులు దేవ శ్రీనివాస్, కేశవరావు ఈసంపల్లి రమేష్, పాశం శ్రీనివాస్ రెడ్డి, గట్టు శ్రీనివాస్, శ్రీకాంత్ రావు, ఫిట్ సెక్రటరీలు వివి గౌడ్ గీటుకు శ్రీనివాస్, పూర్ణాకర్, వేముల రవిశంకర్, చిప్ప సురేష్, పూర్ణాకర్ బుద్దే ఉదయ్, దేవరకొండ తిరుపతి, డివిజన్ నాయకులు అల్లం తిరుపతి, చిలకపల్లి శ్రీనివాస్, పోతరాజు రవి, పొన్నం సదానందం, బండి బాబురావు, కలిగిరి రవి, సెక్రటరీలు వీరగోని సంతోష గౌడ్, కొప్పుల సురేష్, క్రాంతి యాదవ్ నాయకులు బర్ల సుధాకర్, పోయిల భూమయ్య పిట్టల సది, చుక్కల కుమార్ రమణారెడ్డి రాజశేఖర్ అభిలాష్, చంద్రయ్య, రాజు, రాజేశం, సుగుణాకర్ రావు, మోహన్, రమేష్, శ్రీనివాస్, గట్టయ్య, కిరణ్ ,రవి, వికాస్ శ్రీనివాస్ రెడ్డి పురుషోత్తం సుధాకర్, శ్రీకాంత్, సూర్య ప్రకాష్, సంజీవ్, వెంకటేశ్వర్లు ముజాఫర్ ఖాన్, రాజ్ కుమార్, తిరుపతి, మూగ శ్రీనివాస్, మల్లేష్, వెంగళరావు, అశోక్ ,ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

న్యాయశాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో పెన్షన్ విద్రోహదినం

మహబూబాబాద్ టౌన్,సెప్టెంబర్1,ప్రభాతవార్త:

మహబూబాబాద్ జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో మంగళవారం సెప్టెంబర్ 1 సందర్భంగా పెన్షన్ విద్రోహదినం పాటిస్తూ నల్లబ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిఎస్ సిపిఎస్ఈయు రాష్ట్ర కార్యదర్శి ముబీన్ అహ్మద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని వెంటనే అమలు పరుచాలన్నారు. పదవీ విరమణ అనంతరం వృద్ధాప్యంలో ఎలా జీవించాలని ఆయన ప్రశ్నించారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీని విస్మరించారన్నారు. అదేవిధంగా పిఆర్సి డిఎ సరెండింగ్ మెడికల్ రియంబర్స్‌మెంట్ తదితర అంశాలపై దృష్టిసారించి ఉద్యోగులను ఆదుకోవాలి

నైపుణ్యంతో అగ్ని ప్రమాదాలను నివారించవచ్చు

కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త :



అప్రమత్తత, నైపుణ్యతలతో అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని 9 తెలంగాణ బెటాలియన్ ఎన్సీసీ కమాండింగ్ ఆఫీసర్ (ఎస్ఎం) కల్నల్ ఎ. కె. జయంత , జంగ్‌బాజ్ ఖాన్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం సహకారంతో ఎన్‌సిసి క్యాడెట్ల కోసం బెటాలియన్ లో అగ్నిమాపక భద్రతా అవగాహన నిర్వహించారు. అగ్ని ప్రమాద సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎల్‌పిజి గ్యాస్ లీకేజీని గుర్తించడం, దానివల్ల కలిగే ప్రమాదాలు, లీకేజీ సమయంలో స్పందించే విధానం, అగ్ని ప్రమాదాలను నివారించి అదుపు చేసే సరైన పద్ధతులపై వారు సమగ్ర ప్రదర్శనలు ఇచ్చారు. వివిధ రకాల అగ్నిమాపక పరికరాల సరైన వినియోగం, మంటలను ఆర్పడం, వాటర్ జెట్ వినియోగాన్ని ప్రదర్శించారు. ఊహించని అగ్ని ప్రమాద సమయాల్లో ప్రశాంతంగా, సమర్థవంతంగా ఎలా స్పందించాలో అర్థం చేసుకోవడానికి ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చారు. హెడ్ కానిస్టేబుల్ సురేందర్, యాదగిరి వివిధ అగ్నిమాపక పద్ధతులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో లెఫ్టినెంట్ పి.రాజు, లెఫ్టినెంట్ శ్రీకళ, వి.రాజేష్, ప్రకాష్, సుబేదార్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పవర్డ్ ఇండియన్ నివేదికలో నిజం లేదు

ఎంపీ లాడ్స్ నిధులన్నీ వినియోగించాం

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త :కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏటా కేటాయిస్తున్న ఎంపీ లాడ్స్ నిధులను వినియోగించుకోవడంలో పార్లమెంట్ సభ్యులు పూర్తిగా వెనుకబడిపోతున్నారంటూ ఎంపవర్డ్ ఇండియన్ సంస్థ విడుదల చేసిన నివేదిక సత్య దూరమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. ఎంపీ లాడ్స్ కింద పంపిన ప్రతిపాదనలకు సంబంధించి పనుల పురోగతి వంటి అంశాలను పరిగణలోకి తీసుకోకుండా ఎంపీలపై అభాండాలు వేయడం సరికాదని పేర్కొన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో 18వ లోక్ సభ ఎంపీ లాడ్స్ కింద రూ.17.50 కోట్లు కేటాయించగా, ఇప్పటికే రూ.16.47 కోట్లు వినియోగించామని స్పష్టం చేశారు. గత మూడేళ్లలో కమ్యూనిటీ హాల్స్, బోర్ వెల్స్, హైమాస్ట్ లైట్స్, సీసీ రోడ్ల నిర్మాణాల కోసం కలెక్టర్ కు ప్రతిపాదనలు పంపామన్నారు. కరీంనగర్ జిల్లా నుండి 313, హన్మకొండ నుండి 39, జగిత్యాల నుండి 45, రాజన్న సిరిసిల్ల నుండి 151, సిద్దిపేట నుండి 79 పనులకు ప్రతిపాదనలున్నాయని, 82.29 శాతం పనులకు ఆయా జిల్లాల కలెక్టర్లు ఆమోదం తెలిపారన్నారు. మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్ కుమార్ తన ఐదేళ్ల కాలంలో వినియోగించని రూ. 2.5 కోట్లను సైతం తాను ఖర్చు చేసినట్లు తెలిపారు. ఏడాదికి సంబంధించిన నిధులు మొత్తం ఖర్చయ్యాయని, అవసరమైన నిధుల కోసం సీఎస్సార్ ఫండ్స్ ను సేకరిస్తున్నామనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు.

ఉక్రెయిన్ యుద్ధంలో మృతి చెందిన సుదర్శన్ గౌడ్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:

ఉక్రెయిన్‌రష్యా యుద్ధ వాతావరణంలో ప్రాణాలు కోల్పోయిన జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్ గ్రామానికి చెందిన వావిలాల సుదర్శన్ గౌడ్ కుటుంబాన్ని జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ పరామర్శించారు.బాధిత కుటుంబ సభ్యులను నేరుగా కలసి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి,వారిని ఓదార్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,ఉపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లిన సుదర్శన్ ఇలా యుద్ధ ఘర్షణల్లో మరణించడం అత్యంత విచారకరమని,ఇది ఆయన కుటుంబానికి గ్రామానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి క్లిష్ట సమయంలో ప్రజాప్రతినిధులుగా, ప్రభుత్వపరంగా ఆ కుటుంబానికి అండగా నిలవాల్సిన బాధ్యత ఉందన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి, బాధిత కుటుంబానికి ప్రభుత్వం ద్వారా తగిన పరిహారం,సహాయం అందేలా శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.కుటుంబ సభ్యులు ఎవరూ ధైర్యం కోల్పోవద్దని,ప్రభుత్వం అన్ని వేళలా వారికి అండగా ఉంటుందని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ స్పష్టం చేశారు.



వైద్య సేవలను విస్తృత పరచాలి

డిఎంహెచ్ఓ డా.రాజగోపాల్ రావ్

కరీంనగర్ హెల్త్, ప్రభాత వార్త:



వైద్య సిబ్బంది ప్రజా ప్రతినిధులు సంయుక్తంగా కలిసి ప్రజలకు వైద్య సేవలను విస్తృత పరచాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజగోపాల్ రావ్ అన్నారు. రేకుర్తిలోని బస్తి దవాకానను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేసారు. హాజరు రిజిస్టర్, అవుట్ పేషెంట్ రిజిస్టర్, ఎన్సిడి రిజిస్టర్, ఫార్మసీ స్టోర్స్, పిల్లల వ్యాధి నిరోధక టీకాలు నిల్వ ఉంచే ఐఎల్ఆర్ ను, దాని రోజువారి టెంపరేచర్ రికార్డుల నమోదును పరిశీలించారు. అనంతరం డిఎంహెచ్ఓ మాట్లాడుతూ స్థానిక ప్రజా ప్రతినిధులు, ఆశా కార్యకర్త, అంగన్వాడీ కార్యకర్త, ఏఎన్ఎం, పంచాయతీ సెక్రెటరీ కలిసి ప్రతి వారము సమావేశం నిర్వహించి ఫీవర్ సర్వే, మెడికల్ క్యాంప్, ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రై డే గురించి చర్చించాలని సూచించారు. టీ హబ్ కు ఫీవర్ శాంపిల్స్ ఎప్పటికప్పుడు పంపించాలని, వైద్యాధికారులు ముందస్తుగా మెడికల్ క్యాంపు గురించి తెలియజేయాలని, పరిసరాల పరిశుభ్రత, డ్రింకింగ్ వాటర్ సోర్సెస్, వెక్టార్ బార్ండ్ వ్యాధుల గురించి ప్రజలకు తెలియజేయాలని అన్నారు. పాము కాటు, కుక్కకాటుకు సంబంధించిన మందులను నిల్వ ఉంచుకోవాలని, సిబ్బందికి సెలవులు అవసరమైనచో ముందస్తుగా పర్మిషన్ తీసుకోవాలని తెలియజేశారు. గర్భవతుల పరీక్షలు, అభా కార్డుల నమోదు సంఖ్యను పెంచాలన్నారు. 13 సంవత్సరముల వయస్సు పైబడిన వారందరికీ ఆరోగ్య మహిళ హెల్త్ క్యాంపులలో స్క్రీనింగ్ చేసిన అందరిని, రీస్క్రీనింగ్ చేస్తూ సమాచార సేకరణ చేయాలని, 14 సంవత్సరములు నిండిన బాలికలకు హెచ్పీవీ వ్యాక్సినేషన్ వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డా.లావణ్య, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంకితభావం, విశ్వాసం ఎల్ఐసీకి మాత్రమే సాధ్యం

ఎల్ఐసీ 70వ వార్షికోత్సవాలు ప్రారంభం

కరీంనగర్ బిజినెస్, ప్రభాతావార్త

దేశం పట్ల విశ్వాసం, అంకితభావంతో కూడిన సేవ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు మాత్రమే సాధ్యమని సీనియర్ డివిజనల్ మేనేజర్ శివ నాగ ప్రసాద్ అన్నారు. డివిజనల్ కార్యాలయంలో మంగళవారం ఎల్ఐసి 70వ వార్షికోత్సవ వేడుకలను ఆయన జెండా ఆవిష్కరించ ప్రారంభించారు. ఏడు దశాబ్దాల ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఈ ఏడాది ఎల్ఐసీ మా ప్రయాణం మీ నమ్మకం అనే ఇతివృత్తంతో వేడుకలను నిర్వహిస్తోందన్నారు. లక్షలాది మంది పాలసీదారుల అచంచలమైన విశ్వాసం, సంస్థ అద్భుతమైన ప్రయాణం దీనికి నిదర్శనమని, తరతరాల ప్రజల కలలు, ఆశయాలకు భరోసా కల్పించడంలో, ఎల్ఐసీకి ఏ సంస్థ సాటి లేదని అన్నారు. సెప్టెంబర్ 1 నుండి 7 వరకు బీమా వారోత్సవాలు నిర్వహించబడనున్నాయని, ఆర్థిక భద్రతను కల్పించడం కుటుంబాలు తమ భవిష్యత్తును సురక్షితం చేసుకోవడంలో సహాయపడటం ద్వారా ఎల్ఐసీ భారతీయుల తరతరాలతో బలమైన, శాశ్వతమైన బంధాన్ని ఏర్పరచుకుందన్నారు. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ సతీష్ కుమార్ మాట్లాడుతూ యోగక్షేమం వహామ్యహం (మీ సంక్షేమం మా బాధ్యత) అనే సూత్రానికి కట్టుబడి, ప్రాణ రక్షణ, ఆర్థిక భద్రతను బలోపేతం చేయడం, వినియోగదారుల మారుతున్న అవసరాలకు అనుగుణంగా సేవలు అందించడంలో ఎల్ఐసీ తన నిబద్ధతను నిలబెట్టుకుంటోందని అన్నారు. బీమా రంగంలోకి ప్రైవేట్ సంస్థల ప్రవేశం ఉన్నప్పటికీ, విస్తృతమైన శాఖలు, ఏజెంట్లు, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల నెట్‌వర్క్ మద్దతుతో ఎల్ఐసీ భారతదేశపు అతిపెద్ద జీవిత బీమా సంస్థగా తన స్థానాన్ని నిలబెట్టుకుందని, వ్యక్తులు, కుటుంబాల విభిన్న ఆర్థిక అవసరాలను తీర్చడానికి అనేక రకాల జీవిత బీమా, పెన్షన్, మార్కెట్ లింక్డ్ ఉత్పత్తులను అందిస్తుందని ఆయన పేర్కొన్నారు.



బీసీల రాజ్యాధికారమే టీఆర్పీ లక్ష్యం

17 నుండి పాదయాత్ర

టిఆర్పి రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా



మానకొండూర్, ప్రభాతవార్త : బీసీలకు రాజ్యాధికారమే టీఆర్పీ లక్ష్యమని రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టిఆర్పి) మానకొండూరు నియోజకవర్గం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా పాల్గొని మాట్లాడుతూ తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన బీసీలు దశాబ్దాలుగా రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో తమ జనాభాకు తగిన స్థాయిలో ప్రాతినిధ్యం పొందలేకపోతున్నారని అన్నారు. బీసీలకు రాజకీయ, విద్య, ఉద్యోగాలు, ఆర్థిక అవకాశాల్లో సముచిత న్యాయం జరగాలని అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల ఆత్మగౌరవం, హక్కులు,రాజకీయ అధికార సాధన తెలంగాణ రాజ్యాధికార పార్టీ ప్రధాన లక్ష్యాల్లో భాగమని తెలిపారు. సామాజికంగా వెనుకబడిన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరిగినప్పుడే వారి సమస్యలకు శాశ్వత పరిష్కారానికి మార్గం ఏర్పడుతుందని అన్నారు. ఈ సందర్భంగా పార్టీలోకి నూతనంగా చేరిన పలువురు సభ్యులకు అఖిల్ పాషా కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. సెప్టెంబర్ 17వ తేదీ నుంచి టిఆర్పీ పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరంజిల్లా మహిళా అధ్యక్షురాలు రాచురి అరుణ మాట్లాడుతూ ప్రజల ఆశయాల సాధన కోసం తీన్మార్ మల్లన్న స్థాపించిన తెలంగాణ రాజ్యాధికార పార్టీ సెప్టెంబర్ 17 నాటికి ఏడాది పూర్తవుతుందన్న సందర్భంగా పాదయాత్ర ప్రారంభిస్తున్నామని తెలిపారు. పార్టీ ఏర్పడిన అతి తక్కువ సమయంలోనే ప్రజలకు చేరువై, అనేక ప్రజా సమస్యలపై పోరాటాలకు బిందువుగా మారిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై ప్రజలకు నమ్మకం తగ్గిపోయిందని, ప్రస్తుతం ప్రజలందరి చూపు తెలంగాణ రాజ్యాధికార పార్టీ వైపే ఉందన్నారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం రాజకీయ శక్తిగా టీఆర్పీ ఎదుగుతోందని తెలిపారు. ముఖ్యంగా బీసీలకు జరుగుతున్న అన్యాయం పైన తెలంగాణ రాజ్యాధికారపార్టీ పోరాడుతూ ప్రజలకు మరింత దగ్గరైందని అన్నారు. పాదయాత్రలో మల్లన్నతో కలిసి నడవడానికి నియోజకవర్గం నుంచి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున రావాలన్నారు. అలాగే వాసాల భానుచెందర్ మాట్లాడుతూ పార్టీ శ్రేణుల క్షేమమే పార్టీ లక్ష్యమని సభ్యత్వం నమోదు చేసుకున్న వారికి దురదృష్టవశాత్తు ఏదైనా జరిగి మనిషి చనిపోతే వారి కుటుంబానికి భరోసాగారూ.5లక్షలు, ప్రమాదంలో ఎముకలు విరిగితే రూ 2.50లక్షల భీమా పార్టీ కార్యకర్తలకు కల్పిస్తుందన్నారు. మానకొండూర్ నియోజకవర్గం నిత్యం సమస్యల వలయంగా మారిందని, పదేళ్ల బిఆర్ఎస్ పాలన, ప్రస్తుత కాంగ్రెస్ పాలన కూడా అభివృద్ధి చేయడంలో విఫలమైనాయని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు జింక లావణ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, ప్రధాన కార్యదర్శి చిగుర్ల మోహన్, జిల్లా మహిళా అధ్యక్షురాలు రాచురి అరుణ, కార్యదర్శి ఇశాక్ శావాలి, మండలాల అధ్యక్షులు శివరాత్రి మోహన్, అమ్మిగళ్ల కుమార్, నాయకులు దురుశెట్టి చెందు, గుండోజు సాధనందం, నెరేళ్ల శ్రీకాంత్, గుండోజు పద్మ, మావురపు కనకయ్య, వెంకట్ గౌడ్, కమటం రాజేష్, యాసాలా శ్రీనివాస్, దాసరి రమేష్, వంశీకృష్ణ, నాగరాజు, ప్రవీణ్, సాయి కృష్ణ, పర్శారము, రమేష్, శేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చిన సర్పంచ్

మానకొండూర్, ప్రభాతవార్త :

మండలంలోని మద్దికుంట గ్రామంలో రోడ్డుపై గుంతలను గ్రామ సర్పంచ్ బుర్ర శ్రీధర్ గౌడ్ మట్టి పోసి చదను చేపట్టినట్లు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీధర్ గౌడ్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలు వాహనాదారులు రహదారిపై పడ్డ గుంతలతో ఇబ్బందులు పడుతున్నారని సమస్యను దృష్టిలో పెట్టుకొని గ్రామస్తుల సహకారంతో రోడ్లపై మట్టి పోసి, చదును చేపట్టినట్లు తెలిపారు. గ్రామ సమస్యల పట్ల సర్పంచ్ బుర్ర శ్రీధర్ గౌడ్ అందిస్తున్న సేవలకు ప్రజలు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చిల్ల శ్రీధర్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు నిరసన ప్రదర్శన

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



జగిత్యాల కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు పెన్షన్ హక్కుల కోసం మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు.ప్రభుత్వం వెంటనే కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ను రద్దు చేసి,పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలనే ప్రధాన డిమాండ్‌తో టీజీజేఏసీ పిలుపు మేరకు మంగళవారం జిల్లా వ్యాప్తంగా "సీపీఎస్ విద్రోహ దినం" పాటించారు.టీజీజేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్,సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్ రావుల ఆదేశాల మేరకు జగిత్యాల జిల్లా జేఏసీ చైర్మన్ మిర్యాల నాగేందర్ రెడ్డి, జిల్లా కన్వీనర్ కందుకూరి రవి బాబుల పర్యవేక్షణలో ఉద్యోగులు,ఉపాధ్యాయులు,పెన్షనర్లు, కాంట్రాక్టు,అవుట్ సోర్సింగ్ సిబ్బంది మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఆందోళన బాట పట్టారు.స్థానిక కలెక్టర్ కార్యాలయం ఎదుట మోహరించి నినాదాలతో హోరెత్తించడంతో పాటు జిల్లాలోని అన్ని మండల,డివిజన్ కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు చేపట్టారు.ఈ ఆందోళనను ఉద్దేశించి జేఏసీ నాయకులు మాట్లాడుతూ 2004 సెప్టెంబర్ 1న నాటి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగుల పెన్షన్ హక్కును కాలరాస్తూ సీపీఎస్‌ను అమల్లోకి తెచ్చాయని విమర్శించారు.దశాబ్దాల పాటు ప్రభుత్వానికి సేవ చేసిన ఉద్యోగులకు సీపీఎస్ వల్ల చివరికి వృద్ధాప్య పింఛన్ కంటే తక్కువ పెన్షన్ వస్తోందని,వారి పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని వాపోయారు. ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం సీపీఎస్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.అలాగే నూతన పీఆర్సీ అమలు,నిలిచిపోయిన 6 డీఏల తక్షణ విడుదల,ఈహెచ్ఎస్ కార్డుల సమర్థవంతమైన అమలు,బకాయి బిల్లుల మంజూరు పూర్తయ్యే వరకు విశ్రమించేది లేదని హెచ్చరించారు.తమ డిమాండ్ల సాధనకు సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లోని లాల్ బహదూర్ స్టేడియంలో తలపెట్టిన 'మహా ధర్నా'ను ఉద్యోగ లోకం పెద్ద ఎత్తున హాజరై దిగ్విజయం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో టిఎన్‌జీఓ జిల్లా కార్యదర్శి ఊకంటి అమరేందర్ రెడ్డి,జేఏసీ కో చైర్మన్లు ఎండి. వకీల్,హరి అశోక్ కుమార్,ఖైరం హరికిరణ్,శ్యామ్ సుందర్,గుర్రం శ్రీనివాస్ గౌడ్, శివరామ కృష్ణలతో పాటు పెద్ద ఎత్తున ఉద్యోగులు,ఉపాధ్యాయులు,పెన్షనర్లు పాల్గొన్నారు.

అన్నవరం శ్రీ సత్యనారాయణ స్వామివారిని దర్శించుకున్న బీజేపీ

జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జ్ డా. బోగ శ్రావణి ప్రవీణ్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:ప్రముఖ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామివారిని మంగళవారం బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇంచార్జ్ డా. బోగ శ్రావణి ప్రవీణ్ దర్శించు కున్నారు.ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజ లందరూ సుఖసంతోషాలతో, ఆయు రారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. దేశం సుభిక్షంగా ఉండాలని, ప్రజల సంక్షేమం మరియు అభివృద్ధి నిరంతరం కొనసాగాలని స్వామివారిని ప్రార్థించారు. అనంతరం ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వచనాలు అందించారు.



రైతులకు జీవామృతం తయారీపై అవగాహన

చిన్నగూడూరు, సెప్టెంబర్1, ప్రభాతవార్త:

నేల సారాన్ని పెంపొందించేందుకు జీవామృతం వినియోగించాలని ఏఈవో శిరీష తెలిపారు. రైతులు పంటల సాగులో రసాయన ఎరువుల వినియోగాన్ని క్రమంగా తగ్గిస్తూ, నేల ఆరోగ్యాన్ని పరిరక్షించే సహజ వ్యవసాయ పద్ధతులకు ప్రాధాన్యత ఇవ్వాలని పంటలకు ఉపయోగపడే జీవామృతం తయారీ, వినియోగ విధానంపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఈఓ శిరీష మాట్లాడుతూ జీవామృతం రైతులు తమకు అందుబాటులో ఉన్న సహజ వనరులతో తక్కువ ఖర్చుతో తయారు చేసుకునే సేంద్రియ ద్రావణమని తెలిపారు. రైతులు బయట నుంచి అధిక ఖర్చుతో ఎరువులు కొనుగోలు చేయకుండా, తమ వద్ద అందుబాటులో ఉన్న పశువుల ఆధారిత వనరులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా సాగులో ఖర్చులను కొంతవరకు నియంత్రించుకోవచ్చని వివరించారు.

మహనీయుడా... మళ్లీ జన్మించు..!

కొడిమ్యాల, ప్రభాతవార్త:

2009 సెప్టెంబర్ 2... తెలుగు ప్రజల గుండెల్లో చెరగని విషాదాన్ని మిగిల్చిన రోజు. ప్రజల కోసం పరితపించిన నాయకుడు, రైతుల కష్టాలను తన కష్టాలుగా భావించిన మహానేత, పేదల జీవితాల్లో వెలుగులు నింపిన మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఈ రోజునే హెలికాప్టర్ ప్రమాదంలో కన్నుమూశారు. ఆయనను అభిమానించే కోట్లాది మంది ప్రజలు ప్రతి ఏటా సెప్టెంబర్ 2న వర్ధంతి సందర్భంగా జోహార్ రాజన్న అంటూ ఘనంగా నివాళులర్పిస్తున్నారు. వైఎస్ఆర్‌ను గుర్తు చేసుకుంటే కేవలం ఒక రాజకీయ నాయకుడి పేరు మాత్రమే గుర్తుకు రాదు. రైతు పొలానికి చేరిన సాగునీరు, పేదవాడి సొంతింటి కల, విద్యార్థి చదువుకు లభించిన ఆర్థిక సహాయం, పేదలకు అందిన వైద్యం, గ్రామీణ ప్రాంతాలకు చేరిన అభివృద్ధి ఇలా ఎన్నో జ్ఞాపకాలు కళ్లముందు కదలాడుతాయి.

జలయజ్ఞంతో రైతు జీవితాల్లో కొత్త ఆశలు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్ఆర్ బాధ్యతలు చేపట్టిన అనంతరం సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. జలయజ్ఞం పేరుతో భారీ, మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టులతో పాటు స్థానిక నీటి వనరుల అభివృద్ధికి చర్యలు చేపట్టారు. అప్పటి కరీంనగర్ జిల్లాలో సాగునీటి వసతులు అంతంత మాత్రంగానే ఉన్న అనేక ప్రాంతాలకు నీటిని అందించాలనే లక్ష్యంతో ప్రాజెక్టులు, చెరువులు, రిజర్వాయర్ల అభివృద్ధిపై దృష్టి సారించారు. వర్షాధారంగా వ్యవసాయం చేసే రైతులకు సాగునీటి భరోసా కల్పించేందుకు చర్యలు తీసుకున్నారు.

గోదావరిపై ఎల్లంపల్లి... వేల ఎకరాలకు నీటి భరోసా

గోదావరి నదిపై ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణం చేపట్టడం ఈ ప్రాంత సాగునీటి చరిత్రలో కీలక ఘట్టంగా నిలిచింది. ప్రాజెక్టు ద్వారా సాగునీటి అవసరాలను తీర్చడంతో పాటు తాగునీటి అవసరాలకు కూడా ఊతం లభించింది.నీరు ఉంటేనే పంట... పంట ఉంటేనే రైతు కుటుంబానికి ఆదాయం... అనే వాస్తవాన్ని గుర్తించిన వైఎస్ఆర్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు పెద్దపీట వేసింది. ఎల్లంపల్లి ప్రాజెక్టు పరిధిలోని నీటి వనరులతో పలు ప్రాంతాల్లో వ్యవసాయానికి ఊతం లభించగా, తాగునీటి అవసరాలకు కూడా నీటి వనరులు అందుబాటులోకి వచ్చాయి. నేడు ఈ ప్రాంతంలో సాగునీటి గురించి మాట్లాడినప్పుడు వైఎస్ఆర్ హయాంలో చేపట్టిన జలయజ్ఞాన్ని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు.

చెరువులు, రిజర్వాయర్ల పునరుద్ధరణ

పెద్ద ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోని చెరువులు, కుంటలు, రిజర్వాయర్లను పునరుద్ధరించి నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యాన్ని పెంచే చర్యలకు కూడా ప్రాధాన్యత ఇచ్చారు. ఏళ్ల తరబడి సాగునీటి కోసం ఎదురుచూసిన రైతులకు నీటి వసతి కల్పించి బీడు భూములను సాగులోకి తీసుకురావాలనే లక్ష్యంతో చర్యలు చేపట్టారు. దీంతో అనేక ప్రాంతాల్లో పంటల సాగుకు అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయి.

కొడిమ్యాల మండలంలో సంక్షేమ ముద్ర

వైఎస్ఆర్ పాలనలో కొడిమ్యాల మండలంలోనూ సంక్షేమ పథకాల ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రయోజనం చేకూరింది.ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంత ఇల్లు లేని పేద కుటుంబాలకు గృహ నిర్మాణానికి అవకాశం కల్పించారు. రైతులకు ఉచిత విద్యుత్, పేదలకు ఆరోగ్యశ్రీ, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలు ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చాయి. ఇందిరమ్మ ఇళ్లతో పేద కుటుంబాలకు గూడు...ఆరోగ్యశ్రీతో వైద్య భరోసా...ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో విద్యార్థులకు చదువు...ఉచిత విద్యుత్‌తో రైతులకు వ్యవసాయ భరోసా... ఇలా సంక్షేమాన్ని ప్రజల జీవితాలకు చేరువ చేసిన నాయకుడిగా వైఎస్ఆర్ పేరు నిలిచిపోయింది.

పాదయాత్రతో ప్రజల సమస్యలు తెలుసుకుని...

వైఎస్ఆర్ రాజకీయ జీవితంలో 2003 పాదయాత్ర ఒక చారిత్రక ఘట్టం. మండుటెండలను సైతం లెక్కచేయకుండా గ్రామాలు, పల్లెల్లో పర్యటిస్తూ రైతులు, మహిళలు, పేదలు, యువత సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ప్రజల బాధే నా బాధ అనే భావనతో ముందుకు సాగిన ఆయన అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు ప్రాధాన్యత ఇచ్చారు.

ప్రజల మనసుల్లో నిలిచిన మహానేత

2004లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ఆర్ సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ పాలన సాగించారు. 2009లో మరోసారి ప్రజల ఆశీర్వాదంతో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అయితే అదే ఏడాది సెప్టెంబర్ 2న జరిగిన హెలికాప్టర్ ప్రమాదం ఆయన జీవితాన్ని విషాదంగా ముగించింది. రాష్ట్ర ప్రజలు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఆయన మరణించి సంవత్సరాలు గడిచినా... ప్రజల జీవితాలను తాకిన ఆయన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు మాత్రం ఆయన జ్ఞాపకాలను సజీవంగా ఉంచుతున్నాయి.

ప్రాజెక్టులు కనిపిస్తే రాజన్న గుర్తొస్తాడు..

ఎల్లంపల్లి జలాలు కనిపిస్తే రాజన్న గుర్తొస్తాడు...రైతు పొలంలో పచ్చని పంట కనిపిస్తే రాజన్న గుర్తొస్తాడు...ఇందిరమ్మ ఇల్లు కనిపిస్తే రాజన్న గుర్తొస్తాడు...నాచుపల్లి జేఎన్టీయూలో విద్యార్థులు చదువుకుంటుంటే రాజన్న గుర్తొస్తాడు...పేదవాడికి ఆరోగ్య భరోసా లభిస్తే రాజన్న గుర్తొస్తాడు...విద్యార్థి ఉన్నత విద్య వైపు అడుగేస్తే రాజన్న గుర్తొస్తాడు...అభివృద్ధి పనుల్లోనూ... సంక్షేమ పథకాల్లోనూ... ప్రజల జ్ఞాపకాల్లోనూ రాజన్న కనిపిస్తూనే ఉన్నాడు.

జోహార్ రాజన్న..!

నాయకులు వస్తారు... వెళ్తారు...పదవులు వస్తాయి... పోతాయి...ప్రభుత్వాలు మారుతాయి... రాజకీయాలు మారుతాయి...కానీ ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చిన నాయకుల జ్ఞాపకాలు మాత్రం ఎప్పటికీ చెరిగిపోవు. రైతు చెమటలో పంటను చూసిన నాయకుడు..పేదవాడి కన్నీటిలో కష్టాన్ని చూసిన నాయకుడు...విద్యార్థి చేతిలో పుస్తకంలో భవిష్యత్తును చూసిన నాయకుడు...ప్రజా సంక్షేమంలోనే తన పాలనా విజయాన్ని చూసిన నాయకుడు అలాంటి మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి. కొడిమ్యాల ప్రాంతానికి సాగునీటి భరోసా, విద్యా అవకాశాలు, సంక్షేమ పథకాల రూపంలో మిగిల్చిన జ్ఞాపకాలు ఆయన సేవలకు చిరస్థాయి గుర్తులుగా నిలవాలని ప్రజలు కోరుకుంటున్నారు.మహనీయుడా... మళ్లీ జన్మించు..!, నీ సేవాస్ఫూర్తి తరతరాలకు స్ఫూర్తిగా నిలవాలి..!జోహార్ రాజన్న..!

మోడల్ స్కూల్ విద్యార్థులకు ఐడీ కార్డుల పంపిణీ

కొడిమ్యాల, ప్రభాతవార్త:



జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థులకు చొప్పదండి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్ తన సొంత ఖర్చులతో ఐడీ కార్డులను అందజేశారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొత్తూరి మహేష్ మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులు బోధించే విషయాలను ఏకాగ్రతతో అర్థం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. పాఠశాలకు, తల్లిదండ్రులకు, విద్యాబోధన చేస్తున్న ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ బి. లావణ్య, ఉపాధ్యాయ బృందం, చింటూ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు మధ్యలో ఆగిపోయిన లబ్ధిదారుల వివరాలు తెలుపండి

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



జగిత్యాల అర్బన్ కాలనీ శివారు ప్రాంతంలో గతంలో మంజూరై, నిర్మాణ దశలో ఆగిపోయిన ఇందిరమ్మ పథకం ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది.బేస్మెంట్ లేదా గోడల వరకు నిర్మాణాలు చేపట్టి,ప్రభుత్వం నుండి గతంలో పాక్షికంగా బిల్లులు పొందిన వారు తమ వివరాలను తిరిగి సమర్పించాలని జిల్లా గృహనిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ తెలిపారు. అర్హులైన వారు 2026 సెప్టెంబర్ 2వ తేదీ నుండి 11వ తేదీ వరకు,అంటే పది రోజుల వ్యవధిలో నిర్ణీత దరఖాస్తు ఫారంలో తమ పూర్తి బయోడేటాను నింపి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.సదరు దరఖాస్తులకు ఆధార్ కార్డు, రేషన్ కార్డు,ప్రభుత్వం మంజూరు చేసిన ప్లాట్ ధ్రువీకరణ పత్రం జిరాక్స్ ప్రతులతో పాటు ప్రస్తుతం ఆగిపోయిన నిర్మాణం ఫోటోలను తప్పనిసరిగా జత చేయాల్సి ఉంటుంది.వీటితో పాటు లబ్ధిదారులు ప్రస్తుతం నివసిస్తున్న చిరునామా,ఫోన్ నంబర్‌ను దరఖాస్తులో స్పష్టంగా నమోదు చేయాలి.సంబంధిత దరఖాస్తు ఫారములు జగిత్యాల మున్సిపల్ కార్యాలయం,కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని రూమ్ నంబర్ 124లో అందుబాటులో ఉంటాయని,భర్తీ చేసిన దరఖాస్తులను జిల్లా కలెక్టర్ అనుమతి మేరకు పైన పేర్కొన్న ఏదేని కార్యాలయంలో నిర్ణీత గడువులోగా అందజేయాలని అధికారులు కోరారు.

బిజెపి స్టేట్ చీఫ్ రామచంద్రరావు హౌస్ అరెస్ట్ దుర్మార్గం..అప్రజా స్వామికం.

బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం

కరీంనగర్ క్రైమ్, ప్రభాతవార్త :



నల్లగొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి నివాసంపై కాంగ్రెస్ శ్రేణులు దాడి చేసిన నేపథ్యంలో పరామర్శించేందుకు వెళ్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావును పోలీసులు అక్రమంగా హౌస్ అరెస్ట్ చేయడాన్ని, కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ఇటువంటి అప్రజాస్వామిక చర్యలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని, రామచందర్రావు అరెస్టు దుర్మార్గమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం అన్నారు.. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్రావు అక్రమ హౌస్ అరెస్టును ఖండిస్తూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రోజున కరీంనగర్లోని తెలంగాణ చౌక్ లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సాయిని మల్లేశం మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. బీజేపీకి రాష్ట్రంలో రోజురోజుకూ పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే, అధికార పార్టీ నేతలు అరాచకాలకు దిగుతున్నారని విమర్శించారు. నల్లగొండలో బీజేపీ జిల్లా అధ్యక్షుడి కుటుంబ సభ్యులపై, ఆయన తల్లిపై భౌతిక దాడులు చేసిన గూండాలను వదిలేసి, బాధితులను పరామర్శించడానికి వెళ్తున్న రాష్ట్ర అధ్యక్షుడిని గృహనిర్బంధం చేయడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎమర్జెన్సీని మించిన అరాచక పాలన సాగుతోందని, శాంతిభద్రతలను కాపాడటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మల్లేశం మండిపడ్డారు. దాడులకు పాల్పడిన కాంగ్రెస్ నాయకులను తక్షణమే అరెస్ట్ చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ శ్రేణుల ఆధ్వర్యంలో ఉధృతమైన ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు కన్నబోయిన ఓదెలు రాష్ట్ర కార్యవర్గ సభ్యులుఇనుగొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు, జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రవెల్లి సంపత్ రావు, గుజ్జ శ్రీనివాస్ రావు , వైద రామానుజమ్, నాంపల్లి శ్రీనివాస్, సిహెచ్ నరసింహ రాజు, కనుమల్ల గణపతి, దండు కొమరయ్య, పుప్పాల రఘు, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు నేరెళ్ల ప్రవీణ్ రెడ్డి జిల్లా అధ్యక్షులు సంగా నరేష్, , బోయిని శ్రీనివాస్, లతోపాటు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్ పరామర్శ

పెద్దపల్లి, ప్రభాతవార్త:

జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామంలో ఇటీవల కాలంలో పురోహితులు సముద్రాల ప్రసాదాచార్యులు మరణించగా ఆయన



కుటుంబాన్ని పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణా రావు మంగళవారం పరామర్శించారు. వారి నివాసానికి వెళ్లి ప్రసాదాచార్యులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను కలిసి తన ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని వ్యక్త పరిచారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో గుంతలు పూడ్చిన దంపతులు

నల్లబెల్లి, సెప్టెంబర్ 01, ప్రభాతవార్త

మా గ్రామానికి వచ్చే ప్రధాన రహదారి గుంతల మయం కావడంతో ఇటు పాదాచారులు అటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఓ రైతు దంపతులు ఆ గుంతలు పూడ్చి శ్రమదానం చేసిన సంఘటన వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం శనిగరం కన్నారావుపేట గ్రామాల మధ్య చోటుచేసుకుంది. మండలంలోని శనిగరం గ్రామం నుండి కన్నారావుపేట గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి గుంతల మాయం కావడంతో వ్యవసాయదారులు,పాదాచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గమనించిన కన్నారావుపేట గ్రామానికి చెందిన తండ.రాజు అనే రైతు దంపతులు ఆ రహదారికి ఇరువైపులా ఉన్న మట్టితో ఆ గుంతలను పూడ్చి శ్రమదానం చేశారు.

పేదల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం

.జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రజా ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా పార్టీ కార్యాలయం మోతే రోడ్డు లో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గజంగి నందయ్య ఆధ్వర్యంలో వెయ్యి రోజుల ప్రజా పాలన సంబరాలు నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరై కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులతో కలిసి కేక్ కట్ చేసి జగిత్యాల కాంగ్రెస్ పార్టీ నాయకులకు కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ గారు. మాట్లాడుతూ....ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలనను పునర్నిర్మిస్తూ, సంక్షేమాన్ని విస్తరిస్తూ, సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తూ తెలంగాణ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోంది అన్నారు. రైతులకు భరోసా, మహిళలకు సాధికారయువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు, సామాజిక న్యాయానికి ప్రాధాన్యంప్రపంచస్థాయి మౌలిక వసతుల నిర్మాణం, భారీ పెట్టుబడులకు ప్రోత్సాహం, భవిష్యత్తు తెలంగాణకు బలమైన పునాది వేస్తూ సంక్షేమం నుంచి అభివృద్ధి వరకు, ప్రజల ఆకాంక్షలను నిరంతరం నెరవేర్చడానికి 1000 రోజుల ప్రజాపాలన రాష్ట్ర ప్రగతిలో ఒక ముఖ్యమైన మైలురాయి అని అన్నారు..సన్నబియ్యం, విద్యార్థులకు డైట్ ఛార్జీల పెంపు, 21వేల కోట్ల రుణమాఫీ, ఉచిత బస్సు, 9రోజుల్లో 9వేల కోట్ల రైతు భరోసా, 38వేల కోట్ల కాళేశ్వర ప్రాజెక్ట్ వడ్డీ చెల్లింపు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, తెలంగాణ మోడల్ స్కూల్, విద్య, వైద్యం, ఎ టి సి సెంటర్ లు, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత కరెంట్, ఇలా అనేక కార్యక్రమాలు అమలు చేయడం జరిగింది .గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను అమలు చేస్తూ నూతన సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి గారు అమలు చేస్తున్నారు. రాష్ట్రాన్ని అప్పుల మయంగా గత ప్రభుత్వం మార్చినా వడ్డీ చెల్లిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి అమలు చేస్తున్నారు. వెంటిలేటర్ పై ఉన్న కాంగ్రెస్ పార్టీ కి ఆక్సిజన్ లా రేవంత్ రెడ్డి పార్టీ నీ అధికారం లోకి తీసుకువచ్చారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలి..ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ముఖ్యమంత్రి గారి సారథ్యం లో జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధి కీ నిరంతరం కృషి చేస్తా అన్నారు. వచ్చే ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి రావడం తథ్యం అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం తో పేద ప్రజల సొంత ఇంటి కల నెరవేరింది. సీనియర్ నాయకులు పనిగట్టుకొని విమర్శించినా చంద్రబాబు, కేసీఆర్ రెండు పర్యాయాలు సీఎం గా అయ్యారని రేవంత్ రెడ్డి కూడా అవుతారని అన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన

పారదర్శకంగా పరిశీలన పూర్తి చేయాలి

అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

జగిత్యాల మండలం మోతె గ్రామంలో ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) కింద వచ్చిన దరఖాస్తులను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బి. రాజ గౌడ్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మోతె గ్రామంలో ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి అందిన దరఖాస్తుల్లో పేర్కొన్న వివరాలను సంబంధిత స్థలాల్లో పరిశీలించారు. దరఖాస్తుదారులు సమర్పించిన వివరాలు, స్థల పరిస్థితి, లేఅవుట్‌కు సంబంధించిన అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనను ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో వాస్తవ పరిస్థితులను పూర్తిగా నమోదు చేసి, అర్హత కలిగిన దరఖాస్తుల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దరఖాస్తుల పరిశీలనలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పురోగతి, క్షేత్రస్థాయి పరిశీలనకు సంబంధించిన వివరాలను టీపీఓ శ్రీనివాస్, ఎంపీఓ వాసవి తదితర అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీపీఓ శ్రీనివాస్, ఎంపీఓ వాసవి, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పాత బస్టాండ్ లో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాసిన మాజీ మంత్రి జీవన్ రెడ్డి

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



జగిత్యాల పట్టణంలో పాత బస్టాండ్ లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పెండింగ్ లో ఉన్న పెట్రోల్ బంకు ఏర్పాటు చేయాలని, అలాగే పెట్రోల్‌డీజిల్ అవుట్‌లెట్ కేటాయింపుల్లో చోటుచేసుకున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి, మున్సిపాలిటీకి చెందిన విలువైన భూములను ఆక్రమణదారుల నుంచి కాపాడాలని బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డికి లేఖ ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని పాత బస్ స్టాండ్ కూడలిలో పోలీస్ శాఖ కుటుంబాల సంక్షేమార్థం,వాహనదారుల సౌకర్యం కోసం పెట్రోల్ పంప్ ఏర్పాటు చేసేందుకు టెండర్ ప్రక్రియ చేపట్టి మూడేళ్లు దాటుతున్నా నేటికీ తుది నిర్ణయం తీసుకోలేదని ఆయన పేర్కొన్నారు.దీనికి విరుద్ధంగా,ప్రస్తుత ప్రెస్ క్లబ్ ఆవరణలోని రెవెన్యూ శాఖకు చెందిన స్థలాన్ని ఎలాంటి విధివిధానాలు లేదా పారదర్శక టెండర్ ప్రక్రియ లేకుండా జిల్లా కలెక్టర్ ఏకపక్షంగా కేటాయించారని ఆరోపించారు.సాధారణంగా 10 అడుగుల వెడల్పు ఉన్న షాపులకే నెలకు 25,000 అద్దె వసూలుచేస్తుండగా,66 అడుగుల వెడల్పు ఉన్న విలువైన స్థలాన్ని కేవలం నెలకు 72,000 రూపాయలకే,కేటాయించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.అలాగే,న్యూ బస్ స్టాండ్ సమీపంలోని మున్సిపాలిటీకి చెందిన సర్వే నంబర్ 138లోని 020 గుంటల స్థలంలో కేవలం 004 గుంటలు మాత్రమే పెట్రోల్ పంప్‌కు కేటాయించగా,మిగిలిన 016 గుంటల భూమిని ఇతరులు వాణిజ్య అవసరాలకు ఆక్రమించుకున్నారని తెలిపారు.ఈ ఆక్రమణలపై ఉమ్మడి ఏపీ హైకోర్టు డివిజన్ బెంచ్ స్థలాన్ని మున్సిపాలిటీ స్వాధీనం చేసుకోవాలని తీర్పు ఇచ్చినప్పటికీ,15 ఏళ్లు గడుస్తున్నా స్థానిక అధికారులు చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు.ఈ నేపథ్యంలో,సర్వే నంబర్ 138లోని 016 గుంటల మున్సిపల్ స్థల ఆక్రమణలను తక్షణమే తొలగించి స్వాధీనం చేసుకోవాలని,పాత బస్ స్టాండ్ వద్ద పోలీస్ శాఖ పెట్రోల్ అవుట్‌లెట్ ఏర్పాటుపై సత్వర నిర్ణయం తీసుకోవాలని కోరారు.అదేవిధంగా,పురాతన తహశీల్దార్ భవనాన్ని తొలగించి టెండర్ లేకుండా నామమాత్రపు అద్దెకు ప్రభుత్వ ఆస్తిని కట్టబెట్టడంపై ఉన్నత స్థాయి విచారణ జరిపి ప్రభుత్వ ఆస్తులను పరిరక్షి చాలని జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

జగిత్యాల రూరల్ లో ఉద్యోగుల నల్ల బ్యాడ్జీల నిరసన

జగిత్యాల,రూరల్ ప్రభాతవార్త:



రాష్ట్ర జేఏసీ,జగిత్యాల జిల్లా శాఖ పిలుపుమేరకు మంగళవారం రోజున జగిత్యాల రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ఉద్యోగ,ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.సెప్టెంబర్ 1న "పెన్షన్ విద్రోహ దినం"గా పాటిస్తూ భోజన విరామ సమయంలో కార్యాలయ ఆవరణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.పాత పెన్షన్ విధానాన్ని తక్షణమే పునరుద్ధరించాలని,సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని ఉద్యోగుల పాత డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో జగిత్యాల రూరల్ మండల పరిషత్ కార్యాలయ సమస్త సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు,జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బంది,ఈపంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.బాధ్యులు మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన కోరికలను ప్రభుత్వం వెంటనే నిరవేర్చాలని విజ్ఞప్తి చేశారు.

తహసీల్దార్ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన

చెన్నారావుపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త

చెన్నారావుపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉద్యోగులు, మంగళవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలనే లక్ష్యంతో ఉద్యోగుల జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు మధ్యాహ్న భోజన సమయంలో ముందుగా ఉద్యోగులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓపీఎస్ విధానం కల్పిస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం మాట నిలుపుకోవాలన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు ఒకసారి గెలిస్తే జీవితాంతం పెన్షన్ తీసుకుంటారని, తాము 40 సంవత్సరాలు ఉద్యోగంలో ఉంటే పెన్షన్ కల్పించడం లేదన్నారు.

అక్టోబర్ నెలాఖరులోగా జలసిరి పనులు పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

జలసిరి కార్యక్రమ పనుల పురోగతిపై సమీక్షా సమావేశం



పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త: గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ జలాలను పెంపొందించేందుకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణ జలసిరి పనులను అక్టోబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో తెలంగాణ జలసిరి కార్యక్రమం పనుల పురోగతిపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించామని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామాల వారీగా పంట కుంటలు, ఇంకుడు గుంతలు, బోర్‌వెల్ రీచార్జ్ గుంతల నిర్మాణ లక్ష్యాలు, ఇప్పటివరకు సాధించిన ప్రగతిని సమీక్షించామని పేర్కొన్నారు. వీబీజీ రాంజీ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటూ భూగర్భ జలాలు పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. ప్రస్తుతం పనుల పురోగతి ఆశించిన స్థాయిలో లేదని, అధికారులు మరింత బాధ్యతగా వ్యవహరించి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని స్పష్టం చేశారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, పొలాల్లో పంట కుంటలు, బోర్‌వెల్స్ వద్ద రీచార్జ్ గుంతల ఏర్పాటుకు పకడ్బందీ ప్రణాళిక ఉండాలని సూచించారు. అవసరమైన అనుమతులు వెంటనే మంజూరు చేసి పనులు ప్రారంభించాలని, ప్రారంభం కాని వాటిని వెంటనే పట్టాలెక్కించాలని ఆదేశించారు. వర్షపు నీటి సంరక్షణలో జలసిరి కార్యక్రమం కీలకమని, నాణ్యతా ప్రమాణ్యతో పనులు వేగవంతం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ నరేందర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళింది, జిల్లా పంచాయతీ అధికారి శ్రీమల, ఎంపీడీవోలు, మండల పంచాయతీ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దేశ రైతంగాన్ని రక్షించుకుందాం

నల్లబెల్లి, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త

కార్పొరేట్ గద్దల నుండి వ్యవసాయ రంగాన్ని కాపాడుకుంటూ దేశ రైతాంగాన్ని రక్షించుకుందామని అఖిలభారత రైతుకూలీ సంఘం నర్సంపేట డివిజన్ అధ్యక్షుడు గడ్డి కృష్ణ పేర్కొన్నారు. మండలంలోని గొల్లపల్లి గ్రామంలో రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ. దేశంలో మూడోసారి అధికారాన్ని చేపట్టిన మోడీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా దెబ్బతీసే విధానాలను అవలంబిస్తుందని ఆయన దుయ్యబట్టారు. రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తీసుకువచ్చి రైతుల నడ్డి విరిచిందని ఇది గమనించిన దేశ రైతాంగం కరోనా సమయాన్ని సైతం లెక్కచేయకుండా పోరాటాలు చేసిందని ఆయన గుర్తు చేశారు. ఈ పోరాటాలకు తలోగ్గిన మోడీ ప్రభుత్వం ఆ రైతు నల్ల చట్టాలను ఉపసంహరించుకుంటున్నామని ప్రకటించి తిరిగి దొడ్డిదారిన అమలు చేయడానికి ప్రయత్నం చేస్తుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే దేశంలో ఉన్న చిన్న కారు రైతాంగం అనేక రకాల ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పండించిన పంటలకు సరి అయిన గిట్టుబాటు ధరలు కల్పించకుండా ఇబ్బందులకు గురి చేస్తూ స్వామినాథన్ కమిషన్ సిఫారసులను సైతం చేయకపోవడం బాధాకరమన్నారు. ఇలాంటి రైతన్న సమస్యలను పరిష్కారం కోసం ఈనెల 8,9, తేదీలలో మంచిరాల పట్టణంలో జరిగే ఏఐకేఎంఎస్ రాష్ట్ర మహాసభలను ఏర్పాటు చేయడం జరిగిందని ఈ మహాసభలకు రైతాంగం అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు అనంతరం సభకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు ఎల్లబోయిన ఐలన్న, రాజబోయిన సాంబన్న, సలుపాల రమేష్, పనికర రవి, నరేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

ఖానాపురం, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త

మండలంలోని మనుబోతులగడ్డ నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు సర్పంచ్ ఆబోతు శ్రీలత అశోక్ యాదవ్ ఆధ్వర్యంలో ఏడికి విన్నవించారు. గ్రామంలో తీగలు వేలాడుతున్నాయని, స్తంభాలు శిథిలావస్థలో ఉన్నాయని, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోందని, విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన విద్యుత్ లైట్లు 15 రోజులుగా రావడం లేదన్నారు. వీలైనంత తొందరలో సమస్యలను పరిష్కరిస్తామని ఏడీ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ ఏయి, మాజీ సొసైటీ డైరెక్టర్ ఆబోతు అశోక్ యాదవ్, సొసైటీ డైరెక్టర్ శివరాత్రి వెంకన్న, ఁ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ బీజేపీ కార్యాలయంపై దాడికి పాల్పడటం సిగ్గుచేటు

బీజేవైఎం నాయకులు ఎర్రోళ్ల శ్రీకాంత్

పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బీజేవైఎం రాస్తారోకో, ఆందోళన



పెద్దపల్లి, ప్రభాతవార్త: ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ బీజేపీ కార్యాలయంపై దాడికి పాల్పడటం సిగ్గుచేటని బీజేవైఎం నాయకులు ఎర్రోళ్ల శ్రీకాంత్‌విమర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ పార్టీకి చెందిన గూండాలు దాడికి పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తూ నిరసన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం బస్టాండ్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ జెండాలను దహనం చేసి, రాస్తారోకో చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాస్వామ్య విలువలను, ప్రతిపక్ష పార్టీల హక్కులను కాలరాస్తూ దాడులకు పాల్పడటం సిగ్గుచేటని బీజేవైఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై జరిగిన దాడి ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా వారు అభివర్ణించారు. రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేకనే కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇలాంటి దాడులతో బీజేపీ శ్రేణులను భయపెట్టడం కాంగ్రెస్ పార్టీ వల్ల కాదని, ప్రజాస్వామ్య పద్ధతుల్లో కాంగ్రెస్ పార్టీ అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగడతామని స్పష్టం చేశారు. విద్యార్థులకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని బీజేవైఎం నాయకులు డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులను ఆలస్యం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని వారు ఆరోపించారు. ఫీజులు చెల్లించలేక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం తక్షణమే బకాయిలను విడుదల చేసి విద్యార్థుల విద్యాభవిష్యత్తుకు భరోసా కల్పించాలని కోరారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడాల్సిన ప్రభుత్వం రాజకీయ కక్షలకు తావివ్వకుండా, బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే చెల్లించి, వారి సమస్యలను పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పెద్దపల్లి పట్టణ అధ్యక్షులు కౌన్సిలర్ పెండ్లర్ల రాకేష్, బీజేపీ మండల అధ్యక్షులు, సర్పంచ్ వేల్పుల రమేష్, బీజేవైఎం నాయకులు కూసనపల్లి మధుకరన్ భగవత్, బీజేవైఎం మండల అధ్యక్షుడు రేండ్ల వేణు, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి గుడ్ల సతీష్, మండల ప్రధాన కార్యదర్శి మామిడి ఉమేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి సురేందర్, బీజేపీ నాయకులు పోగుల రాజు, సిలివేరి మహేష్, కుక్క అంజి, ముక్కెర కుమార్, వెలిచల నితిన్ తదితరులు పాల్గొన్నారు.

బిజెపి కార్యాలయంపై దాడి సరైనది కాదు

నర్సంపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త

బీజేపీ రాష్ట్ర పార్టీ కార్యాలయంపై దాడి చేయడంతో పాటు నల్గొండ జిల్లా బీజేపీ అధ్యక్షుల ఇంటిపై దాడిని బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డా. గోగుల రాణా ప్రతాప్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. మంగళవారం నర్సంపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ దిష్టిబొమ్మ దహనం కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయంగా బీజేపీని ఎదుర్కొనే ధైర్యం లేకనే కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రజల తీర్పును గౌరవించాలి తప్ప, ప్రత్యర్థి పార్టీ కార్యాలయాలపై దాడులు చేయడం, నాయకుల ఇళ్లపైకి వెళ్లి భయభ్రాంతులకు గురిచేయడం ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. ఈ కార్యక్రమంలో 28వార్డ్ కౌన్సిలర్ జూలూరి రోజా రాణి, పార్లమెంట్ కొకన్వీనర్ కట్ల రాంచేందర్ రెడ్డి, ,జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి జీవన్, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్,నియోజకవర్గ నాయకులు జూలూరి మనిష్ గౌడ్, నర్సంపేట పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్, రూరల్ అధ్యక్షులు తనుగుల అంబేద్కర్, నల్లబెల్లి మండల అధ్యక్షులు తడుక వినయ్ గౌడ్ ,నెక్కొండ మండల అధ్యక్షులు నాయిని అశోక్, దుగ్గొండి మండల అధ్యక్షులు రాజేందర్, చెన్నారావుపేట మండల అధ్యక్షులు శేఖర్, సినియర్ నాయకులు కోమల్ రెడ్డి, అబోతు రాజు, బాల్నే జగన్, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ 6 గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయాలి -బీఆర్ఎస్

ఓదెల,ప్రభాతవార్త:

ఓదెల కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి మనోహర్ రెడ్డి ఆదేశాల మేరకు ఓదెల మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించి ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షులు మ్యాడగోని శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. మహిళలకు నెలకు రూ.2,500, వృద్ధులు, బీడీ కార్మికులకు రూ.4,000, దివ్యాంగులకు రూ.6,000 పెన్షన్, రైతు భరోసా, రూ.2 లక్షల రుణమాఫీ, వరికి రూ.500 బోనస్, నిరుద్యోగ భృతి, విద్యార్థులకు విద్యా భరోసా కార్డు, కల్యాణలక్ష్మి /షాదీ ముబారక్ కింద తులం బంగారం తదితర హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు.హామీల అమలులో ప్రభుత్వం విఫలమైతే ప్రజల పక్షాన బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు గుండేటి మధు యాదవ్, గోవిందుల ఎల్ల స్వామి, ఓజ్జా శ్రీనివాస్ మాజీ ఎంపిటిసి రౌతు జలపతి బీఆర్ఎస్ ఓదెల గ్రామ అధ్యక్షుడు పోలోజు రమేష్, పెద్దపల్లి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్బి బోడకుంట నరేష్, మాజీ ఉపసర్పంచ్ తీర్థల కుమార్, నాయకులు గిద్దమారి రమేష్, చింతం మొగిలి, అంబాల కుమార్ ఎండి సర్వర్, బోగే సదానందం, రాచర్ల కుమార్, గడ్డం శ్యామ్, వివిధ గ్రామా అధ్యక్షులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ కుల గణన శాస్త్రీయంగా జరగాలి

నర్సంపేట, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త

2027లో నిర్వహించతలపెట్టిన బీసీ కుల గణన శాస్త్రీయంగా నిబద్ధతతో జరగాలని లేనిచో బీసీలకు మరో దశాబ్ద కాలం తీవ్ర అన్యాయం జరిగే అవకాశం ఉందని బీసీ దళపతి డా.పరికిపండ్ల అశోక్ అన్నారు. మంగళవారం పట్టణంలోని వనప్రేమి అవార్డు గ్రహీత గోక రామస్వామి ఆధ్వర్యంలో కుల గణనపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ 80 సంవత్సరాల స్వాతంత్ర్య భారత దేశంలో కుల గణన జరుగుతుందని అన్నారు. ప్రతి కులానికి ప్రత్యేక కోడ్ అమలు చేయాలని, శాస్త్రీయ డ్రాప్‌డౌన్ విధానం అమలు చేయాలని అన్నారు. జాతీయ జనగణనలో కుల గణనను శాస్త్రీంగా పారదర్శకంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. రిజిస్టర్ జనరల్ ఆఫ్ ఇండియా 2026 ఆగస్టు 18న విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, కేటగిరిలను స్పష్టంగా పేర్కొనకపోవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. కులగణను ఓపెన్ ఎండెడ్ విధానంలో నిర్వహిస్తే ఒకే కులం వివిధ పేర్లు, పర్యాయ పదాలు, ప్రాంతీయ మండలికాలు, ఉపకులాల పేర్లతో నమోదయ అవకాశం ఉందని దీని వల్ల తుది డేటాలో గందరగోళం ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. 2011లో అప్పగి కేంద్ర ప్రభుత్వం జరిపిన జనాభ లెక్కల్లో ఇదే జరిగిందన్నారు. మరోసారి ఓబీసీలు అన్యాయం భారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలిన బీసీ కులస్తులందరు ఈ అన్యాయాన్ని ఎదుర్కోవడం కోసం ఒకటి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ బీసీ సంఘాల నాయకులు, ప్రముఖ కవి రచయిత, మంద వీరస్వామి, మాజీ కౌన్సిలర్ గుంటి కిషన్, డా.స్పూర్తి, పి.సహజ, విద్యాసాగర్, డా.శివుడు, వెంకట్‌గౌడ్, కుమార్, వెంకన్నయాదవ్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

నల్లబెల్లి, సెప్టెంబర్ 1, ప్రభాతవార్త

ప్రజా పాలన రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడం మన అందరి బాధ్యతని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మాలోతు చరణ్ సింగ్ పేర్కొన్నారు. మండలంలోని ఆసరెల్లి గ్రామంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు జలగం రాజు అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న చరణ్ సింగ్ మాట్లాడుతూ గ్రామంలో ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తను నాయకులను కలుపుకొని పనిచేసుకుంటూ పార్టీని బలోపేతం చేసే విధంగా పనిచేయాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ పార్టీ మీద తప్పుడు ప్రచారాలు చేసేవారికి దీటుగా సమాధానం చెబుతూ మన పార్టీ జరిపే అభివృద్ధి ప్రభుత్వ పథకాలను గ్రామ ప్రజల్లోకి ఎప్పటికప్పుడు తీసుకువెళ్లాలని ఆయన కోరారు. ప్రతి కార్యకర్తను కాపాడుకుంటూ ముందుకు వెళితేనే మన పార్టీ బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.అలాగే రాబోయే సంస్థ గత ఎన్నికలలో మన పార్టీ ముందంజలో ఉండేటట్టు పార్టీని నిర్మించాలని స్థానిక నాయకులను కార్యకర్తలను ఆయన కోరారు. అనంతరం ఆసరవెల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్గా అజ్మీర వీరన్నను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది అన్నారు.

రోడ్డుపై బైఠాయించిన చిరువ్యాపారులు.. పోలీసుల జోక్యంతో..

జమ్మికుంట/ హుజురాబాద్, ప్రభాతవార్త:

కరీంనగర్ జిల్లా వ్యాపారకేంద్రమైన జమ్మికుంటలో ప్రతి వారం నిర్వహించే వారసంతాలో అనేక ప్రాంతాల నుండి చిరువ్యాపారులు వస్తుంటారు. పట్టణ ఈ ప్రాంత వ్యాపారులతో పాటు బయట నుండి వచ్చే వ్యాపారుల సంఖ్య అధికం కావడం.. రోడ్లపై జనసాంద్రత పెరగడం.. ఇంతకాలంగా నిర్వహించిన కొండూర్ కాంప్లెక్స్ ఆవరణలో ప్రైవేట్ విద్యాసంస్థలు, బ్యాంకులు, ప్రైవేట్ ఆసుపత్రులు, పెద్ద పెద్ద వ్యాపార కేంద్రాలు అధికం కావడంతో జనరద్దీ పెరిగి ఆ ప్రాంత వాసులకు ఇబ్బందిగా మారడంతో జమ్మికుంట మున్సిపాలిటీ పాలకవర్గం 15రోజుల క్రితం శివాలయంలో వెనుకాల ఉన్న వ్యవసాయ మార్కెట్ రోడ్డు ప్రాంతానికి వారసంతాను మార్చింది. దీనితో తమకు అనుకూలంగా లేదంటూ చిరువ్యాపారులు మంగళవారం సంతా ఉండడంతో శివాలయం ఎదురుగా ఉన్న జమ్మికుంట-వీణవంక రోడ్డుపై బైఠాయించి ఆందోళనకు దిగారు. దీనితో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సంఘటన తెలుసుకున్న జమ్మికుంట పోలీసులు హుటాహుటిన తరలివచ్చి రోడ్డుపై బైఠాయించిన



చిరువ్యాపారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసారు. అయినప్పటికి పట్టణ వ్యాపారులు ఆందోళన విరమించకపోవడంతో ఈ విషయాన్ని జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్‌కుమార్ (దిలీప్), కమీషనర్ మల్లిఖార్జున స్వామి దృష్టికి తీసకెళ్లారు. వారసంతాపై ఆలోచన చేస్తామని ఆందోళన విరమించాలని వారు కోరడంతో వ్యాపారులు సమ్మతించారు.

పెన్షన్ బిక్ష కాదు .. ఉద్యోగుల హక్కు

యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ముల్కల విజయ్ కుమార్

చొప్పదండి,ప్రభాతవార్త:

పదవి విరమణ అనంతరం ఉద్యోగుల ఆర్థిక భద్రతకు శాపంగా మారిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం రద్దు చేయాలని టీజీఈ జెఏసి పిలుపు మేరకు మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు కళాశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఉద్యోగులు ఉపాధ్యాయులు తమ నిరసన వ్యక్తం చేశారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ముల్కల విజయ్ కుమార్ మాట్లాడుతూ 2004లో అప్పటి వైఎస్ సర్కార్ సెప్టెంబర్ 1న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ సీపీఎస్‌ను వర్తింపజేస్తూ జీవో653 జారీ చేసి రాష్ట్రంలోని ఉద్యోగులందరినీ రోడ్డున పడేసిందన్నారు.అసెంబ్లీ ఎన్నికల ముందు సీపీఎస్‌ను రద్దుచేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు గడిచినప్పటికీ మౌనం పాటిస్తుందన్నారు.2003లో నోటిఫికేషన్లు విడుదలై,ఆతర్వాత నియమితులైన



ఉద్యోగులకు పాత పింఛన్ అమలు చేయాలని ఇటీవలే హైకోర్టు తీర్పునిచ్చినా సర్కార్ ఖాతరు చేయడం లేదన్నారు.సీపీఎస్‌ను రద్దు చేస్తామన్న హామీతో రాజస్థాన్,ఛత్తీస్‌గఢ్, హిమాచల్‌ప్రదేశ్‌లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాలు సీపీఎస్‌ను రద్దు చేశాయని కానీ,తెలంగాణలో రద్దు చేయక పోవడంతో ఉద్యోగుల్లో అసహనం, ఆగ్రహజ్వాలలు మిన్నంటుతున్నందున వెంటనే సిపిఎస్ ను రద్దుచేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించి ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

కోరుట్లలో ఘనంగా ఎల్ఐసి 70వ వార్షికోత్సవం

కోరుట్ల, ప్రభాతవార్త:



పట్టణంలోని ఎల్ఐసి శాటిలైట్ శాఖ కార్యాలయంలో ఎల్ఐసి 70వ వార్షికోత్సవం వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పూలతో అలంకరించిన ఎల్ఐసి 70 లోగోను ఆవిష్కరంచారు. ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ కె . మోహన కృష్ణ జ్యోతి ప్రజ్వలన దేశ ప్రజలకు జీవిత భీమ, ఆర్థిక భరోసా గత 70 ఏళ్లుగా ఎల్ఐసి సేవా దృక్పథంతో అందించిందన్నారు. ఈ సందర్భంగా సీనియర్ విశ్రాంత ఉద్యోగాని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసిశాటిలైట్ శాఖ బ్రాంచ్ మేనేజర్ కె. మోహనకృష్ణ, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఎండి అక్బర్, విశ్రాంత ఉద్యోగి శివరాజు, డి.ఓ. రజనికాంత్ చీఫ్ అడ్వయిజర్స్ ఏలేటి లక్ష్మారెడ్డి, జి. కృష్ణ హరి, ఎ. నాగభూషణం అధికారులు, ఏజేంట్లు సిబ్బంది" పాల్గొన్నారు.

కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ నిరసన

వేములవాడ ప్రభాతవార్త:

కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు తెలిపారు.ఉదయం 11 గంటలకు కోరుట్ల బస్టాండ్ నుంచి తెలంగాణ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించి, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలపై భారీ ప్లెక్సీ ప్రదర్శన, బాకీ కార్డుల పంపిణీ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం తెలంగాణ చౌక్‌లో నిరసన కార్యక్రమం, మీడియా సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలపై చైతన్యం కల్పించేందుకే కార్యక్రమం చేపడుతున్నట్లు చల్మెడ తెలిపారు.

బిజెపి రాష్ట్ర కార్యాలయంపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

కోరుట్ల, ప్రభాతవార్త :



బిజెపి రాష్ట్ర కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ నాయకుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని పెండెం మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పెండం గణేష్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయన పగటిపూటే బిజెపి కార్యాలయ గేటుకు నల్లరంగు వేస్తూ, ప్రధానమంత్రి దిష్టిబొమ్మను దహనం చేస్తుంటే పోలీసులు ప్రేక్షకుల్లా చూస్తుండటం సరికాదన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేక, ప్రశ్నిస్తున్న బీజేపీపై భౌతిక దాడులకు దిగడం కాంగ్రెస్ పార్టీ దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు. బిజెపి కార్యకర్తల సహనాన్ని చేతకానితనంగా భావించవద్దని,చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్న ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకోవాలని,లేదంటే బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున్న ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

ఎస్సీ,ఎస్టీ కమిషన్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు

తంగళ్ళపల్లి,ప్రభాతవార్త:



రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనకు వచ్చిన ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కాంగ్రెస్ నేతలు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ కు నాయకులు ఘనంగా స్వాగతం పలికారు.నియోజకవర్గంలోని ఎస్సీ,ఎస్టీలకు సంబంధించిన పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు కాంగ్రెస్ నేతలు తెలిపారు.సమస్యలను పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని కమిషన్ చైర్మన్ హామీ ఇచ్చినట్లు నాయకులు వెల్లడించారు.కమిషన్ చైర్మన్‌ను కలిసిన వారిలో ఏఎంసీ డైరెక్టర్ బాలు,కాంగ్రెస్ పార్టీ మానవ హక్కుల యువజన విభాగం జిల్లా అధ్యక్షులు గుగ్గిళ్ళ భరత్ గౌడ్,యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు కోసం పీఆర్టీయూ టీఎస్ ధర్నా

వేములవాడ,ప్రభాతవార్త:



సీపీఎస్ రద్దు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన ధర్నాకు వేములవాడకు చెందిన ఉపాధ్యాయ సంఘం నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేసి తన నిబద్ధతను చాటుకోవాలని కోరారు.పెండింగ్‌లో ఉన్న 6 డీఏలను వెంటనే ప్రకటించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రెండో పీఆర్సీని దసరాలోపు ప్రకటించాలని డిమాండ్ చేశారు.విద్యాశాఖలో పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల పదోన్నతులను తక్షణమే చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షులు చిప్ప యాదగిరి,మానువాడ శంకర్, చిట్నేని శ్రీకాంత్‌రావు,గోశిక మధు,జిల్లా అసోసియేటెడ్ అధ్యక్షులు మడిశెట్టి మహేష్, వేములవాడ మండల అధ్యక్షుడు కోతోజు రమేష్, ప్రధాన కార్యదర్శి గడప మధుకర్,కార్యవర్గ సభ్యులు గడ్డం రాజేశం,జి.రఘునాథ్ పాల్గొన్నారు.

వేములవాడ నియోజకవర్గంలో సైన్స్ ల్యాబ్‌లకు రూ.1.56 కోట్లు


వేములవాడ, ప్రభాతవార్త:

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయోగాత్మక విద్యను ప్రోత్సహించేందుకు వేములవాడ నియోజకవర్గంలోని ఆరు పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్ గదుల నిర్మాణానికి రూ.1.56 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఒక్కో పాఠశాలకు రూ.26 లక్షల చొప్పున నిధులు కేటాయిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. రుద్రవరం జెడ్పీహెచ్ఎస్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, మల్యాల, సుద్దాల, కట్లకుంట, గోవిందారం జెడ్పీ ఉన్నత పాఠశాలలకు ఈ నిధులు మంజూరయ్యాయి. పాఠశాలల్లో మౌళిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని అధికారులు తెలిపారు. సైన్స్ ల్యాబ్‌లకు నిధులు మంజూరు చేయడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వేములవాడలో రోడ్డు ప్రమాదం

- నలుగురికి గాయాలు

వేములవాడ,ప్రభాతవార్త:



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో మంగళవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కొండగట్టు దర్శనం అనంతరం వేములవాడ మీదుగా కామారెడ్డి వెళ్తున్న భక్తుల కారు, జగిత్యాల బస్టాండ్ వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. క్షతగాత్రులను వెంటనే అంబులెన్స్‌లో వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారు హైదరాబాద్‌కు చెందినవారిగా పోలీసులు గుర్తించారు. ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

ఆదర్శ రెడ్డి సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్ రెడ్డి

తంగళ్ళపల్లి,ప్రభాతవార్త



తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామంలో ఆదర్శ రెడ్డి సంఘం అధ్యక్ష ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది.సంఘ సభ్యులందరి మద్దతుతో రెండోసారి అధ్యక్షుడిగా ఇట్టి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి మంగళవారం ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు ఇట్టి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రెండోసారి అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.సంఘ అభివృద్ధికి, సభ్యుల సంక్షేమా నికి కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆదర్శ రెడ్డి సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘం కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవ వేడుకలు

కోరుట్ల, ప్రభాతవార్త:



కోరుట్ల పట్టణ శివారు కోనరావుపేట రోడ్డులో కోరుట్ల పద్మశాలి సంఘం కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవ వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావులు భూమి పూజ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోరుట్ల పట్టణ పద్మశాలి సంఘ కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవ



వేడుకల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం పద్మశాలి కులోన్నతి సంక్షేమ సంఘం అధ్యక్షులు గుంటుక ప్రసాద్ వారిని శాలువాలతో సన్మానించారు. ఈ మేరకు చేపట్టిన అన్నదాన కార్యక్రమాన్ని నాయకులు ప్రారంభించారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాఘవేంద్ర, మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు కొంతం



రాజం, కోరుట్ల నియోజకవర్గ యువజన కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఏలేటి మహిపాల్ రెడ్డి, కౌన్సిలర్ దాసరి సునీత రాజశేఖర్, నాయకులు రుద్ర శ్రీనివాస్, ఆడెపు మధు, దాసరి రాజశేఖర్, జిల్లా ధనుంజయ్, పద్మశాలి కులోన్నత సంక్షేమ సంఘం యువత అధ్యక్ష, కార్యవర్గం, పద్మశాలి సంక్షేమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు .

ఈనెల 17లోపు తెలంగాణ ఉద్యమకారుల హామీలు నెరవేర్చాలి

తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ జిల్లా చైర్మన్ గజ్జెల దేవరాజు

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త :

తెలంగాణ ఉద్యమకారుల హామీలను ఈనెల 17న లోగా పరిష్కరించాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ గజ్జెల దేవరాజు అన్నారు.జిల్లా కేంద్రంలోని బి వై నగర్‌కు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు రామచంద్రం అనారోగ్యంతో ఇంటికే పరిమితమైన విషయం తెలుసుకుని ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం ఆయనను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో రామచన్ద్ర కీలక పాత్ర పోషించారని, రిలే నిరాహార దీక్షలు, సకల జనుల సమ్మె, వంటావార్పు వంటి అనేక కార్యక్రమాల్లో పాల్గొని తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నిరంతరం పోరాడారని అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, పింఛన్, ఉద్యమకారులపై ఉన్న కేసుల ఎత్తివేత,



మరణించిన ఉద్యమకారుల కుటుంబాలకు పింఛన్ , కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం వంటి హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికీ కమిటీల పేరుతో కాలయాపన చేయడం సరికాదన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరగని పోరాటం చేసిన ఉద్యమకారులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే గుర్తించి, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాజన్న సిరిసిల్ల జిల్లా చైర్మన్ గజ్జెల దేవరాజ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫణిరాజారావు , మాజీ సర్పంచుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు అక్కెనపెల్లి కరుణాకర్,కుసనపెల్లి సరస్వతి, సింగారం దేవరాజు,కర్నె లక్ష్మీ, గూగులోతు రేనా,పత్తిపాక పద్మశంకర్, మామిడాల రమణ, నేరెళ్ల శ్రీకాంత్ గౌడ్ , ఓదెల శ్రీనివాస్, అప్రోజు, సికిందర్, పవన్, సాయిశరత్, సాయి గౌడ్, చోటు తదితర ఉద్యమకారులు పాల్గొన్నారు .

పల్లగుట్ట అంటే మాకు పంచ ప్రాణం

- గూడూరు గ్రామానికి గుండె కాయ ఈపల్లగుట్ట
- ఈపల్లగుట్టను తవ్వుతున్న కాంట్రాక్టర్లను నిలదిస్తున్నా గ్రామస్తులు
- తవ్వకాలు ఆపకపోతే ఎంతవరకైనా తెగిస్తాం,ఏమైనా చేస్తాంతగ్గేదెలేదు అంటున్న గూడూరు గ్రామస్తులు
- తవ్వకాలను నిలిపి వేయాలని గ్రామస్తుల డిమాండ్

ముస్తాబాద్ ప్రభాతవార్త:



ముస్తాబాద్ మండలం గూడూరు గ్రామానికి అనుకొని వున్న పల్లగుట్ట అంటే మాకు పంచప్రాణం తవ్వకాలను వెంటనే నిలిపివేయకపోతే ఎంత వరకైన తెగిస్తాం,ఏమైనా చేస్తాం,తగ్గేదే లేదు అని గూడూరు గ్రామస్తులు అంటున్నారు.పల్లగుట్టపైన మంగళవారం గూడూరు గ్రామస్తులు శాంతియుత నిరసన కార్యక్రమాము చేపట్టారు.ఈ సందర్భంగా గూడూరు గ్రామస్తులు మాట్లాడుతూ రంగురాళ్ళు వున్నాయని కలరింగ్ వేస్తూ గుట్టను ధ్వంసం చేస్తున్నారు.మా గూడూరు గ్రామానికి గుండెకాయ ఈపళ్లగుట్ట ను ధ్వంసం చేస్తే చూస్తూ ఊరుకోమని గ్రామస్తులు అన్నారు.గుట్టను ధ్వంసము చేస్తే ఒకరు లాభపడతారు.గుట్ట వుంటే 10 గ్రామాలు రక్షణ పొందుతాయని గ్రామస్తులు తమ బాధను మీడియాకు తెలియజేశారు.గుట్టపైన అనేక రకాల జంతువులు జింకలు,కుందేళ్ళు,అడవి పందులు,మల్లికార్జున స్వామి, నరసింహ స్వామి దేవాలయాలు వున్నాయనీ వీటి రక్షణ కొరకు సిరిసిల్ల నియోజక వర్గ ఎమ్మెల్యే కేటీఆర్ చొరవ తీసుకుని తవ్వకాలను వెంటనే నిలిపివేయాలని అన్నారు.ఇప్పుడున్న ప్రభుత్వం మాటల్తో గెలిచి మాకే తూట్లు పొడుస్తున్నారనీ గూడూరు గ్రామ ప్రజలు తమ ఆవేదనను వ్యక్తం చేశారు.ఇందిరా గాంధీ ఆ కాలములో ఈ గుట్టపైన కన్నువేస్తే ఇప్పుడు తవ్వకాలు చేస్తున్నారని గీసా భిక్షపతి అన్నారు.కేటీఆర్,కేకే మహేందర్ రెడ్డిల ఇలాకాలో ఇలా జరగడం చాలా బాధాకరం అని, పార్టీలు వేరైనా ప్రాంతము ఒక్కటేనని భావించి వీరిద్దరూ చొరవ తీసుకొని పల్లగుట్ట తవ్వకాలు నిలిపి వేయాలని మార్వాడి సుదర్శన్ అన్నారు.ఇప్పటికే గూడూరు గ్రామము జిల్లాలో మద్యపాన నిషేధ,ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుకున్నామని,గుట్ట తవ్వకాలతో గ్రామ పర్యావరణం దెబ్బతినే అవకాశం ఉందని గూడూరు మాజీ సర్పంచ్ చాకలి రమేష్ తెలిపారు.ఈ కార్యక్రమములో దళిత లిబరేటివ్ జనరల్ సెక్రటరీ మార్వాడి సుదర్శన్,జిల్లా మాజీ కార్యదర్శి గుంటి వేణు,ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కుర్ర రాకేష్, సి ఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు గీసా భిక్షపతి,అల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి అంబటి జోహోజీ రెడ్డి,గూడూరు గ్రామ మాజీ సర్పంచ్ చాకలి రమేష్,చెరుకు ఏళ్లం,గౌడ సంఘం అధ్యక్షులు సంతోష్, షేక్ అబ్బాస్, గ్రామస్తులు, నాయకులు పాల్గొన్నారు.

విలాసాగర్‌కొదురుపాక ఆటో సేవలు పునఃప్రారంభం

బోయిన్ పల్లి ప్రభాత వార్త

విలాసాగర్ గ్రామ ప్రజల కోరిక మేరకు కొన్ని సంవత్సరాలుగా నిలిచిపోయిన కొదురుపాక-విలాసాగర్,విలాసాగర్ - కొదురుపాక ఆటో సేవలను విలాసాగర్ గ్రామ సర్పంచ్ ఏనుగుల కనకయ్య ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా రిబ్బన్ కట్ చేసి ఆటో సేవలకు శ్రీకారం చుట్టారు,ఈ సందర్భంగా సర్పంచ్ ఏనుగుల కనకయ్య మాట్లాడుతూ,గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందించాలనే ఉద్దేశంతో ఆటో సేవలను తిరిగి ప్రారంభించినట్లు తెలిపారు,ఈ సేవల ద్వారా విద్యార్థులు,రైతులు,ఉద్యోగులు,మహిళలు మరియు సాధారణ ప్రయాణికులకు ఎంతో సౌలభ్యం కలుగుతుందని పేర్కొన్నారు,ఆటో సేవలు పునఃప్రారంభం కావడంతో గ్రామ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.ఈ



కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు దమ్మ వెంకటరమణ,ఆటో యూనియన్ నాయకులు,స్థానిక గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో నిరసన

గంభీరావుపేట, ప్రభాతవార్త:



టీజీఈజేఏసీ పిలుపుమేరకు పెన్షన్ విద్రోహ దినం పురస్కరించుకొని మంగళవారం గంభీరావుపేట మండలంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో పలు పాఠశాలలోని ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ బాధ్యులు మాట్లాడుతూ కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెన్షన్ అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు అని, ఉద్యోగ విరమణ తర్వాత ఆర్థిక భద్రత కల్పించాలని కోరారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో తెలిపిన విధంగా వెంటనే సిపిఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇందు కోసము తెలంగాణ గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు పెన్షనర్ ల తో కూడిన తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో కలిసి పోరాడనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 10 న తలపెట్టిన "చలో హైదరాబాద్" లో అధిక సంఖ్యలో పాల్గొని ఉద్యమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీజీఈజేఏసీ భాగస్వామ్య సంగం డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ సంఘ నాయకులు పాల్గొన్నారు.

సిరిసిల్ల గవర్నమెంట్ హాస్పిటల్ భవనం పైనుంచి దూకిన పెయింటర్

సిరిసిల్ల అర్బన్ ప్రభాతవార్త:



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ హాస్పిటల్‌లో తీవ్ర కలకలం రేగింది. తీవ్ర కడుపునొప్పి భరించలేక, వైద్య సిబ్బంది నిరక్ష్యంతో మనస్తాపం చెందిన ఓ పెయింటర్ హాస్పిటల్ భవనం పైనుంచి కిందకు దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు...గంభీరావుపేట మండలం భీముని మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన గేరుగంటి రాజు వృత్తిరీత్యా పెయింటర్‌గా జీవనం సాగిస్తున్నాడు. తీవ్ర కడుపునొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఉదయం అతడిని సిరిసిల్ల గవర్నమెంట్ హాస్పిటల్‌కు తీసుకొచ్చి చేర్పించారు. అయితే, వార్డులోని నర్సింగ్ సిబ్బంది సమయానికి వైద్యం అందించకుండా నిరక్ష్యం ప్రదర్శించారని, వైద్యం చేయాలని కోరితే దురుసుగా మాట్లాడారని రాజు భార్య కావ్య కన్నీటిపర్యంతమయ్యారు. ఒకవైపు తీవ్రమైన కడుపునొప్పి, మరోవైపు సిబ్బంది నిరక్ష్య వైఖరితో తీవ్ర మనస్తాపానికి గురైన రాజు హాస్పిటల్ భవనం పైనుంచి కిందకు దూకేశాడు. ఈ ప్రమాదంలో అతడి కాళ్లు, ముఖానికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అప్రమత్తమైన బంధువులు, హాస్పిటల్ సిబ్బంది బాధితుడిని స్ట్రెచర్‌పై అత్యవసర విభాగానికి తరలించి చికిత్స ప్రారంభించారు. ప్రస్తుతం బాధితుడు ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

ఘనంగా ప్రపంచ లేఖా రచన దినోత్సవం

చందుర్తి సెప్టెంబర్ 1: ప్రభాతవార్త



చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రపంచ లేఖా రచన దినోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు లేఖా రచనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు తమ స్నేహితులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, బంధువులకు లేఖలు రాస్తూ తమ భావాలను అక్షర రూపంలో వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రజిత మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక యుగంలో లేఖా రచన క్రమంగా కనుమరుగవుతోందని, అయితే లేఖలు రాయడం ద్వారా ఆలోచనా క్రమం, భాషా పరిజ్ఞానం, సృజనాత్మకత, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు పెంపొందుతాయని తెలిపారు. విద్యార్థులు లేఖా రచనను అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం లేఖా రచన పోటీ నిర్వహించి, ఉత్తమంగా రాసిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంపతి రమేష్, అర్చిత, మోనిక పాల్గొన్నారు.

మరణానంతరం నేత్రదానానికి ముందుకు రావాలి : జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త:

మరణానంతరం నేత్రదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలనీ జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు.41వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా ఆగస్టు 25వ తేదీ నుంచి సెప్టెంబర్ 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న 15 రోజుల అవగాహన కార్యక్రమాల్లో భాగంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ నేత్రదానంపై రూపొందించిన అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ కంటి దానం మహాదానం అని మరణానంతరం నేత్రదానం చేయడం ద్వారా ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించే అవకాశం ఉంటుందని తెలిపారు. నేత్రదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించి, ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కుటుంబ సభ్యులతో చర్చించి, మరణానంతరం నేత్రదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యం లో నేత్రదానం



ప్రాముఖ్యత, నేత్రదానానికి సంబంధించిన విధానాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. యువత, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు,స్వచ్ఛంద సంస్థలు, ప్రజలను నేత్రదాన ఉద్యమంలో భాగస్వాములను చేయాలని పేర్కొన్నారు. నేత్రదానం చేయాలనుకునే వారు మరణించిన ఆరు గంటలలోపు సంబంధిత నేత్రదాన కేంద్రం ఫోన్ నెంబర్ 98495 45822 శ్రీనివాస్ కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్ , డీసీహెచ్ఎస్ డాక్టర్ సుభాషిణి, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ నాగేందర్ బాబు, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జిల్లా అంధత్వ నియంత్రణ కార్యక్రమ అధికారి డాక్టర్ నయీమ్‌జహా తదితరులు పాల్గొన్నారు.

దాడులకు పాల్పడితే చూస్తూ ఊరుకోం : బీజేపీ జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి

సిరిసిల్ల టౌన్, ప్రభాతవార్త:

నాంపల్లిలోని భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ, బీజేపీ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ఈరోజు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోనీ అంబేద్కర్ చౌరస్తా వద్ద బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి ఆధ్వర్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ కార్యాలయంపై యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన దాడి అత్యంత అప్రజాస్వామికమైన చర్య అని తీవ్రంగా ఖండించారు. రాజకీయంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో బీజేపీని ఎదుర్కొనే ధైర్యం లేకనే పార్టీ కార్యాలయంపై దాడికి పాల్పడ్డారని విమర్శించారు. ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ రాజకీయాలను ప్రజల మధ్యే కొనసాగిస్తామని తెలిపారు. రాహుల్ గాంధీ చేతిలో రాజ్యాంగాన్ని పట్టుకుని ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం కాదు,రాజ్యాంగ స్ఫూర్తిని పాలనలో, రాజకీయాల్లో ఆచరించాలి అని హితవు పలికారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షాల హక్కులను, ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలని అన్నారు .రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని, అధికార పార్టీకి చెందిన వారు దాడులకు పాల్పడితే పోలీసులు చట్టాన్ని సమానంగా అమలు చేయాలని అన్నారు. లేకపోతే ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం కోల్పోయే



పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి, హరీష్, మీసా సంజీవ్, జిల్లా కోశాధికారి ఆసాని రామలింగారెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు ఉడుగుల యాదగిరి, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు కిరణ్ నాయక్, జిల్లా ధార్మిక సెల్ కన్వీనర్ డాక్టర్ సత్యనారాయణ, సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు దుమాల శ్రీకాంత్, బుర్ర శేఖర్ గౌడ్, అధ్యక్షులు కోడె రమేష్, మల్యాల మారుతి, రేపాక రామచంద్రం, మీర్లాక్కర్ బాలాజీ, మోకిలే విజయేందర్, కర్ర బత్తుల వేణుగోపాల్, బూరుగుపల్లి పరమేష్, సొల్ల క్రాంతి, రాపెల్లి శ్రీధర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల ఉపాధికి మార్గం..

యూనిఫాంలు త్వరితగతిన అందించాలి

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

తంగళ్లపల్లి,ప్రభాతవార్త:



విద్యాలయాల విద్యార్థులకు యూనిఫాంలు కుట్టించడంతో మహిళా సంఘాల ఉపాధికి మార్గం చూపుతుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

బిజెపి కార్యాలయం పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

బీజేపీ మండల అధ్యక్షులు ఎడపల్లి పరుశురాములు

బోయిన్ పల్లి ప్రభాత వార్త

బీజేపీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంపై యువజన కాంగ్రెస్ నాయకులు జక్కిటి శివ చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో దాడికి పాల్పడటాన్ని భారతీయ జనతా పార్టీ బోయినపల్లి మండల శాఖ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామని మండల అధ్యక్షులు ఎడపల్లి పరశురామ్ తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ..కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేయడం, బీజేపీ రాష్ట్ర కార్యాలయ గేటుకు నల్లరంగు పూయడం వంటి చర్యలు కాంగ్రెస్ పార్టీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం. ప్రజాస్వామ్యంలో రాజకీయ ప్రత్యర్థులను విధానాలపై విమర్శించాలి కానీ, కార్యాలయాలపై దాడులు చేయడం, భయభ్రాంతులకు గురిచేయడం ఏమాత్రం సమర్థనీయం కాదు.బీజేపీ రాష్ట్ర కార్యాలయం పైనే పట్టపగలు దాడి జరుగుతుంటే

తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ రెసిడెన్షియల్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాంలు కుట్టించే బాధ్యతను మహిళా సంఘాలకు ఇవ్వగా, జిల్లాలో ఆ ప్రక్రియ కొనసాగుతున్నది.తంగళ్లపల్లి మండలం మండేపల్లిలో శ్రీ రేణుక మాత మహిళాశక్తి టైలరింగ్ సెంటర్లో యూనిఫాంలు మహిళా సంఘాల సభ్యులు కుడుతుండగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మంగళవారం పరిశీలించారు.ప్రతి మహిళా రోజూ ఎన్ని యూనిఫాంలు కుడుతారు ? ఎంత ఆదాయం వస్తుంది.అనే విషయాన్ని జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.తంగళ్లపల్లి మండలంలోని మొత్తం 43 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 3,560 విద్యార్థినీ విద్యార్థులకు 2 జతల చొప్పున ఏకరూప దుస్తులు 4 కేంద్రాల ద్వారా 28 మంది మహిళా సంఘాల సభ్యులతో కుట్టిస్తున్నామని, వీటి ద్వారా రూ.5,34,000 మొత్తం ఆదాయం సమకూరనుందని అధికారులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు ఉపాధి కల్పించాలని ఉద్దేశంతో యూనిఫాంలు కుట్టించే బాధ్యత అప్పగించిందని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు త్వరితగతిన యూనిఫాంలు పూర్తి చేసి ఇవ్వాలని సూచించారు. ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, పనిని పూర్తి చేయాలని పేర్కొన్నారు.పరిశీలనలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్, ఇంచార్జి తహసీల్దార్ మురళి, ఎంపీడీఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు ఏం చేస్తున్నారు? రాష్ట్రంలో ఇంటెలిజెన్స్ వ్యవస్థ పనిచేస్తుందా? అధికార పార్టీకి చెందిన నాయకులు ఇలాంటి చర్యలకు పాల్పడుతుంటే పోలీసులు ప్రేక్షక పాత్ర పోషించడం అనేక అనుమానాలకు తావిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయ కక్ష సాధింపులు, బెదిరింపులు, దాడులతో ప్రతిపక్షాలను అణచివేయాలని చూస్తోంది. కానీ బీజేపీ కార్యకర్తలు ఎలాంటి బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదు.కేంద్ర హోంశాఖ మంత్రి శ్రీ అమిత్ షా దిష్టిబొమ్మ దహనం చేసిన వారిపైనా, బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై దాడికి పాల్పడిన వారిపైనా వెంటనే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి...ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ రేవంత్ రెడ్డి బీజేపీకి, తెలంగాణ ప్రజలకు వెంటనే క్షమాపణ చెప్పాలి.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు దారి నరసింహా చారి మాజీ మండలం దీక్షలు గుడి రవీందర్ రెడ్డి మండల ప్రధాన కార్యదర్శి మెరుపుల గంగాధర్ గౌడ్, రాజేంద్రప్రసాద్, మండల ఉపాధ్యక్షులు ఇల్లందుల బాలయ్య సీనియర్ నాయకులు సారంపల్లి రాజు, గంగాధర్ చారి, రమేశ్, దుస శ్రీకాంత్, ప్రసాద్ పాల్గొన్నారు.

వార్తకు స్పందన

బురద రోడ్డుగా మారిన బర్రెంకల కట్ట అనే వార్తకు ఎస్సి సబ్ ప్లాన్ కింద నిధులు మంజూరు చేస్తానని హామీ

ముస్తాబాద్ ప్రభాత వార్త:



గూడెం గ్రామములో వందలాది మంది రైతులు నడిచే రోడ్డు గురించి,, బురద రోడ్డుగా మారిన బర్రెంకల కట్ట,,అనే వార్తను ఇటీవలే వార్త దిన పత్రికలో ప్రచురించగా స్పందన లభించింది.సోమవారం రాత్రి గూడెం గ్రామము మీదుగా సిరిసిల్ల వైపు వెళ్తున్న రాష్ట్ర ఎస్సి ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్క వెంకటయ్యను గూడెం గ్రామ రైతులు కలిసి బురద మయంగా మారిన బర్రింకల కట్ట రోడ్డు గురించి వివరించగా వెంటనే స్పందించి మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గూడెం గ్రామ రైతులు డంబర్ రోడ్డు



మంజూరు కోసం ఇచ్చిన వినతి పత్రంకు ఎస్సి సబ్ ప్లాన్ కింద నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమములో గ్రామ సర్పంచ్ తాటిపెల్లి శంకర్,గూడెం గ్రామ మాజీ ఎంపీటీసీ చిటీనేని శ్రీనివాస్ రావు,ఉప సర్పంచ్ దగ్గు భవిత నవీన్ లు,వార్డు సభ్యులు గంగాధరి రమేష్ లు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ పార్టీ సన్నాహక సమావేశం

బిఆర్ఎస్సే రావలంటున్న మండల ప్రజలు

ముస్తాబాద్ ప్రభాత వార్త:



కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీలను ఎండకడుతూ బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు బొంపెల్లి సురేందర్ రావు ఆధ్వర్యములో మంగళవారం సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ నేతలు మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని అన్నారు.రైతులకు యూరియా,కరెంట్ 1000 రోజుల పరిపాలనలో పూర్తిగా విపలమైందని,ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెలతామని బిఆర్ఎస్ నాయకులు అన్నారు.ఈ కార్యక్రమములో మాజీ రైతు బంధు అధ్యక్షులు కల్వకుంట్ల గోపాల్ రావు,మాజీ ఎంపీపీ శరత్ రావు,సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి,అక్కరాజు శ్రీనివాస్,బత్తుల అంజయ్య,పట్టణ అధ్యక్షులు ఎద్దండి నరసింహా రెడ్డి,నవాజ్,రాజేశం గౌడ్,విజయ రామారావు,తదితరులు పాల్గొన్నారు.

ఎల్లయ్యకుంట చెరువుకు మరమ్మతులు

చందుర్తి,సెప్టెంబర్ 1 ప్రభాతవార్త



చందుర్తి మండలం దేవుని తండా గ్రామ పంచాయతీ పరిధిలోని ఎల్లయ్య కుంటకు గ్రామస్తులు మంగళవారం మరమత్తు పనులను చేపట్టారు. ఎల్లయ్య కుంట చెరువు కట్ట తెగిపోయే ప్రమాదకర పరిస్థితిలో ఉండటంతో సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు మరమ్మత్తులు చేపట్టారు.

డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో అక్రమాలపై ఎంపీడీవో బాబు సీరియస్

దళారులపై కేసులు, అనర్హులకు ప్రొసీడింగ్స్ రద్దు

కమలాపూర్: ప్రభాత వార్త.

పేదల సొంతింటి కల అయిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పంపిణీలో ఎలాంటి అక్రమాలకు తావులేదని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీవో బాబు హెచ్చరించారు.

అక్రమ వసూళ్లపై కొరడా: కొంతమంది దళారులు, మధ్యవర్తులు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇప్పిస్తామని, మీ పేర్లు లిస్ట్ లో ఉన్నాయని చెప్పి అమాయక లబ్ధిదారుల నుండి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు. ప్రభుత్వం పేదలకు పూర్తి ఉచితంగా ఇళ్లు అందిస్తోందని, ఇందుకోసం ఒక్క రూపాయి కూడా ఎవరికీ ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఎవరైనా డబ్బులు అడిగితే వెంటనే తమకు లేదా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని, ఎంతటి వారైనా ఉపేక్షించేది



లేదని తేల్చి చెప్పారు.

అనర్హుల ప్రొసీడింగ్స్ రద్దు: అదేవిధంగా ఇప్పటికే ప్రొసీడింగ్స్ తీసుకున్న లబ్ధిదారులలో ఎవరైనా అనర్హులని విచారణలో తేలితే ఎట్టి పరిస్థితుల్లోనూ వారి ప్రొసీడింగ్స్ ను తిరిగి వెనక్కి తీసుకుంటామని హెచ్చరించారు. ఇళ్ల కేటాయింపులో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని, ప్రతి ఒక్కరి వివరాలను క్షేత్రస్థాయిలో మరోసారి పూర్తిస్థాయిలో విచారణ జరుపుతున్నామన్నారు. ఆదాయం, సొంత ఇంటి స్థలం, ఇతర ప్రభుత్వ పథకాల ద్వారా ఇళ్ల పొందడం వంటి అంశాలను పరిశీలిస్తామని, తప్పుడు పత్రాలతో ఇళ్ల పొందినట్లు తేలితే ప్రొసీడింగ్స్ రద్దు చేసి ఆ ఇళ్లను నిజమైన అర్హులకు కేటాయిస్తామని స్పష్టం చేశారు. ఈ విషయంలో ఎవరి సిఫార్సులకు తావులేదని, అర్హులైన పేదలకు మాత్రమే న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

హుజురాబాద్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలి

మంత్రి శ్రీధర్ బాబుకు మున్సిపల్ పాలకవర్గం వినతి

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:

హుజురాబాద్ పురపాలక సంఘం పరిధిలోని పలు వార్డుల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు పట్టణ సర్వతోముఖాభివృద్ధికి అవసరమైన ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును హుజురాబాద్ మున్సిపల్ పాలకవర్గం కోరింది. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ వొడితల ప్రణవ్ బాబు ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్ పర్సన్ రొంటాల సుహాసిని, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. పట్టణంలోని ప్రధాన రహదారుల విస్తరణ, అంతర్గత మురుగు కాలువల నిర్మాణం, తాగునీటి సరఫరా వ్యవస్థ పటిష్టత, వీధి దీపాల నిర్వహణ, పార్కులు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి అవసరమైన నిధులను విడుదల చేయాలని



వారు మంత్రికి వివరించారు. మున్సిపల్ పాలకవర్గం విన్నపంపై మంత్రి శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించారు. ప్రజా సమస్యల పరిష్కారం, పట్టణాల సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. హుజురాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం సంపూర్ణంగా కట్టుబడి ఉందని, త్వరలోనే అవసరమైన మేరకు ప్రత్యేక నిధుల కేటాయింపునకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ప్రజా సమస్యలపై నిరంతరం దృష్టి సారిస్తూ వార్డుల అభివృద్ధికి కృషి చేయాలని పాలకవర్గానికి మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో పలు వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:

అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఉద్యోగ రిటైర్డ్ ఉద్యోగుల వ్యతిరేక విధానాలను మానుకోవాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని నిరసనలు, ఆందోళనలు జరిపారు. మంగళవారం హుజురాబాద్ పట్టణంలోని రెవెన్యూ కార్యాలయం ఎదుట రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిపారు. ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని, ఇప్పుడున్న సిపిఎస్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉద్యోగుల పట్ల నిరంకుశ వైఖరి అవలంబించడం దారుణం అన్నారు. పెన్షనర్లకు ప్రభుత్వం నుండి రావలసిన బకాయిలను ఇవ్వకుండా చోద్యం చూస్తుందని అన్నారు. ప్రభుత్వ నిరక్ష్యం వల్ల ఎంతో మంది రిటైర్డ్ ఉద్యోగులు మానసిక క్షోభకు గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే ఉద్యోగ,



పెన్షనర్ల జేఏసి తరపున ఆందోళనను తీవ్రతరం చేస్తామని అన్నారు. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల ముందు ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పెన్షనర్ల విద్రోహ దినాన్ని పాటించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మహ్మద్ ఉస్మాన్ పాషా, గంజి జయవర్ధన్, దుర్గాజీ, చంద్ర సేన, ఇలాసాగరం వీరస్వామి, సొల్లు సారయ్య, గోపాల రావు, నర్సయ్య, చారుదత్తు, లక్ష్మీ నారాయణ, ఉద్యోగ సంఘ నాయకులు పోలంపల్లి ఆదర్శన్ రెడ్డి, మేరీ శోభారాణి, సత్య ప్రసాద్, సంజీవ్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఎంఈఓ మురళి నాయక్

సుద్దాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆటల పోటీలు

కోనరావుపేటరూరల్, ప్రభాతవార్త:



క్రీడలతోనే విద్యార్థులకు మానసికోలాసం లభిస్తుందని మండల విద్యాధికారి మురళి నాయక్ అన్నారు. మంగళవారం కోనరావుపేట మండలం సుద్దాల జెడ్పి ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ క్రీడా పోటీలు నిర్వహించగా, ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆయన మాట్లాడారు.. క్రీడల్లో గెలుపు ఓటములు సమానంగా స్వీకరించాలన్నారు. క్రీడలను అలవర్చుకుంటే చెడు వేసినాలకు దూరంగా ఉంటారని, అంతేకాకుండా విద్య పట్ల కూడా శ్రద్ధ చూపాలన్నారు. ఈ క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులతో పాటు భోజన సౌకర్యం కల్పించిన స్థానిక సర్పంచి కుంటెల్లి నాగరాజును ఆయన అభినందించారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుంటేల్లి నాగరాజు, ఎస్ఎంసి చైర్మన్ ఎల్లయ్య, ప్రధానోపాధ్యాయురాలు మంజులదేవి, నాయకులు కాశవేణి మహేష్ యాదవ్, కచ్చకాయల మహేష్, నీరటి సంజీవ్, సుంకరి మహేష్, వార్డు సభ్యులు విజయ్,బాబు,వంశి, ఆయగ్రామాల వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టిజిఇ జేఏసీ ఆధ్వర్యంలో ఎంఆర్సి కార్యాలయం ముందు నిరసన

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;

టీజీఇ జేఏసీ ఆధ్వర్యంలో సాయంత్రం సమయంలో జమ్మి కుంట



ఎమ్మార్సీ కార్యాలయం ముందు వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎస్ రద్దు పరచి పాత పెన్షన్ విధానాన్ని అమలుపరిచే విధంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని ఆశిస్తూ వివిధ ఉపాధ్యాయ సంఘం నేతలు ఉపాధ్యాయులు జమ్మికుంట మండల ఎంఆర్సి ముందు శాంతియుత, నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేయడం జరిగింది. పక్కనున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న 2003 డీఎస్సీ ఉపాధ్యాయ మిత్రులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేశారు.అదేవిధంగా తెలంగాణ రాష్ట్రంలో కూడా 2003 డిఎస్సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తూ 2003 తర్వాత ఎన్నిక కాబడిన ఉపాధ్యాయ ఉద్యోగ మిత్రులందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఉపాధ్యాయ సంఘం నేతలు కోరారు. ఈ కార్యక్రమంలో టియుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు దబ్బెట రవీందర్,ఎస్టియుటిఎస్ జమ్మికుంట మండల అధ్యక్షులు నాగరాజు స్వామి పి ఆర్ టి యు టి ఎస్ కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ జమ్మికుంట మండల డిటిఎఫ్ ప్రధాన కార్యదర్శి, కుమార్ స్వామి టిఆర్టిఎఫ్ జమ్మికుంట మండల అధ్యక్షులు, తిరుపతి ప్రెసిడెంట్ మరియు కుర్ర సమ్మయ్య ,ఏ తిరుపతి, బి రాజు, ఆర్ సుజాత సీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి పల్లె దవఖానను నేషనల్ క్వాలిటీ సర్వీసెస్ అసెస్మెంట్ టీం పరిశీలన

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;



కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని కొత్తపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం (పల్లె దవాఖాన)కు నేషనల్ క్వాలిటీ సర్వీసెస్ అసిస్మెంట్ టీం జాతీయ స్థాయి గుర్తింపు సర్టిఫికెట్ కోసం నాణ్యత ప్రమాణాల పరిశీలన కొరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కొత్తపల్లి పల్లె దవఖానను పరిశీలించారు.ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో ఏమేమి ఉన్నాయి పేషెంట్లకు ఇచ్చిన మందులు సర్వీసెస్ గురించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పర్యవేక్షించారని జాతీయస్థాయి గుర్తింపు సర్టిఫికెట్ ఇస్తారని డిప్యూటీ డిహెచ్ఎంఒ డాక్టర్ ప్రభుదాస్ తెలిపారు. డివిజన్ లో ఉన్న అన్ని ఆరోగ్య ఉప కేంద్రాలకు జాతీయస్థాయి గుర్తింపు రావడం కొరకు కృషి చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో. నేషనల్ టీం ఎన్ హెచ్ ఎస్ ఆర్ సి అస్సేసర్స్ డాక్టర్ దినేష్ కుమార్,డాక్టర్ జియార్జ్ ఇమ్మానియేల్, స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ పోల్నేని అజయ్ రావు, వైద్యాధికారులు డాక్టర్ చందన, డాక్టర్ మహోన్నత పటేల్, సి హెచ్ ఓ దిలీప్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సదానందం, డిపిఒ స్వామి,డిస్ట్రిక్ట్ హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్ గౌడ్,క్వాలిటీ ప్రాజెక్టు మేనేజర్ అనిల్ కుమార్, సూపర్వైజర్ కొండపాక సదానందం,క్వాలిటీ అసిస్టెంట్ అఖిల్,ఏఎన్ఎంలు వాణి, మంజుల,శ్రీముఖ ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అధికారులు అందుబాటులో ఉండాలి

హుజురాబాద్, టౌన్, ప్రభాత వార్త:



రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంచడంతో పాటు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, డీలర్లు నిరంతరం పర్యవేక్షి ంచాలని జిల్లా వ్యవసాయ అధికారి అదనపు బాధ్యతలు చేపట్టిన చత్రు నాయక్ సూచించారు. మంగళవారం హుజురాబాద్ రైతు వేదికలో రైతులతో కలిసి రైతు నేస్తం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు, డీలర్లు, రైతులు ఆయనకు ఘన స్వాగతం పలికి సత్కరించారు. ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమానికి రైతులు హాజరై వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ ఏడీఏ జి. సునీత, ఎంఏవోలు భూమిరెడ్డి, ఖాదర్ హుస్సేన్, ఏఈవోలు, డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

పిఆర్టియుటిఎస్ మండల అధ్యక్షుడిగా పంజాల కృష్ణమూర్తి

జమ్మికుంట టౌన్ ప్రభాతవార్త;



పిఆర్టియుటిఎస్ మండల అధ్యక్షుడిగా పంజాల కృష్ణమూర్తి ఎన్నికయ్యారు. జమ్మికుంట పట్టణంలో పి ఆర్ టి యు టి ఎస్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఏ కరుణాకర్ రెడ్డి ఎం జైపాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జమ్మికుంట మండల టి ఆర్ టి యు టి ఎస్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. మండల అధ్యక్షుడిగా పి కృష్ణమూర్తి ప్రధాన కార్యదర్శిగా సిహెచ్ ప్రవీణ్ కుమార్ అసోసియేట్ అధ్యక్షులుగా రవీందర్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ పి ఆర్ సి ప్రకటించాలని సిపిఎస్ రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశానికి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వెంకటరాజ్యం తిరుపతిరెడ్డి రాజేంద్రప్రసాద్ ప్రభాకర్ రెడ్డి అచ్చ మురళి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.